

సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు - లేఖలు
రూ॥200/- పేజీలు:290
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



రాజ్యాంగ విలువల కోసం ప్రతిపక్షం పోరాటం 06

'మఖానా' శ్రమ దోచుకుంటున్న దళారులు 05

ప్రజాస్వామ్యం, కుల వ్యవస్థ కలిసి ఉండలేవు



సంపుటి 08, సంచిక: 266 | మంగళవారం | 26-08-2025 | ఖమ్మం   Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**   పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# ప్రపంచ స్థాయికి ఉస్మానియా వర్సిటీ

- 'ఆక్స్‌ఫర్డ్' తరహా ప్రమాణాలను పెంచాలి
- రూ.వెయ్యి కోట్లు ఖర్చుపెట్టడానికైనా ప్రభుత్వం సిద్ధమే
- ఇంజనీర్లు, విద్యాశాఖ విభాగాలకు చెందిన ప్రతినిధులతో కమిటీ వేసి అంచనాలను రూపొందించండి
- డిసెంబర్‌లో మళ్లీ విశ్వవిద్యాలయానికి వస్తా
- అక్కడే నిధులు మంజూరు చేస్తా : సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- సాయుధరైతాంగ పోరాటంలో ఎర్రజెండా మోసిన ఎంతో మందికి ఒయు అండగా నిలిచిందని వ్యాఖ్య
- ఇరవై ఏళ్ల తర్వాత ఒయులో ఒక ముఖ్యమంత్రి ప్రసంగం
- బిఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఉస్మానియా వర్సిటీకి బతుకుండదని ఆవేదన
- రూ.90 కోట్లతో నిర్మించిన వసతి గృహ భవనాల ప్రారంభం
- వాటికి దుందుభి, భీమా వసతి భవనాలుగా నామకరణం
- డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూములకు శంకుస్థాపన

దేశానికి అతిపెద్ద సంపద యువతే. అలాంటి యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒయు చదువులకే కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. గంజాయి, డ్రగ్స్ నియంత్రించేందుకు ఈగల్ సంస్థను ఏర్పాటు చేస్తే కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇంతకు గంజాయి, డ్రగ్స్ విక్రేతలతో లాలూచీ ఏమిటీ?. డ్రగ్స్ తీసుకుంటే పట్టుకోవద్దా?. గంజాయి, డ్రగ్స్‌ను అందరూ తీసుకోవచ్చనే రాజ్యాంగం ఏమైనా ఉంటే చూపించాలి

– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'ఆక్స్‌ఫర్డ్' లాంటి ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల తరహా ప్రమాణాలను పెంచాలని, అందుకు అవసరమైతే వెయ్యి కోట్ల రూపాయలైనా ఖర్చు పెట్టడానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎవరో లక్ష కోట్లతో కట్టింది కూలిందని,గంగలో పోయిందని,'మీ కోసం వెయ్యి కోట్లు ఖర్చుపెట్టడానికి తమకు ఏమైనా దారిద్ర్యమా? అని అన్నారు. ఇంజనీర్లు, విద్యాశాఖ విభాగాలకు చెందిన ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఒయులో కావాల్సిన అన్ని అవసరాలకు తగిన అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, వాటిని పూర్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. డిసెంబర్‌లో ఒయులోని ఆర్ట్స్ కళాశాల వద్ద సభను నిర్వహించి, ఆ సభ వేదికపై నుంచే ఒయుకు అవసరమైన నిధులను, ఇతర అనుమతులను అప్పటికప్పుడే మంజూరు చేస్తామని సిఎం హామీనిచ్చారు. మరో ఆరునెలల్లోనే మరో 40వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని, రెండున్నరేళ్ల తమ పాలనలో లక్ష ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో తాము ముందుకెళ్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని రూ.90 కోట్లతో నిర్మించిన వసతి గృహ తరువాయి 2లో

కమ్యూనిస్టులకు రాజకీయ అధికారం దక్కితేనే

# సోషలిస్టు ఇండియా




సిపిఐ ఎపి రాష్ట్ర మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**ఒంగోలు:** గ్రామస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని విస్తరించి బలోపేతం చేస్తే రానున్న రోజుల్లో రాజకీయ అధి కారం సిపిఐదేనని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. ఒంగోలులో జరుగుతున్న సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభల సందర్భంగా రెండో రోజు ప్రతినిధుల సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ దేశంలో మతతత్వశక్తుల ప్ర మేయం అధికమైపోతుందని దాన్ని అడ్డుకునే శక్తి కమ్యూనిస్టు పార్టీలకే ఉందన్నారు. సోషలిస్ట్ ఇండి యాగా అవతరించాలంటే, రాజకీయ అధికారం కమ్యూనిస్టు పార్టీలకు దక్కాలని, అందుకు ప్రజా పోరాటాలు విస్తృతం చేసి క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ట పరచాలని ప్రతినిధులకు నొక్కి చెప్పారు. ఎపిలో సమర్థవంతమైన నాయకత్వం ఉందని, ఐ క్యంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని ఈ మహాసభలు వేదికగా ముందుకు వెళ్లాలని కోరారు.ట్రంప్ డైరెక్ష న్‌లో భారత్ నడవడం ఏమిటని, ఇజ్రాయిల్ దాడిని భారత్ సమర్థించడం దుర్మార్గమన్నారు. దేశంలో మతతత్వ శక్తుల దాడులు పెరిగి పోయాయని, ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను బిజెపి అమ లు చేస్తునదని, రాష్ట్రంలో చంద్రబాబు బిజెపికి మద్దతు తెలుపు తున్నారని మండిపడ్డారు. పార్ల మెంటరీ ప్రజాస్వా మ్యంలో చీకటి రోజులు వస్తు న్నాయన్నారు. వీట న్నింటినీ ఎదుర్కోవాలంటే సిపిఐ క్షేత్ర స్థాయిలో బలోపేతం కావాలని, ప్రతి ఎన్నికల్లో పోటీ చేయా లని పిలుపునిచ్చారు. మహాసభలో వేదికపై సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఎపి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జల్లివిల్సన్, అక్కినేని వనజ ముప్పాళ తదితరులు ఆసీనులయ్యారు.

## ప్రశ్నించే తత్వం కమ్యూనిస్టు లక్షణం

### సిపిఐ ఎపి మహాసభలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



వందేళ్లు సజీవంగా ఉన్న పార్టీ కమ్యూనిస్టు పార్టీయేన ని, ప్రజల కోసం పుట్టిన సిద్ధాంతంతో ఘోష, గొంతుకతో ఉన్నాం కాబట్టే వందేళ్లుగా సిపిఐ ఎన్నో చారిత్రక పోరాటాలు నిర్వహించిందని, ప్రశ్నించే తత్వం ఉన్నంతకాలం కమ్యూనిజం సజీవంగానే ఉంటుందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చెప్పారుకమ్యూనిజం కాలం చెల్లిన సిద్ధాంతమని ప్రచారం చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టే బాధ్యత ప్రతీ కమ్యూనిస్టుపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సిద్ధాంతంపై అవగాహన, మనపట్ల మనకు విశ్వాసం, నమ్మకం పెంచుకోవాలని హితవు పలికారు. నిత్య అధ్యయనం ద్వారా అలుపెరగని పోరాటం చేస్తేనే ప్రజలలో పార్టీకి స్థిరమైన బలం పెరుగుతుందన్నారు. మరణం తర్వాత కమ్యూనిస్టు పార్టీ నేతలకు విశే ష ఆదరణ లభిస్తుందన్నారు. ఇటీవల సీతారాం ఏచూరి, సురవరం సుధాకరరెడ్డి అంతిమయాత్రలకు ప్రజాదరణ దీనికి అద్దం పడుతుందన్నారు. సురవరం సుధాకరరెడ్డికి వేలాదిమంది కమ్యూనిస్టు కార్యకర్తలు, నేతలు ఘన నివాళులు అర్పించారని కొనియాడారు.

## బిసి రిజర్వేషన్‌లపై ఢిల్లీలో సంప్రదింపులు



- అభిషేక్ మను సింఘ్వీతో చర్చించిన సిఎం, డిప్యూటీ సిఎం
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- ఖర్గేను కలిసిన ముఖ్యమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల కల్పనపై తెలంగాణ రాజ్యసభ ఎంపి, సుప్రీం కోర్టు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీతో ఢిల్లీలోముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కలు సంప్రదింపులు జరిపారు. ఇదే అంశంపై వేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి పొన్నం ప్రభాకర్,సీతక్క ,శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నేతలు ఈరవత్రి అనిల్ , వినయ్ కుమార్‌లు ఢిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. అంతకుముందు న్యూఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.సి.వేణుగోపాల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, తదితర అంశాలపై చర్చించినట్టు సమాచారం.

## రాష్ట్ర వాటా యూరియా కోసం ఎంతవరకైనా పోరాడుతాం

- యూరియా దిగుబడి చేసుకోవడంలో ఘోరంగా విఫలమైన కేంద్రం
- రైతులకు బహిరంగ లేఖ రాసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం / హైదరాబాద్

ఇతర దేశాల నుండి యూరియాను దిగుమతి చేసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేంద్రం కేటాయింపులు, సరఫరాలు, స్వదేశీ యూరియా, దిగుమతి యూరియా వివరాలు, ప్రస్తుత పరిస్థితులపై తెలంగాణ రైతాంగానికి మంత్రి తుమ్మల బహిరంగ లేఖ రాశారు. లేఖలోని సారాంశం ఈ విధంగా ఉన్నాయి. రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే తెప్పించడానికి కేంద్రంతో ఎంత వరకైనా పోరాడుతామన్నారు.

ఇప్పటికే పాత నిల్వలతో కలుపుకొని 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు. ఇటీవల యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిందిస్తూ తరువాయి 2లో




## యువతపట్ల సర్కార్‌కు చింతలేదు

- దొంగ ఓట్లతో అధికారంలోకి రావడమే వారి పని
- కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపాటు
- ఎస్ఎస్‌సి అభ్యర్థిపై లాఠీచార్జి అమానుషమని విమర్శ

**న్యూఢిల్లీ :** రాంలీలా మైదానంలో నిరసన తెలుపుతున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టింది. ఓట్లను దొంగిలించడం ద్వారా అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వానికి యువత భవిష్యత్తు గురించి ఆందోళన లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. పరీక్షను మెరుగ్గా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాంలీలా మైదానంలో ఎస్ఎస్‌సి విద్యార్థులు, శిక్షకులు నిరసన తెలిపారు. అయితే, ప్రదర్శనకారులపై లాఠీఛార్జ్ చేశారనే ప్రతిపక్ష పార్టీల వాదనలను పోలీసులు తోసిపుచ్చారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశ యువత భవిష్యత్తును దొంగిలించడం మోదీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఎస్ఎస్‌సి పరీక్షల్లో రిగ్గింగ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై మోదీ ప్రభుత్వ కీలుబొమ్మ పోలీసులు జరిపిన క్రూరమైన లాఠీచార్జ్ తీవ్రంగా ఖండించదగినదన్నారు. గత 11 సంవత్సరాలుగా బిజెపి యువత నియామక పరీక్షల నుండి తరువాయి 12లో



## వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు

వర్ధన్నపేట జనహిత పాదయాత్రలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

12

## అమిత్ షా వ్యాఖ్యలపై రిటైర్డ్ జడ్జీల ఆగ్రహం



సల్వా జుడుం తీర్పుపై కేంద్ర హోంమంత్రి అబద్ధాలు చెప్పడం దురదృష్టకరమని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** సల్వా జుడుం తీర్పుకు సంబంధించి ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డిపై హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం 'దురదృష్టకరం' అని పదవీ విరమ ణ చేసిన న్యాయమూర్తుల బృందం అభివర్ణించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును ఒక ఉన్నత రాజకీయ అధికారి పక్షపాతపూరితంగా తప్పుగా అర్థం చేసుకోవడం న్యాయమూర్తులపై చిరాకు కలిగించే ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, మదన్ బి.లోకూర్, జె.చలమేశ్వర్ వంటి 18 మంది రిటైర్డ్ న్యాయమూర్తుల బృందం పేర్కొం ది. న్యాయమూర్తుల ప్రకటనను ఉటంకిస్తూ, కాంగ్రెస్ హోంమంత్రిని విమర్శించింది. భారతదేశంలో ఇంకా ఆయనను విమర్శించే ధైర్యం ఉన్న వ్యక్తులు ఉన్నారని పేర్కొంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన సుదర్శన్‌రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. సల్వా జుడుం తీర్పు తరువాయి 12లో

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ

- ఏడుగురు అరెస్ట్, డ్రగ్స్ స్వాధీనం
- నిందితులు రాజమండ్రి, బెంగళూరు వాసులు
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ జోన్ డిసిపి వినీత్

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి




రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని రాజేశ్వరి సర్వీస్ అపార్ట్‌మెంట్ లో రహస్యంగా రేవ్ పార్టీ నిర్వహిస్తున్నారన్న పక్క సమాచారంతో ఈగల్ తెలంగాణ, సైబర్ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇద్దరు డ్రగ్స్ ఫ్లడర్ల తో పాటు ఒక ట్రాన్స్‌ఫోర్టర్, నలుగురు మత్తు మందు తీసుకుంటున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ జోన్ డిసిపి వినీత్ తెలిపారు. రేవ్ పార్టీకి గంజాయి, డ్రగ్స్‌ను గోవా, రాజమండ్రి, బెంగూళూరు నుండి తీసుకొచ్చి సరాఫరా చేస్తున్నారని నిందితులంగా డ్రగ్స్‌కు అలవాటు పడిన పాత వారేనని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో రాహుల్, నీలిమా,తేజ, విక్రమ్, చందన్, పురుషోత్తం రెడ్డి, భార్గవ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 20 గ్రాములు కోకైయిన్, 08 గ్రాముల ఎక్టాసిఫిల్స్, 3 గ్రాముల ఎంఎండిఎ మత్తు పదార్థలతో పాటు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్ తరువాయి 2లో

## అనుమతుల్లేని కేబుళ్లను తొలగించండి

ప్రభుత్వానికి హైకోర్టు మరోసారి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



విద్యుత్తు స్తంభాలకు అనుమతి లేకుండా ఉన్న కేబుళ్లను వెంటనే తొలగించాలని ప్రభుత్వానికి హైకోర్టు సోమవారం ఆదేశించింది. అనుమతులు ఉన్న వాటిని గుర్తించి, అవి ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటే చట్ట ప్రకారం నోటీసు లు జారీ చేసి చర్యలు తీసుకోవాలంది. వాటిపై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అంతేగాకుండా అనుమతులున్న కేబుల్ ఏజెన్సీలు అనధికారిక కేబుళ్లను తొలగించడానికి విద్యుత్తు సిబ్బందికి సహకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ కేబుళ్లను తొలగించడానికి, ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా ఉంటేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, టీజీఎస్పీడీసీఎల్ లకు గత విచారణలో ఆదేశించిన మేరకు సోమవారం అఫిడవిట్లను దాఖలు చేశాయి. విద్యుత్ తరువాయి 2లో

## గాజా ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడి ఐదుగురు జర్నలిస్టులు మృతి

15 రోజులు గడవకముందే జర్నలిస్టులపై రెండోసారి హత్యాకాండ




**గాజా:** దక్షిణగాజాలోని గాజా నస్సెర్ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ సైనిక దళం (ఐడిఎఫ్) మరోసారి దాడులు చేసింది. దాడుల్లో అంతర్జాతీయ మీడియా తరపున పనిచేసే ఐదుగురు జర్నలిస్టులు మరణించారు. రాయిటర్స్,అసోసియేటెడ్ ప్రెస్,అమెరికా ఎన్‌బిసి న్యూస్‌నెట్‌వర్క్, అల్‌జజీరా తరపున పనిచేస్తున్న జర్నలిస్టులు, కెమేరామన్‌లు ఈ దాడుల్లో మరణించారు. 15 రోజులు గడవకముందే జర్నలిస్టులపై ఐడిఎఫ్ మరోసారి హత్యాకాండకు పాల్పడింది. సోమవారం తెల్లవారుజామున రెండుసార్లు జరిపిన దాడుల్లో జర్నలిస్టులు, సహాయ సిబ్బంది సహా మొత్తం 20 మంది మరణించారు. సెంట్రల్ గాజాలో ఆహార పంపిణీ కేంద్రం వద్దకు వెళుతున్న మరో ఆరుగురు సహాయబృందం కూడా ఐడిఎఫ్ కాల్పులో మరణించినట్లు అల్ అవ్దా ఆసుపత్రివర్గాలు తెలిపాయి. కాంట్రాక్టు పద్ధతిలో తమకోసం పనిచేస్తున్న ఫోటో జర్నలిస్టు హస్సెమ్ అల్ మస్త్రీ హత్యకు గురైనట్లు రాయిటర్స్ ప్రకటించింది. రాయిటర్స్‌కు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్ షార్ట్ ఫిలింకు అంతర్జాతీయ గుర్తింపు

**ఢాకా:** బంగ్లాదేశ్ లో నిర్మించిన "హ్యాపీ బర్త్ డే" అనే బ్లాక్ కామెడీ షార్ట్ ఫిల్మ్‌కు అంతర్జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఇటీవలికాలంలో బంగ్లాదేశ్ చిత్రపరిశ్రమ క్రమంగా అంతర్జాతీయ వేదికలపై చోటు సంపాదించేందుకు కృషి చేస్తోంది. ఇందులోభాగంగా రుస్తాన్ తారిఖ్ నిర్మించిన 19 నిమిషాల నిడివిగల షార్ట్‌ఫిల్మ్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సామాన్య ప్రజల సమస్యలు, ఆవేదనలను మేళవించి ఈ డార్క్ కామెడీ ఫిల్మ్ రూపొందించారు. కుటుంబానికి అంకితమైన ఒక సామాన్య మనిషి దీర్ఘకాలంగా అణగదొక్కి ఉంచుకున్న కోరికలను నెరవేర్చుకునేందుకు చేసిన ప్రయత్నమే హ్యాపీ బర్త్ డే షార్ట్ ఫిల్మ్. ఇప్పటికే దీనికి ఏథెన్స్‌లోని ఇంటర్నేషనల్ మంత్లీ ఆర్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గుర్తింపు లభించగా, టర్కీలో జరిగే అనటోలియా ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్‌కు కూడా అధికారికంగా ఎంపికైంది.




# కోక్స్‌బజార్ రోహింగ్యాలను ఇక పోషించలేం

### చేతులెత్తేసిన బంగ్లానేత యూనుస్




**కాక్స్‌బజార్:** లక్షలాదిగా బంగ్లాదేశ్‌కు తరలివచ్చి శరణార్థులుగా తలదాచుకున్న రోహింగ్యాలు తలకుమించిన భారంగా మారారని, ఇక వారిని పోషించలేమని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో మొత్తం 15 లక్షలమంది రోహింగ్యా శరణార్థులు కోక్స్‌బజార్‌లో తలదాచుకుంటున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థశిబిర కేంద్రంగా ఐక్యరాజ్యసమితి దీనిని గుర్తించింది.

ఈ సమస్య పరిష్కారానికి సహకారం అందించాలని ప్రపంచ దేశాలకు మహ్మద్ యూనుస్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థ శిబిరంగా పేరుగాంచిన ఆగ్నేయ బంగ్లాదేశ్ కోక్స్ బజార్‌లో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో మహ్మద్ యూనుస్ ప్రసంగించారు. రోహింగ్యాల సమస్యపై సెప్టెంబరులో ఐక్యరాజ్యసమితి ఒక అంతర్జాతీయస్థాయి సదస్సు నిర్వహించబోతోంది. దీనికి ముందుగా మహ్మద్ యూనుస్ ఆది, సోమవారాలలో ఈ సదస్సు నిర్వహించి ఈ శిబిరాన్ని పోషించడంలో ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను వివరించారు. 2017 నుండీ మయన్మార్‌లో జుంటా సైనికులు చేస్తున్న దారుణమైన హింస, అభద్రతాభావంతో లక్షలాదిమంది రోహింగ్యా ప్రజలు బంగ్లాదేశ్‌లోకి వలస వెళ్ళారు. వీరందరికీ అతిపెద్ద శరణార్థ కేంద్రాన్ని బంగ్లాదేశ్ ఏర్పాటు చేసింది. ఈ శరణార్థులను ఇక తాము పోషించలేమని, వారిని పోషించడానికి తగినన్ని నిధులు తమ దగ్గర లేవని, ప్రపంచదేశాలు ఈ సంక్షోభం నుండి తమను గట్టెక్కించాలని యూనుస్ విజ్ఞప్తి చేశారు. మయన్మార్‌లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇప్పటికీ అనేకమంది రోహింగ్యాలు తమ దేశంలోకి చొరబడి వస్తూనే ఉన్నారని చెప్పారు. దాదాపు 24 కి.మీ ప్రాంతాన్ని రోహిం గ్యా శరణార్థులకోసం కేటాయించి వారికి శిబిరాలను బంగ్లాదేశ్ నిర్మించి ఆశ్రయం కల్పించిందని ఆయన చెప్పారు. ఈ కోక్స్ బజార్‌లో అనధికారికంగా 15 లక్షలమందికి పైగా తలదాచుకుంటున్నారు.

# గాజాలో 6.40 లక్షలమందికి ఆకలి ముప్పు



**న్యూయార్క్ :** వచ్చే నెలాఖరునాటికి గాజాలో ఆకలి విధ్వంసం మొదలవుతుందని తాజా నివేదిక వెల్లడించింది. గాజాలో కరువు ఏర్పడిందని ఐక్యరాజ్యసమితి మద్దతుగల ఒక ప్రపంచ సేవాసంస్థ మూడురోజుల క్రితం ప్రకటించింది. గాజాలో 98 శాతం పంట భూమి వ్యవసాయానికి పనికిరాకుండా పోయింది.సెప్టెంబరు చివరినాటికి 6.40 లక్షలమంది ప్రజలు (30 శాతం గాజా ప్రజలు) ఆహార అభద్రతతో అత్యంత వినాశకరమైన ఆకలిబాధల బారిన పడతారని హెచ్చరించింది. ప్రతి 10,000 మంది ప్రజలకు గాను ఇద్దరు పౌరులు ప్రతిరోజూ ఆకలితో మరణిస్తున్నారని తెలిపింది. దాదాపు ఐదు లక్షలమంది ప్రజలు ఆకలి అంచున జతకుతున్నారు, సరైన ఆహారం లేక రెండు రోజులకు ఒకసారి ఒక పూట భోజనం చేస్తున్నారని పేర్కొంది. ఐతే ఈ ప్రకటనను ఇజ్రాయెల్ సునాయాసంగా తోసిపుచ్చింది. ఇవన్నీ కట్టుకథలని కొట్టిపారేసింది. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం గాజాలో ఇప్పటికే 273 మంది ఆకలితో మరణించారు. వీరిలో 119 మంది పిల్లలు ఉన్నారు. మరో 2000 మంది ఆహార కేంద్రాలవద్ద ఆహారంకోసం ఎదురుచూస్తున్న సమయంలో ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల్లో మరణించారు. అదేవిధంగా ప్రతి నెలా సగటున 540 మంది పిల్లలు మరణిస్తున్నారని యూనిసెఫ్ అధికారికంగా ప్రకటించింది.

**గాజా శివార్లలో ఇళ్ళు ధ్వంసం :** గాజా సిటీ శివారు ప్రాంతాలలో ఇజ్రాయెల్ సైన్యంఇళ్ళు ధ్వంసం చేస్తోంది. మిలిటరీ ప్రాంతాన్ని గాజాలో విస్తరిస్తామని ప్రతిజ్ఞచేసిన ఇజ్రాయెల్ అందుకు అనుగుణంగా పలు నిర్మాణాలను కూల్చివేస్తోంది. జబాలియాలో అనేక భవంతులను ట్యాంకులు, బుల్‌డోజర్లు కూలదోస్తున్నాయి. జైటూన్, షెజైల్‌లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, ఆహారాన్ని గగనతలమార్గంలో విడిచిపెట్టేందుకు ఇజ్రాయెల్ అనుమతించడంతో పలు దేశాలు ఎయిర్ డ్రాప్స్ చేస్తున్నాయి. ఐతే ఈ ఎయిర్ డ్రాప్స్ వల్ల చాలా ప్రమాదం ఉందని, ఐక్యరాజ్యసమితి సహాయ సంస్థల ద్వారా ఈ ఆహారం, ఇతర మానవతా సహాయాన్ని గాజాకు పంపాలని ఐక్యరాజ్యసమితి మొదటినుండీ చెబుతున్నది.

ఎయిర్ డ్రాప్స్ వల్ల శరణార్థులు తాత్కాలికంగా నిర్మించుకున్న శిబిరాలు ధ్వంసం అవుతున్నాయి. అందులో నివశిస్తున్నవారు ఎయిర్ డ్రాప్స్ సామాగ్రి వల్ల గాయాలపాలవుతున్నారు. దీంతో పాలస్తీనియన్లు ఎయిర్ డ్రాప్స్ ఆపాలని, రహదారిమార్గంలో సహాయం పంపాలని కోరుతున్నారు.

## జెనీవాలో నేడు ఇరాన్–ఇయు అణు చర్చలు



**జెనీవా:**ఇరాన్–యూరోపియన్ యూనియన్ దేశాలమధ్య మంగళవారం జెనీవాలో అణు చర్చలు జరుగుతాయి. 2015లో చేసుకున్న ఒప్పందంపై కొత్తగా మరోవిడత విదేశాంగశాఖ సహాయమంత్రులస్థాయిలో ఈ అణుచర్చలు జరుగుతాయని ఇరాన్ మీడియా సోమవారం ప్రకటించింది. జూన్ రెండోవారంలో ఇరాన్–అమెరికా మధ్య అణు చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా, ఇరాన్‌పై ఆకస్మికంగా ఇజ్రాయెల్ దాడిచేయడంతో 12 రోజులపాటు యుద్ధం కొనసాగింది. ఆ తర్వాత ఇరాన్ కీలక అణుస్థావరాలపై అమెరికా దాడులు చేసింది. తర్వాత జులై 25న ఒక విడత చర్చలు జరిగాయి. ఇప్పుడు రెండో విడత చర్చలు మంగళవారం జరుగుతాయి. తమదేశంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేసినాగానీ అంతర్జాతీయ అణు పర్యవేక్షణాసంస్థ ఐఎఇఎ ఈ దాడులను ఖండించలేకపోయిందని ఇరాన్ విమర్శించింది. ఇక తాము ఐఎఇఎకు సహకరించేదిలేదని కూడా స్పష్టం చేసిన తర్వాత ఎట్టకేలకు మళ్ళీ చర్చలు మొదలవుతున్నాయి.

## హిజ్బుల్లా ఆయుధాలు వదిలేస్తే లెబనాన్ నుండి వైదొలగుతాం : ఇజ్రాయెల్



**జెరూసలెం:**హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ గనుక ఆయుధాలు వదిలిపెడితే తమ సైనిక బలగాలు లెబనాన్ నుండి వైదొలగుతాయని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. ఈ ఏడాది చివరినాటికి హిజ్బుల్లా ఉగ్రవాదులను నిరాయుధులను చేయాలని గట్టి నిర్ణయం తీసుకున్న లెబనాన్ మంత్రివర్గానికి నెతన్యాహూ అభినందనలు తెలియజేశారు. ఈ విధంగా హిజ్బుల్లా గనుక ఆయుధాలు వదిలేస్తే తమ సైన్యాలు దక్షిణ లెబనాన్ ప్రాంతాన్ని దశలవారీగా విడిచి వెళ్ళిపోతాయన్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో హిజ్బుల్లా–ఇజ్రాయెల్ మధ్య గడచిన నవంబరునెలలో యుద్ధం ముగిసింది. ఐతే లెబనాన్‌లోని ఐదు పర్వతాలను తమ నియంత్రణలో ఉంచుకున్న ఇజ్రాయెల్ తమ దేశం వదిలివెళితేగానీ తాము ఆయుధాలు వదిలిపెట్టేదిలేదని హిజ్బు ల్లా కూడా మొండిపట్టుదలతో ఉంది. వారు దేశం వదిలివెళితేగానీ తాము ఆయుధాలు విడిచిపెట్టే విషయం గురిం చి చర్చలు జరిపేదిలేదని హిజ్బుల్లా ఉగ్రవాద నాయకత్వం స్పష్టం చేసింది. హిజ్బుల్లాపై రోజువారీ దాడులను ఆపేయాలని కూడా ఆ సంస్థ డిమాండ్ చేసింది. గాజాలో హమాస్ ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబరు ఏడో తేదీన దాడులు ప్రారంభించినప్పుడే హిజ్బుల్లా కూడా ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించింది. ఈ యుద్ధం 14 నెలలపాటు కొనసాగింది. యుద్ధం విరమించిన తర్వాత కూడా హిజ్బుల్లా తిరిగి తిరుగుబాటు సైన్యా న్ని తయారు చేస్తోందని ఇజ్రాయెల్ విమర్శిస్తున్నది. ఈ యుద్ధంవల్ల ఉత్తర ఇజ్రాయెల్‌లో 60,000 మంది నిరాశ్రయులయ్యారు.

## వియత్నాంను గడగడలాడిస్తున్న కజికి తుఫాను



**హనోయ్:** శక్తిమంతమైన 'కజికి' తుఫాను వియత్నాం తీరప్రాంతాలను గడగడలాడించింది. గడచిన 30 సంవత్సరాలలో ఇంతపెద్ద తుఫాను వియత్నాంను తాకలేదు. తుఫాను కారణంగా 15 లక్షలమంది ప్రజలకు విద్యుత్ సదుపాయం స్తంభించిపోయింది. వియత్నాం ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ఆదివారంనాడే పల్లపు ప్రాంతాల నుండి వేరేచోటకు తరలివెళ్ళిపోవాలని 5,86,000 మంది ప్రజలకు హెచ్చరించింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. గంటకు 133 కి.మీ వేగంతో గాలులతో కోస్తా ప్రాంతాలలో బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రానికి తుఫాను బీభత్సం కొనసాగుతుండగా, అనంతరం వరద ప్రమాదం కూడా ప్రజలకు పొంచి ఉంది. దీంతో వేలాదిమంది సైనికులను వియత్నాం ప్రభుత్వం సిద్ధంగా ఉంచింది. సహాయకార్యక్రమాల నిమిత్తం తర్వాత వీరిని రంగంలోకి దించుతారు. వివిధ క్రీడా స్టేడియంలు, ప్రభుత్వ భవనాలను నిరాశ్రయులకు కేటాయించి ప్రభుత్వ అధికారులు వారికి సదుపాయాలు సమకూరుస్తున్నారు. వియత్నాం ఉపప్రధాన మంత్రి టాన్ హోంగ్ హా సహాయ కేంద్రాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పారు. గత ఏడాది సెప్టెంబరులో కూడా ఇదే స్థాయిలో ఒక తుఫాను వియత్నాం, లావోస్, థాయ్‌లాండ్, మయన్మార్‌లను గడగడలాడించింది. ఆనాడు 500 మంది మరణించారు.

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

అయిన వారందరు రాజమండ్రి, బెంగుళూరు, కొండాపూర్ ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు. వీకెండ్ వచ్చిందంటే యువత రేవ్ పార్టీలని, డ్రగ్స్ పార్టీలకు బానిసలవుతున్నారని, డ్రగ్స్ నుండి యువత ఎంత దూరం ఉంటే అంత మంచిదని లేకుంటే వారి జీవితం వారే నాశనం చేసుకున్న వారౌతున్నారని నగర శివారులలో రేవ్ పార్టీలు నిత్యకృత్యమంగా మారి యువతను పెడదోవ పట్టిస్తున్నాయని ఎక్కడ రేవ్ పార్టీలు జరిగినా, డ్రగ్స్ అమ్మకం గురించి వివరాలు తెలిసినా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని మాదాపూర్ జోన్ డిసిపి వినీత్ తెలిపారు.

## ఎంతవరకెనా పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

సాగుతున్న రైతుల ఆందోళనలు,చెప్పులు పెట్టీ క్యూ లైన్ లు ఉండటంపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు ఏమిటి? యూరియా కొరతకు కారణాలు ఏమిటి? వాస్తవాలు దాచి పెట్టే పెద్దలు ఎవ్వరు? రైతుల ముసుగులో ప్రేరేపిత ఉద్యమాలు చేసే పార్టీలు ఏవీ?వ్యవసాయ శాఖ మంత్రిగా తెలంగాణ రైతన్నలకు వాస్తవాలు తెలియజేయాలని ఈ బహిరంగ లేఖ రాశానన్నారు.

**వాస్తవాలు ఇలా...** తెలంగాణ లో యూరియా కొరతకు రెండు ప్రధాన కారణాలు.మొదటిది మన రాష్ట్రానికి దిగుమతి ద్వారా కేటాయించిన యూరియా ప్రపంచ వ్యాప్తంగా జియో పాలిటిక్స్ నేపథ్యంలో సాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధాల వల్ల రెడ్ సీ లో నౌకాయనం నిలిచిపోయి రాష్ట్రానికి రాలేదు. ఆగస్టు వరకు మన రాష్ట్రానికి దిగుమతి ద్వారా 3.94ఎల్ఎంటిల యూరియాను కేంద్రం కేటాయించింది. ఇందు లో సిఐఎల్, ఐపిఎల్, కెఆర్ఐబిహెచ్, ఎన్ఎఫ్ఎల్ కంపెనీల ద్వారా యూరియా 3.96 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, ఇప్పటివరకు 2.10 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. రెండో ప్రధాన కారణం దేశీయంగా యూరియా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో జరగకపోవడం. 1,69,325 మెట్రిక్ టన్నులు కేటాయించగా 1,06,852 మాత్రమే సరఫరా చేశారు. యూరియా దిగుమతులు లేకపోవడం, దేశీయంగా డిమాండ్ కు తగ్గట్టుయూరియా ఉత్పత్తి జరగకపోవడం, ఈ రెండు కారణాల వలన యూరియా కొరత మన తెలంగాణ రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా ఉంది. మన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపులు చేశారు. ఇందులో ఆగస్టు వరకు 8.30లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించి, ఇప్పటి వరకు 5.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు.ఇంకా 2.58 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవ్వలేదు. కేటాయించిన యూరియా మనకు అందకపోవడంతో డిమాండ్ కు తగ్గట్టు నిల్వలులేక రాష్ట్రంలోఇబ్బందులు తలెత్తాయి.యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం ఉంటే ఇక్కడ మాత్రం ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు బద్నాం చేసే రాజకీయాలు చేస్తున్నాయి. రాజకీయ స్వార్థంతో బిఆర్ఎస్ చేస్తున్న యూరియా కొరత వీధి నాటకాలు,వాస్తవాలు దాచి రైతులను ఇబ్బందులు పాలుజేసిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై వాస్తవాలు కుండబద్దలు కొట్టి రైతాంగంకు చెబుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం పై మీరు పెట్టుకున్న విశ్వాసం వమ్ము కాకుండా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భరోసాగా ఉంటామని, రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే తెప్పించడానికి ఎంతవరకైనా పోరాడుతామని... ఓ రైతుగా వ్యవసాయ శాఖమంత్రిగా స్పష్టం చేస్తున్నామని లేఖలో తుమ్మల పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో ఐదుగురు భద్రతా సిబ్బంది మృతి

**పెషావర్:** పాకిస్థాన్ వాయువ్యప్రాంతం ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో ఉగ్రవాదులు జరిపిన రెండు వేరు వేరు దాడుల్లో ఐదుగురు భద్రతా సిబ్బంది మరణించారు. మరో 17 మంది గాయపడ్డారు. హంగుజిల్లాలోని తోరా వారై ప్రాంలో ఎఫ్‌సి ఫోర్టులోకి రాత్రివేళ ఉగ్రవాదులు దూసుకుపోయి కాల్పులు జరిపారు. అంతకుముందు తిరాహ్ లోయలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఇద్దరు భద్రతా సిబ్బంది మరణించారు. ఇదిలా ఉండగా, పోలీసులు, భద్రతా సిబ్బంది ఉమ్మడిగా అప్పర్ దిర్ జిల్లాలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు.

## కేబుళ్లను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

స్తంభాలకు చాలా చాలా కేబుళ్లు ఉంటున్నాయని, వాటిలో ఏవి చట్ట ప్రకారం ఉన్నాయో ఏవి చట్ట వ్యతిరేకంగా ఏర్పాటు చేసినవో గుర్తించేందుకు కష్టం అవుతుందని తెలిపాయి. వీటిపై చర్యలు తీసుకోడానికి చాలా సమయం పడుతుందని చెప్పాయి. ఈ వివరాలను జస్టిస్ నగేశ్ భీమపాక రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. దీనిపై తగిన ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. తదుపరి విచారణను వాయిదా వేశారు. హైదరాబాద్ సిటీలోని రామంతాపూర్‌లో విద్యుదాఘాతంతో ఆరుగురు మరణించిన ఘటన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కేబుళ్ల కట్ చేయడాన్ని సవాలు చేస్తూ భారతి ఎయిర్ టెల్ హైకోర్టును ఆశ్రయించింది. అన్ని అనుమతులు తీసుకున్నాకే కరెంటు స్తంభాల ద్వారా కేబుళ్లు తీసుకున్నామని తెలిపింది. ఎలాంటి నోటీసు జారీ చేయకుండా నగరమంతా కేబుళ్లను కట్ చేయడం చెల్లదని తెలిపింది. ఈ వ్యవహారంపై గత విచారణలోనే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కరెంటు వైర్లు తగిలి ఆరుగురు మరణించారని, ఆ మృతులకు ఎవరు బ్యాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. తండ్రి చనిపోతే పుట్టిరోజు నాడే తొమ్మిదేళ్ల బాలుడు పాడె మోయాల్సిన దుస్థితికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీసింది. పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న. టీజీఎస్పీడీసీఎల్ స్పందిస్తూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షలకు పైగా స్తంబాలు ఉంటే 1.73 లక్షల స్తంభాలకు మాత్రమే కేబుళ్లు లాగేందుకు అనుమతులున్నాయని తెలిపింది. అయితే ప్రతి స్తంభానికీ విచ్చలవిడిగా కేబుళ్లు ఉన్నాయని చెప్పింది. పరిమితికి మించి కేబుళ్లు ఉండటంతో స్తంభాలు భారం భరించలేక వైర్లు నేలకు తగిలే ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై హైకోర్టు, కేబుళ్ల బరువుకు స్తంబాలు వాలిపోతుంటే కింది సిబ్బంది జేబులు సొమ్ముతో నిండుతున్నాయని వ్యాఖ్య చేసింది. ఇలాంటి విషయాలపై కఠినంగాఉండాలని తేల్చి చెప్పింది. ఆరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేసింది ఆ కుటుంబాల వేదనను అర్థం చేసుకోవాలంది.ఈ నిర్లక్ష్యానికి సమష్టి బాధ్యత తీసుకోవాల్సిందేనని పేర్కొంది. అనుమతులేని కేబుళ్లతో పాటు అనుమతులుండీ వేలాడుతూ మనిషికి తగిలేలా ఉన్న కేబుళ్లను తొలగించాల్సిందేనని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది.

# జర్నలిస్టులు,ఆసుపత్రులపై దాడులు చేయొద్దు

### ఐక్యరాజ్యసమితి హెచ్చరిక

**న్యూయార్క్ :** దక్షిణ గాజాలో జర్నలిస్టుల మరణాలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఖాన్‌యూనిస్‌లోని నస్సెర్ ఆసుపత్రిలో దాడి వార్తలు కవర్ చేసేందుకు వెళ్ళిన జర్నలిస్టులు ఆసుపత్రిలో విధినిర్వహణలో ఉన్నసమయంలో రెండోసారి కూడా ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేయడంతో అంతర్జాతీయ మీడియా తరపున పనిచేస్తున్న ఐదుగురు జర్నలిస్టులు సహా మొత్తం 20 మంది మరణించిన ఘటనను ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ''జర్నలిస్టులపై దాడి చేయకూడదు, ఆసుపత్రులపై అస్సలు దాడులు చేయకూడదు, ఈ దాడులు చూసి దిగ్భ్రాంతితో మౌనంగా ఉండిపోవడం కాదు, దీనిని జవాబుదారీ వహించాలని, న్యాయం చేయాలని డిమాండ్ చేయాలి'' అని ఐక్యరాజ్యసమితి హక్కుల కార్యాలయం అధికార ప్రతినిధి రవీనా షందాసనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సహాయసంస్థ ప్రధానాధిపతి ఫిలిప్పే లజ్జారినీ తీవ్రంగా స్పందిస్తూ, గాజాలో జరుగుతున్న మారణహోమంప ప్రపంచం మౌనం పాటించడమే దిగ్భ్రాంతి కలిగిస్తోందని అన్నారు. గాజాలో ఆకలి చావులకు, దారుణమైన మరణాలకు గురవుతున్న పిల్లలు, మహిళలకు సంబంధించిన వాస్తవాలను ప్రపంచానికి తెలియజేసే చిట్టచివరి జర్నలిస్టుల ప్రాణాలు కూడా తీసి అందరినోళ్ళూ మూయించాలని ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక ప్రకటన చేస్తూ, నిత్యం గాజాలో జరుగుతున్న మారణహోంలో ప్రజలు సమిథలవుతున్నారని, ఈరోజు దాడిలో మరో 50 మంది కూడా తీవ్రంగా గాయపడ్డారని పేర్కొంది. గాజాలో వార్తలు ప్రపంచానికి తెలియడంలేదని, చాలా పరిమితంగా అక్కడి నుండి వార్తలు వస్తున్నాయని, ఇప్పుడు ఉన్న అవకాశాన్ని కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించింది. ఐతే తాము ఆసుపత్రి సమీపంలో దాడి చేశామనీ, ఎందుకు ఆసుపత్రిపై దాడి జరిగిందనే విషయం తెలియదని, దీనిపై ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించామని ఇజ్రాయెల్ ప్రభుత్వం చెబుతున్నది.

బ్రిటన్,స్పెయిన్ సహా పలు యూరప్ దేశాలు గాజా ఆసుపత్రిపై దాడి, జర్నలిస్టుల మరణాలను తీవ్రంగా ఖండించాయి. అసలు ఆసుపత్రులపైన, జర్నలిస్టులపైన దాడులు చేయకూడదని పేర్కొన్నాయి. బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ ఒక ప్రకటన చేస్తూ, గాజాలో తక్షణం కాల్పుల విరమణ పాటించాలనీ, జర్నలిస్టులకు, ఆసుపత్రులకు పూర్తి రక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాన్‌యూనిస్‌లో ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడిని స్పెయిన్ విదేశాంగమంత్రి జోస్ మేన్యుయల్ ఆల్బెరస్ తీవ్రంగా వ్యతిరేకించారు. గాజాలో తక్షణం కాల్పుల విరమణ సాధించాలన్నారు. ''ఈరోజున ఆసుపత్రిపై మరోసారి దాడులు చేశారు, జర్నలిస్టులను హత్యచేశారు, మరోవైపు గాజాలో ఆకలి చావులు సంభవిస్తున్నాయి, వారికి సరైన ఆహారం లేకుండా ఉద్దేశపూర్వకంగా మాడ్చి చంపుతున్నారు, కరువు పరిస్థితులు గాజాలో నెలకున్నాయి, పిల్లలు ఆకలితో మరణిస్తున్నారు, ఇవన్నీ అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనకిందకే వస్తాయి, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోంది'' అని ఆల్బెరస్ ఎక్స్ వేదికగా విమర్శించారు.

ఖాన్‌యూనిస్‌లోని నస్సెర్ ఆసుపత్రిపై సోమవారం మొదటిసారి ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో రాయిటర్స్ వార్తాసంస్థకు చెందిన కెమేరామెన్ హుస్సమ్ అల్–మస్రి మరణించారు. అసోసియేటెడ్ ప్రెస్ తరపున పనిచేస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టు మరియం దగ్గా (33) మరణించారు. అల్ జజీరా, మిడిల్ ఈస్ట్ ఐ తరపున జర్నలిస్టుగా పనిచేస్తున్న మహ్మద్ సలమా , అల్ జజీరా ఫొటోగ్రాఫర్ మొయిజ్ అబూ తహా మరణించారు. మిడిల్ ఈస్ట్ ఐ తరపున పనిచేస్తున్న అహ్మద్ అబు అజీజ్ కూడా ఈ దాడిలో మరణించారు. ఇంతకుముందు 15 రోజుల క్రితం అల్‌సైఫా ఆసుపత్రి సమీపంలో జరిపిన దాడిలో ఆరుగురు జర్నలిస్టులను ఇజ్రాయెల్ సైన్యం హతమార్చింది.

## ఉస్మానియా యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

భవనాలను సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. వాటికి దుందుభి, భీమా వసతి భవనాలుగా నామకరణం చేశారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూములకు సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఒయు గొప్ప,గొప్ప నాయకులను,ఐపిఎస్‌లను,ఐఎఎస్‌లను, వైద్యులను, న్యాయవాదులను అందించిందన్నారు. తెలంగాణ సమాజానికి ఎటువంటి సమస్య వచ్చినా ఒయు వేదిక నుంచే నిరసనలు వ్యక్తమయ్యేవని, సమాజానికి అండగా నిలిచిందని, తెలంగాణ సమాజానికి సమస్య, సంక్షోభం వచ్చినప్పుడు మొదటి సారి ఉద్యమానికి పునాది పడేది ఒయు నుంచే అని అన్నారు. 1938లో సాయుధ రైతాంగ పోరాటానికి మద్దతుగా,తండాలలో మారుమూల పల్లెల్లో 'ఎర్ర జెండా' మోసిన ఎంతో మందికి ఒయు అండగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ముఖ్యభూమిక పోషించిందని సిఎం గుర్తు చేశారు. ఒయు చరిత్ర కాలగర్భంలో కలువొద్దని, ఒయును ఒక అద్భుతమైన యూనివర్సిటీగా మార్చాలని, ఒయు లేకపోతే తెలంగాణకు చరిత్రనే లేదన్నారు. తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసే ఒయు, తెలంగాణ పదానికే ప్రత్యామ్నాయంలాంటిదని సిఎం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుబాగాన నిలబడి తెలంగాణను సాధించిన యూనివర్సిటీని ఇలా గాలికి వదిలేయడం బాధ్యతనా ఒక సారి ఆలోచన చేయాలన్నారు.

**'ఒయు సభ'లో 'నిరసన స్వేచ్ఛ' ...**

మరోసారి ఒయులోని ఆర్ట్స్ కళాశాల వద్ద జరిగే సభ సందర్భంగా పోలీసులే ఉండొద్దని,విద్యార్థులకు నిరసన తెలియజేసే స్వేచ్ఛను కూడా ఇద్దామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒక వేళ విద్యార్థులు తనను అడ్డుకుని ప్రశ్నిస్తే, చిత్తశుద్ధితో సమాధానం చెబుతానని, వారి అనుమానాలను నివృత్తి చేస్తానని అన్నారు. విద్యార్థులు తమ కోసం పనిచేయని వారిని వ్యతిరేకించాలని, ఒయులో పరిస్థితులను చూసి, సమస్యలను పరిష్కరించాలనే వారిని అడ్డుకుంటే అభివృద్ధిని అడ్డుకుంటున్నామా? లేదా అనేది కూడా విద్యార్థులు ఆలోచించుకోవాలని సూచించారు. 2011లో గ్రూప్ 1 పరీక్షను నిర్వహిస్తే, 2025 వరకు గ్రూప్ 1 పరీక్షలు జరగలేదని, అలాంటిది తాము గ్రూప్ 1 పరీక్ష నిర్వహిస్తే ఫలితాలు ప్రకటించకుండా తనను అడ్డుకుంటున్నారని, దీనిపైన విద్యార్థులు కూడా ఆలోచించాలన్నారు. ఆరోజు అధికా




రంలో ఉన్నాయన గొర్రెలు, చేపలు పెంచుకోవాలని చెబితే, అందుకు భిన్నంగా తాను ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు కావాలని చెబుతున్నానని సిఎం అన్నారు. గతంలో కళకళలాడిన ఒయు ప్రస్తుతం కళా విహీనంగా మారిందన్నారు. విద్యార్థులకు తాము నాణ్యమైన విద్యను మాత్రమే ఇవ్వగలమని,తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని, చదువు ఒక్కటే అన్నింటికీ పరిష్కారమని, చదవు వల్లనే గౌరవం దక్కుతుందని సిఎం సూచించారు.

**మళ్లీ వారు అధికారంలోకి వస్తే.. ఒయు భూములను అమ్ముకుంటారు...**

మళ్లీ వారు (బిఆర్ఎస్) అధికారంలోకి వస్తే ఉస్మానియా వర్సిటీని బతకనివ్వరని, ఒయులోని భూములను లే అవుట్లు చేసి ప్లాట్లు చేసి అమ్ముకుంటారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేదలు ఎవ్వరూ చదువుకోవద్దనేదే వారి కుట్ర అని అన్నారు. ఇలాంటి వారు తెలంగాణ రాష్ట్రానికి పట్టిన చెదలు లాంటివారని, ముసుగు వేసుకున్న చెదలులాంటి వారు తెలంగాణ సమాజం బాగు కోరుకోబోదన్నారు. ఒయులో కనీసం నాన్ టీచింగ్ నియామకాలను కూడా చేపట్టక క్యాన్సర్ తరహా ఒయును నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఒయును కాలగర్భంలో కలుపాలనే కుట్ర జరుగుతున్న సందర్భంలో మళ్లీ ఒయును పునర్ నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**వారి ఉచ్చులో పడొద్దు..** కొంతమంది రాజకీయ పార్టీలకు అధికారం పోయిన తర్వాత కడుపుమంట, బాధ ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొడుకులను ఏమేమో చేద్దామంటే, వారు ఏటూ కాకుండా పోతున్నారని తండ్రికి ఆవేదన ఉంటుందని, ఆ ఆవేదనతో ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందన్నారు. అలాంటి వారి ఉచ్చులో విద్యార్థులు పడొద్దని సూచించారు. దొరల చేతిలో ఉండాల్సిన పెత్తనం పేదవారి చేతికి పోతే ఎలా అనే ఆవేదన కొందరిలో ఉంటుందన్నారు. హెచ్‌సియులో ఏనుగులను, సింహాలను రాష్ట్ర ప్రభుత్వం చంపుతున్నట్టు ప్రచారం చేశారని, తెలంగాణ రాష్ట్రంలో ఏనుగులు, సింహాలు లేవని, మానవరూపంలో ఫామ్‌హౌస్‌లలో మానవ మృగాలు ఉన్నాయని సిఎం ఎద్దేవా చేశారు. కోదండరాంను ఎంఎల్‌సిగా ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లి రద్దు చేయించారని సిఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. మళ్లీ 15 రోజుల్లో ఆయనను ఎంఎల్‌సిగా పంపిస్తామన్నారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో మందిని ఉస్మానియా విశ్వవిద్యాలయం మేథావులుగా తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణ, కాలేజి కమిషనరేట్ కమిషనర్ దేవసేనా,హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావుకు 'కాఫీ టేబుల్ బుక్'



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థులను వ్యవస్థాపక నిర్వాహకులుగా, మార్కెటింగ్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే 'స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్' విద్యా సంస్థను ఏర్పాటు చేశామని ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఐఎఎస్ డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, మాజీ ఐపిఎస్ లక్ష్మీ నారాయణ, ప్రముఖ నటులు మురళీ మోహన్ చేతుల మీదుగా 'కాఫీ టేబుల్ బుక్'ను రామేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా రామేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మార్కెటింగ్, ఫైనాన్స్, పవర్, ఐటి, టెలి కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో విద్యార్థులను ఒక లీడర్‌గా, ఒక వ్యవస్థాపక నిర్వాహకులుగా, ఒక మార్గదర్శులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతోనే కోర్సులను ప్రారంభించామన్నారు.

# సమసమాజ స్థాపనకు విద్య ఒక్కటే మార్గం

విద్య ద్వారానే ప్రపంచంతో పోటీ

పడగలం : భట్టి విక్రమార్క




ప్రజాపక్షం/హైదరాబాద్: సామాజిక మార్పు, వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు, సమసమాజ స్థాపనకు విద్య ఒక్కటే మార్గమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రాలు దాటి ప్రపంచంతో పోటీ పడాలంటే కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఒక ప్రైవేట్ సంస్థ విద్యారంగంపై రూపొందించిన 'కాఫీ టేబుల్‌ను సోమవారం డిప్యూటీ సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్యంపై దృష్టి సారించామన్నారు. రాబోయే 50, వంద సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది, ప్రైవేటు విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మాజీ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని నేటి వరకు అనేకమంది ప్రధానులు, ముఖ్యమంత్రులు తీసుకువచ్చిన విద్యాసంస్థల వల్లనే భారతదేశం వేగంగా అభివృద్ధి సాధించిందన్నారు. ఐఐటి, ఆర్ఇసి, యుజి సి ఆధ్వర్యంలో పలు యూనివర్సిటీల ఏర్పాటు ద్వారానే తెలుగు వాళ్ళు ప్రముఖ కంపెనీలకు సిఈఓల స్థాయికి ఎదిగారని వివరించారు. వ్యక్తులు స్థాపించిన విద్యాసంస్థలు యూనివర్సిటీల స్థాయికి ఎదిగి అడ్వాన్సుడ్ టెక్నాలజీని బోధించే స్థాయికి చేరాయన్నారు. మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారితేనే ప్రయోజనమని, ప్రభుత్వం భావించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందన్నారు. పరిశ్రమలకు పనికొచ్చే విధంగా సిలబస్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల కింద ఏర్పాటు చేసిన 100 ఐటిఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, వివిధ పరిశ్రమల అధిపతులు సూచించిన సిలబస్‌ను వాటిలో ప్రవేశపెట్టామని తెలిపారు.

## క్రీడల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం

ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆరోగ్యవంతమైన సమాజం క్రీడల ద్వారానే సాధ్యమవుతుందని, అని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు.జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌బిస్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఆరోగ్యం క్రీడాకారుల విజయానికి మూలం కాబట్టి కోచ్‌లు క్రీడాకారులకు క్రమబద్ధంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిది రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థలు, జిల్లా కేంద్రాలలో క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.సోనీ బాలాదేవి మాట్లాడుతూ... యశోద హాస్పిటల్, ఎం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో ఈ క్యాంప్ నిర్వహించామని పేర్కొన్నారు. మెగా హెల్త్ క్యాంప్‌లో 24 రకాల ఆరోగ్య పరీక్షలతో నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో మొత్తం 780 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ అథారిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ సమన్వయం చేశారు. డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత, అనిత, ఇంజనీర్ అశోక్ కుమార్, పి.ఆర్.ఓ కాలేరు సురేష్, యశోద హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జీవన్, ఎం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో మెజారిటీ సీట్లే లక్ష్యం

పెండింగ్ ప్రాజెక్టులపై

1న కలెక్టర్లకు వినతి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు,

చాడ వెంకటరెడ్డి




ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐకి బలం ఉన్న అన్నీ స్థానాల్లో అభ్యర్థులు పోటీ చేస్తారని, మెజారిటీ సీట్లలో గెలుపే లక్ష్యంగా సిపిఐ పని చేస్తుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని సిపిఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలు, రాబోయే ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాల్ని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం, పార్టీ వందేళ్ల ఉత్సవాలు, జాతీయ మహాసభలు, రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్టీ వైఖరి తదితర అంశాలను మీడియాకు వివరాంచారు. రాబోయే మున్సిపల్, జడ్పిటీసీ, ఎంపిటిసి, సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జరిగే ఎన్నికల్లో పార్టీ బలం ఉన్న ప్రతి చోట తమ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ స్థానిక సంస్థల్లో ఆ పార్టీ వైఖరిని బట్టి పొత్తు ఆధారపడి ఉంటుందన్నారు. పొత్తుల పేరుతో కాలయాపన చేసేది లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 26 నాడు పార్టీ వందేళ్ల ఉత్సవాల ముగింపు వేడుకలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరుగుతాయని తెలిపారు. ఈ వేడుకలకు జాతీయ, అంతరాతీయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. అందులో అంతర్జాతీయ పరిస్థితులు, కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న ఆటుపోట్లకు సంబంధించిన చర్చలు జరుగుతాయన్నారు. వందేళ్ల ఉత్సవాలు రాష్ట్రంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో వందలాది మందితో భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పార్టీ జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు పంజాబ్ రాజధాని చండీగడ్‌లో జరుగనున్నాయని తెలిపారు.

**పెండింగ్ ప్రాజెక్టులపై...**

రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర మహాసభల్లో తీర్మాణం చేసినట్లు వెంకటరెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఎస్ఆర్‌ఎస్‌పీ వరద కాలువ 1994లో శంకుస్థాపన చేసినా పాలకుల నిర్లక్ష్యంతో మొదలు కాలేదని, 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మొదలు పెట్టినప్పటికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు చేయక, గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రాజెక్టు పూర్తి కాలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తామని చెబుతున్నప్పటికి నిధులు లేవంటుందని, ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడం మూలంగా నిర్మాణ వ్యయం పెరుగుతందన్నారు. మొదలు పెట్టినప్పుడు నిర్మాణ వ్యయం రూ.959 కోట్లు కాగా ప్రాజెక్టు ప్రస్తుత వ్యయం 15 నుంచి 20 వేల కోట్ల అంచనాలకు పెరిగిందన్నారు. ప్రభుత్వం వరద కాలువపై దృష్టి పెట్టి త్వరగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ సాయుద పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతులు యూరియా కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు కావల్సిన యూరియాను అందించాల్సి ఉందని, కేంద్రంతో సంప్రదింపులు జరిపి సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాలని అవసరమైతే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుపైడిపల్లి రాజు, బండ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించండి

గౌతమి, సుల్తాన్ ఉల్ ఉలూమ్

కళాశాలలకు హెచ్ఆర్‌సి సమన్లు




ప్రజాపక్షం/హైదరాబాద్: ఫీజు కట్టలేదని విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్ఆర్‌సి) తప్పుపట్టింది. నమోదైన ఇలాంటి రెండు కేసులలో విద్యార్థులకు అనుకూలంగా హెచ్ఆర్‌సి తీర్పు చెప్పింది. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్ఆర్‌సి) చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను అన్యాయంగా నిలుపుదల చేసిన రెండు కేసులలో కీలక ఆదేశాలు జారీ చేసింది.

**గౌతమీ డిగ్రీ కళాశాల..**

బాలనగర్‌లోని గౌతమీ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఒక బిబిఎ పట్టభద్రుడి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టిసి)ను ప్రభుత్వ స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందనే సాకుతో నిలిపివేశారు. బాధిత విద్యార్థి ఫిర్యాదు మేరకు గౌతమి డిగ్రీ కాలేజీ యాజమాన్యానికి హెచ్ఆర్‌సి పైవిధంగా తీర్పు చెబుతూ.. కళాశాల యజమాన్యానికి సమన్లు జారీ చేసింది. ఇలాంటి చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం విద్యా హక్కును ఉల్లంఘించడం అవుతుందని కమిషన్ పేర్కొంది. కాలేజీ చైర్మన్, ప్రిన్సిపాల్‌ను తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది.

**సుల్తాన్ -ఉల్- ఉలూమ్ ఫార్మసీ కాలేజీ**

బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కాలేజీ ఆగస్టు 21న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయలేదని 17 మంది విద్యార్థులలో 10 మంది సోమవారం కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత కాలేజీని విద్యార్థుల సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వమని కమిషన్ ఇప్పటికే ఆదేశించింది.ఈ నిర్లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుని కమిషన్, కాలేజీ చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ లను ఈ నెల 28న ఉదయం 11:00 గంటలకు కమిషన్ ముందు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. విద్యార్థుల సర్టిఫికెట్లను అన్యాయంగా నిలిపివేయడం, వారికి విద్య మరియు ఉపాధి అవకాశాలను నిరాకరించడం అవుతుందని, ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కమిషన్ మరోసారి స్పష్టం చేసింది. గత ఆదేశాలను గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి కేసులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఇద్దరు వ్యక్తుల దారుణహత్య



ప్రజాపక్షం/మాక్లూర్ : నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా(ఎ) గ్రామంలో ఇద్దరు వ్యక్తులు దారుణహత్యకు గురయ్యారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీలకర్ర ప్రసాద్‌కు కొన్ని ఏళ్లుగా ధర్మోరాకు చెందిన స్వప్న అనే మహిళతో వివాహేతర సంబంధాలున్నాయి. ప్రసాద్ ధర్మోరా గ్రామానికి చెంది న పలువురికి తరచూగా వివాదాలు పెట్టుకునేవారని గ్రామస్తుల సమాచారం. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన జీలకర్ర ప్రసాద్ పలు చోరీ కేసులలో నిందితుడు, అతని స్నేహితుడు ఆకాష్ ఆదివారం రాత్రి ధర్మోరాలో ప్రసాద్‌కు పరిచయమున్న మహిళ ఇంటికి వెళ్లారు. అయితే వీరిద్దరికి జీలకర్ర ప్రసాద్ అనే వ్యక్తితో ఆదివారం ఉదయం గ్రామంలో గొడవ జరిగింది. గొడవను మనసులో ఉంచుకుని తిరిగి గంధం గంగారాం, సాయిలు, ఇంటిపైకి జీలకర్ర ప్రసాద్ తన స్నేహితుడితో కలిసి రాత్రి దాడికి వచ్చినట్లు సాయిలు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో సాయిలు కుటుంబ సభ్యులు ఆత్మరక్షణలో భాగంగా ప్రతి దాడి చేసి కంట్లో కారం కొట్టి, దీంతో రాడ్లు కట్టెలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో జీలకర్ర ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హత్యకు గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. ఘటన స్థలాన్ని నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్‌తో పాటు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్‌లు పరిశీలించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమా లేక మరేదైనా అనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీలకర్ర ప్రసాద్‌పై చోరీ కేసులతో పాటు ఇతర కేసులున్నాయి. గతంలో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపగా ఎస్కార్ట్ కళ్లు గప్పి పరారీ అయ్యాడు. ఈ కారణంగా ఇద్దరు పోలీసులు కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. నగరంలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ప్రసిద్ధి చెందిన జీలకర్ర ప్రసాద్ హత్యకు గురికావడం కలకలం రేపుతోంది.

# టూరిజం హబ్‌గా అనంతగిరి

మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: అనంతగిరి హిల్స్‌లో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం ప్రమోషన్ లో భాగంగా సోమవారం అనంతగిరి హిల్స్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అనంతగిరి హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్నందున చాలా మంది పర్యాటకులు ఇక్కడికి ట్రెక్కింగ్, దైవదర్శనంతో పాటు ప్రకృతిని ఆస్వాదించడానికి వస్తుంటారని, అందకు తగ్గట్లుగా మౌలిక వసతులను కల్పించి, దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతగిరిలో ఉన్న హరిత హోటల్ నిర్వహణను పైలట్ ప్రాజెక్ట్‌గా వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తున్నామని, తద్వారా ప్రైవేట్ హోటల్స్‌కు ధీటుగా దీన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకొని, హరిత హోటల్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

**డిస్టిలరీని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి**

మద్యం తయారు చేసే స్పిరిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీస్‌ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనిఖీ చేశారు. హోల్డింగ్ ట్యాంక్స్, బ్లెండింగ్ యూనిట్, బాటిల్ ఫిల్లింగ్, సిసి కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టంను క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా, లేబ్లింగ్, మద్యం తయారీకి చెందిన ముడి సరుకు, ఇతర సాంకేతికపరమైన తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.మద్యం తయారీ, విక్రయాల్లో ప్రభుత్వ నియమావళిని కచ్చితంగా పాటించాలని, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీ యాజమాన్యానికి ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా మద్యం తయారీ చేస్తున్నారా లేదా అనే విషయాలు ఆరా తీసేందుకే కంపెనీలో ఆకస్మిక తనిఖీలు చేశామని రికార్డులు కూడా పరిశీలించామని అన్నారు. డిస్టిలరీలు, బేవరేజ్‌లో లిక్కర్ తయారీకి ముడి సరుకు దగ్గర నుంచి బాటిల్ బయట వచ్చే వరకు అబ్కారీ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? మద్యాన్ని భర్తీ చేసే క్రమంలో లేబ్లింగ్ ఎలా చేస్తున్నారు? ముడి సరుకు, ఉత్పత్తి అవుతున్న మద్యం, అక్కడ నుంచి డిపోలకు సరఫరా అవుతున్న లిక్కర్ రికార్డులను పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వండి : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రజలు తమ తీర్పు ఇవ్వాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు విజ్ఞప్తి చేశారు. బిజెపి నాయకులు అలూరి విజయభారతి తదితరులు కెటిఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికార బిజెపి తెలంగాణకు ద్రోహం చేయడంలో కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన భవనాలకు సిఎం రేవంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించేందుకు తాపత్రయ పడుతున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను దిగువకు పంపి, ఎపి సిఎం చంద్రబాబు కడుతున్న బనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు తరలించేందుకు సిఎం రేవంత్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేయడంలో బిజెపి, కాంగ్రెస్ ఒకటేనని కెటిఆర్ అన్నారు.

## మరో నాలుగు రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, హన్మకొండ, జగిత్యాల, జనగాం, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజ్గిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ తదితర జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. బుధవారం ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

# బిఆర్ఎస్ దమ్ముకు దుమ్ము పట్టిందా?




ప్రజాపక్షం/హైదరాబాద్: పార్టీ మారిన పది మంది ఎంఎల్‌ఎలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లే దమ్ము ఉందా అని అంటున్నారని, పదేళ్లలో 60 మంది ఎంఎల్‌ఎలు పార్టీ మారినప్పుడు బిఆర్ఎస్ దమ్ముకు దుమ్ము పట్టిందా? అని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఎంఎల్‌ఎ స్థానాలను గెలిచామని చెబుతున్న బిఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా దక్కలేదని, కంటోన్మెంట్ ఎన్నికలో మూడో స్థానం నిలిచిందని గుర్తుంచుకోవాలన్నారు. ఓబిసి లకు రిజర్వేషన్ కావాలనే ప్రయత్నాలు చేస్తున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలు ఖచ్చితంగా ఎన్నికలు పెడతామని, 42 శాతం బిసి రిజర్వేషన్ ఇస్తామని ఆయన అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్ పట్ల బిజెపి, బిఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బిసిలకు 42 శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ప్రభుత్వం ఏం చేసిందో తెలుస్తుందన్నారు. రేవంత్‌రెడ్డికి బిజెపి ఎంపిలు మద్దతు ఇస్తే తెలంగాణ నంబర్‌వన్ అయ్యేదని, మెట్రో ఫేజ్ 2 వచ్చేదన్నారు. ఎపి సిఎం చంద్రబాబుకు ఇచ్చే ప్రాధాన్యతను బిజెపి ఎంపిలకు కేంద్రం ఇవ్వడంలేదని, తెలంగాణకు రావాల్సిన వాటాను గుజరాత్, ఎపికి కేంద్రం పంపుతుందని విమర్శించారు. హరీష్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఉందని, కేవలం సిఎం రేవంత్ రెడ్డి హయంలో మాత్రమే డెంగ్యూ వస్తుందని, గతంలో ఎప్పుడూ లేదన్నట్లు మాట్లాడడం విడ్డూరమన్నారు. హైదరాబాద్‌ను కెసిఆర్ కనిపెట్టినట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారని, కెటిఆర్‌కు తెలియక మాట్లాడుతున్నారా అర్థం కావడంలేదన్నారు. హైదరాబాద్‌ను కెసిఆర్ కుటుంబం వాడుకుని ఆర్థికంగా ఎదిగారన్నారు.

**CHANGE OF NAME**

నేను, **సాదినేని నాగసైదేశ్వరరావు (పాత పేరు)**, చిరునామా: 2-91-2, రెడ్లకుంట గ్రామం, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ, పిన్‌కోడ్: 508206. నేను నా పేరును **సాదినేని అప్పారావు, తండ్రి నర్సయ్య (కొత్త పేరు)** అని మార్చుకుంటున్నాను.

# 15 వరకు ప్రభుత్వ 'బిసి ఉద్యోగుల' లెక్కలు ఇవ్వండి

బిసి కమిషన్




ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ శాఖలలో పని చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది సమాచారాన్ని సెప్టెంబర్ 15వ తేదీ వరకు తమకు సమర్పించాలని బిసి కమిషన్ సూచించింది. వివిధ శాఖలు, డిపార్ట్‌మెంట్ల కార్యదర్శులతో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ హైదరాబాద్‌లోని హరిత ప్లాజా,మంజీర హాల్‌లో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిసి కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాలమాయ దేవి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తో పాటు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్త, రవాణ, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దేవాదాయ, వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ప్రణాళిక,సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ తదితరులు హాజరయ్యారు. అయితే ఈ సమావేశంలో కొన్ని శాఖలు గైర్హాజరవ్వడం పట్ల బిసి కమిషన్ తప్పు పట్టింది. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని బిసి కులాలకు సంబంధించిన అంశాలపైన బిసి కమిషన్ విచారించి, కమిషన్ అభిప్రాయాన్ని నివేదించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని వివరించారు. ఇందులో భాగంగానే విచారణ నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలలో బిసి కులాల వారీగా ఎంతమంది ఉన్నారో తమకు సమాచారం తెలపాలని సూచించారు. ఈ విషయమై తాము అన్ని శాఖల కార్యదర్శులకు ఆరు నెలల క్రితమే ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినా ఇప్పటి వరకు సమాచారం రాలేదని నిరంజన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం 31 మార్చి నాటికి ఆయా శాఖల వారిగా బిసి కమిషన్‌కు సమాచారాన్ని తెలియజేయాలని ఆయన వివిధ శాఖల కార్యదర్శులను కోరారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్: జిహెచ్ఎంసి

మెయిల్: sew.ghmc@gmail.com సెల్: 7331186858

NIT No. 22/SE/SLPZ/GHMC/2025-26 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 25.08.2025

**పని పేరు:** (02 ఐటెమ్‌లు) జిహెచ్ఎంసి, ఎస్ఎల్‌పిజెడ్ సర్కిల్-22లో మీట్ మార్కెట్ నిర్మాణం & బహుళ ప్రయోజనకరమైన ఫంక్షన్ హాల్ నిర్మాణం, **అంచనా విలువ / ఇసివి:** రూ.400.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 26.08.2025న మ.1.00గం.ల నుండి 02.09.2025న మ.1.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి, సెల్: 7331186858.

**సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి.**

DIPR R.O. No. : 7081-PP/CL/ADVT/1/2025-26, Date: 25-08-2025

**పురపాలక సంఘ కార్యాలయము, వికారాబాద్**

**వికారాబాద్ జిల్లా.**

బహిరంగ వేలము ప్రకటన తేది: 25.08.2025

వికారాబాద్ పురపాలక సంఘమునకు సంబందించిన శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ విభాగములకు సంబంధించిన పనికిరాని పాత ఎలక్ట్రిక్ ఆటోలు, అల్మారాలు, పైపులు, డంపర్ బిన్స్, హెచ్.ఎం.టి. ట్రాక్టర్, వాటర్ సప్లయి మరియు ఎలక్ట్రికల్ సామానులు (మెటీరియల్స్) బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

తేది: 29-08-2025 నాడు ఉదయము 11:00గంటలకు బహిరంగ వేలము వేయబడును. కావున ఇట్టి బహిరంగ వేలములో పాల్గొనువారు తేది: 28-08-2025 రోజున సాయంత్రం 5:00 గంటలలోపు దరఖాస్తు చేసుకొనవలెను.

ఇట్టి బహిరంగ వేలములో పాల్గొనదలచిన వారు దరఖాస్తుతో పాటు నాన్ రిఫండబుల్ బయానా రూ.20,000/-లను మున్సిపల్ కమీషనరు, పురపాలక సంఘం, వికారాబాద్ వారి పేరున తీసిన డి.డి. జతపరచవలెను.

**సం/- మున్సిపల్ కమీషనరు, పురపాలక సంఘం వికారాబాద్.**

DIPR R.O. No. : 7109-PP/CL/ADVT/1/2025-26, Date: 25-08-2025

## క్రీడా స్ఫూర్తితో రాణించాలి



ప్రజాపక్షం/చిట్యాల: ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని, ఆ స్ఫూర్తితోనే ఆటలు ఆడాలని జిల్లా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి చొల్లేటి యేగేంద్రనాథ్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాపోటీలను మండల విద్యాధికారి సైదానాయక్‌తో కలిసిప్రారంభించారు. పాఠశాల స్థాయి నుండే క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు.వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి శ్రీధర్, పెద్ది నరేందర్, వేణుగోపాల్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, శ్రీదేవి, రమణ, జానకి, గఫార్, జోజిరాణి, శంబులింగం, జి రాము, లింగస్వామి, కల్పన పాల్గొన్నారు.

## ఎకో టూరిజంగా వైజాగ్ కాలనీ



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ వాసుల సమస్యల పరిష్కారం కోరకు సోమవారం దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఎంఎల్‌ఏ నివాసం వద్ద ఎంఎల్‌ఏ బాలునాయక్ సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ వైజాగ్ కాలనీని రాష్ట్రంలోనే మొదటి ఎకో టూరిజం ప్రాంతంగా మార్చే కార్యక్రమం చేయబోతున్నామని, కాలనీ వాసులకు జీవన ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టబోతున్నామని ఎంఎల్ఏ తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ బిక్కు, సర్వయ్య, మాజీ వైస్ ఎంపీపీ పాపానాయక్, సిఐ బీసన్న, ఎస్‌ఐ యువజన కాంగ్రెస్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

## గౌరవవేతనం రూ.5వేలు ఇవ్వండి



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం మండల రేషన్ డీలర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీలర్లకు గౌరవ వేతనం రూ. 5వేలు మరియు 300 కమిషన్ ఇవ్వాలని, గత ఐదు నెలలుగా తమకు రావాల్సిన కమిషన్లను రాకపోవడంతో డీలర్ల పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని తక్షణమే పెండింగ్‌లో ఉన్న కమిషన్లను విడుదల చేయాలని కోరారు.అంజయ్య, నరేష్, మనోహర్, శ్రీరాములు, స్వామి, కృష్ణారెడ్డి, అశోక్, పురుషోత్తం, సువర్ణ, ఫాయిమీదా, సరస్వతి, కౌసల్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ లెవల్ ఫెడరేషన్ గేమ్స్‌ను ఎంపిడివో దేవేందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విద్యార్థుల ఎంపిక కొరకు అండర్ 14, అండర్ 17 స్థాయిలో రెండు రోజుల పాటు గేమ్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రిడల్లో రాణించాలని క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం కలుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో మన్నె అగ్గిరాములు, ఎస్ఐ తేజం రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, పిఈటిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హన్యానాయక్‌కు ఎస్ఎంసి అవార్డు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: గత 15 సంవత్సరాలుగా సమాజ సేవకుడిగా మంచి గుర్తింపు పొంది అనాథలను చేరదీసి స్వచ్ఛందంగా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ధీరావత్ హన్యానాయక్‌కు ఎస్ఎంసీ స్టార్ జాతీయ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన సోమవారం ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఫలాన్ని ఆశించకుండా గత 15 ఏండ్లుగా విద్యా వైద్యా రంగంలో సేవలు అందించడం ద్వారా తనకు అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తాను చేసే సామాజిక సేవలో తన కుటుంబసభ్యులు సైతం తనకు సహకరిస్తె తనను ప్రోత్సహించడం వల్లనే ఈ అవార్డు వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి విద్యార్థికి ఉద్యోగం, ఉపాధి




ప్రజాపక్షం/కోదాడ: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించటమే కోదాడ కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల లక్ష్యమని కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. సోమవారం కళాశాలలో బిటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగం, ఉపాధి కల్పించే విధంగా విద్యను అందించడమే కళాశాల ధ్యేయమన్నారు. కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే మొట్టమొదటి మహిళ ఇంజనీరింగ్ కళాశాల అని అన్నారు. రెండు దశాబ్దాల నుండి వందలాది మంది విద్యార్థినులు ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకుని నేడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యర్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కళాశాలలో అర్హత కలిగిన అధ్యాపకులతో పాటు ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ, వివిధ విభాగాధిపతులు రమేష్, నరేష్‌రెడ్డి, స్రవంతి, జనార్ధన్, ఎజాజ్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం



ప్రజాపక్షం/కోదాడరూరల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వం కల్పించే కళ్యాణలక్ష్మి చెక్కులను సోమవారం గణపవరం గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇర్ల సీతరామిరెడ్డి, ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, పాలకి సురేష్, తొగర్రాయి వెంకన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చట్టంపై అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/ రామన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు అధికారులు ర్యాగింగ్ నిరోధక చట్టం, ఫోక్సో చట్టం గురించి సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానమ్ ఆధ్వర్యంలో ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసుశాఖ వారు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రహత్‌ఖానమ్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉండాలని, స్నేహభావం, సత్సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు.

# 'నల్లగొండ'లో వైద్యరంగం పటిష్టం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ: ధనవంతుల మాదిరిగానే పేదవారికి అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో నల్లగొండ జిల్లాలో వైద్య రంగాన్ని పటిష్టం చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సుమారుకోటి రూపాయలతో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపిక్ యూనిట్‌ను పద్మవిభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించగా, రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ పద్మ విభూషణ్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అధునాతన వైద్య సదుపాయాలు కలిగిన లాప్రోస్కోపిక్ యూనిట్ ప్రారంభించడం సంతోషమన్నారు. ప్రధాన ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల చిన్న చిన్న ఆపరేషన్లను ఇక్కడే నిర్వహించే విధంగా, పేదవారికి మేలు చేసేందుకుప్రతీక్‌ఫౌండేషన్‌ద్వారాఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పద్మవిభూషణ్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన ఆసుపత్రిలో అత్యాధునిక, ఉన్నత స్థాయి ప్రమాణాలు కలిగిన లాప్రోస్కోపిక్ యూనిట్ ఏర్పాటు చేయడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అభినందించారు. తన తండ్రి ఆశయం మేరకు పేద ప్రజలకు సేవలు అందించడమే కాకుండా, వైద్య విద్యార్థులకు శిక్షణ, పరిశోధన వంటి వాటిలో తాను కృషి చేస్తున్నానని, అందులో భాగంగానే ఏఐజి ఆసుపత్రిని స్థాపించడం జరిగిందని తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ జీవరావు,ప్రముఖ సామాజిక కార్యకర్త, చారిటీ నిర్వాహకులు ఎన్‌సి రెడ్డి,ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డిఎంహెచ్‌ఓ, డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్‌ఎస్ మాతృనాయక్,వైద్య కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, ఆర్‌డిఓ వై అశోక్ రెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాధాకృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్వోలు, డాక్టర్లు పాల్గొన్నారు.

# గురుకులాల్లోనే భవిత

### కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్




ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:గురుకులాల్లో చదివిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కోహన్స్ స్వచ్ఛంద సంస్థ 12 లక్షల రూపాయల విలువ చేసే 276 డ్యూయల్ డెస్క్ బెంచీలను చివ్వెంల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలకు వితరణ ఇవ్వగా ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటారని, అందరికన్నా చురుకుగా, బాధ్యతగా వ్యవహరిస్తారని, ఉదయం లేచిన దగ్గర నుండి మొదలు రాత్రి పడుకునే వరకు వారే తమ బాధ్యతలను స్వీకరిస్తారని అన్నారు. అందువల్ల భవిష్యత్‌లో వీర ఉన్నత స్థానంలో నిలుస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. చివ్వెంల రెసిడెన్షియల్ పాఠశాలకు గత సంవత్సరం చిన్న చిన్న టాయిలెట్స్ పైప్‌లైన్ నిర్మాణం, ఇతర మరమ్మతులకై రాష్ట్ర ప్రభుత్వం కోటి 16 లక్షలు రూపాయల మంజూరు చేసిందని, టెక్నికల్ అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని ప్రిన్సిపాల్‌ను, ఆర్‌సివోలను అదేశించారు. పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేయాలన్న విద్యార్థుల కోరిక మేరకు ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్‌సివోను అదేశించారు. రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ చివ్వెంల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను రాష్ట్రస్థాయిలో మోడల్‌గా నిలపాలన్నదే తమ ధ్యేయమన్నారు. కోహన్స్ సంస్థ 12 లక్షల రూపాయలతో 276 డ్యూయల్ డెస్క్ బెంచీలు ఇవ్వడం పట్ల ఆయన వారిని అభినందించారు. త్వరలో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కానుందని, స్పోకెన్ ఇంగ్లీష్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.స్ప్రెడ్ ఇండియా పౌండర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌సివో విద్యారాణి, మాజీ కౌన్సిలర్, పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# 'భగీరథ' నీళ్లు రాక బిందెలతో నిరసన



ప్రజాపక్షం/నూతన్‌కల్: మండల పరిధిలోని ఎర్రపహడ్ గ్రామానికి మిషన్ భగీరథ నుండి వచ్చే తాగునీరు గత కొన్ని రోజుల నుండి సరఫరా కాకపోవడంతో సోమవారం పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శుద్ధమైన తాగునీటిని అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వం హామీ ఒలికిపోతున్న నేపథ్యంలో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు తాగునీటి హామీలతో మా వద్దకు వచ్చే నాయకులు, ఇప్పుడు మాకు కనీసం తాగునీరు కూడా అందించలేకపోతున్నారని అన్నారు. మిషన్ భగీరథ కింద నీళ్లు రావాలి అంటే ఇలా ధర్నా చేయాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని వారు ప్రశ్నించారు. మహిళలు, వృద్దులు చిన్న పిల్లలు సైతం నిరసనలో పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారులపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం మాత్ర శూన్యమని ఆగ్రహించారు. అధికారులు తక్షణమే స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గాడుదుల రజిత లింగరాజు, ఇరుగు అంజయ్య,నారాయణ,అనిల్, లింగయ్య, ఎస్ఎంసి మాజీ చైర్మన్ అంజయ్య, రామస్వామి, సందీప్‌కుమార్, వెంకటయ్య, లింగయ్య, మహేష్, ఉపేంద్ర, సూరమ్మ, సైదమ్మ, గౌరమ్మ, పద్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

## బిసిల ఆరాధ్యదైవం బిపి మండల్



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: బిసిల ఆరాధ్యదైవం బిపి మండల్ అని బిసి జెఎసి జిల్లా అధ్యక్షులు భద్రబోయిన సైదులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు బిసిలకు స్ఫూర్తిగా అశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. చిన్న తరం నుండి రాజకీయాలకు ఆకర్షితులై వార్డు మెంబర్ స్థాయి నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు ఎదిగిన గొప్ప మహానీయుడు అని, బిసిల తొలి ముఖ్యమంత్రిగా ఎన్నిక కాబడిన గోప్ప యోధుడు అన్నారు. వారు కలలు గన్న సమాజ స్థాపనకై వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వారి విశిష్ట సేవలను వారి చేసిన బిసి సిపార్సులను ముందు తరాలకు స్ఫూర్తి క లిగించే విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పోరాటాలు చేయాలని అన్నారు. యాదవ రా జ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జునయాదవ్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాగం రాజశేఖర్‌యాదవ్, బిజి జెఎసి నాయకులు మదనచారి, నాగేంద్రబాబు, శ్యామ్, ముత్యం నాగేంద్రబాబు, కిరణ్, కొమ్ము నాగయ్య, నరేష్ పాల్గొన్నారు.

## ఒకేషనల్ కాలేజ్‌ను సీజ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/డిండి: డిండి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులను యాజమాన్యం స్కాలర్ షిప్ రాలేదని ఫీజులు కట్టాలని వేధిస్తున్నారని, విద్యార్థులు రోజు కళాశాల ముందుకు వచ్చి గేట్ పెట్టడంతో తిరిగి వెళుతున్నారని, కళాశాలలో 3 కోర్సులు ఉంటే 9 మంది అధ్యాపకులు ఉండాల్సిన చోట కేవలం ముగ్గురితోనే నడిపిస్తూ ప్రిన్సిపాల్ మాత్రం నెలలో ఒకటి రెండు సార్లు మాత్రమే కళాశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించకుండా నే వెళ్ళిపోతారని, విద్యార్థులు అడిగితే వారిని బెదిరిస్తున్నారని అన్నారు. కళాశాలలో కనీస సౌకర్యాలు లేవని, కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా నెలల తరబడి వారిని ఇబ్బందులు పెడుతున్నారని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కళాశాలను సీజ్ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్, విద్యార్థులు కళ్యాణ్, పవన్, రాజు, సాయి, శిల్ప, శీరిష, శివాని తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులు మేలు



### భువనగిరి కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/యాదాద్రి : మట్టి గణపతులను ప్రతిష్ఠించడం వలన పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని, పర్యావరణ పరిరక్షణకు అందరం పాటుపడాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండగను పురస్కరించుకొని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ సహకారంతో జిల్లాకు సరఫరా చేసిన 2000 వినాయక మట్టి ప్రతిమలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలన్నారు. వివిధ రంగుల వినాయక ప్రతిమల ద్వారా వివిధ విష రసాయనాల వలన జలాన్ని శుద్ధి చేసే నీటిలోని క్రిమి కీటకాలు చనిపోయే ప్రమాదం ఉన్నందున్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానికసంస్థల అదనపు భాస్కరరావు, జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారినాగిరెడ్డి, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ వెంకన్న, బీసీ సంక్షేమ అధికారి సాహితి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ప్రజాపక్షం/యాదాద్రిః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల పురోగతి పై యంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు, యంపిఓలు, హౌసింగ్ సిబ్బందితో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిని మండలాల వారీగా ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంత రావు సమీక్షించారు. రాష్ట్ర విప్ ఆలేరు శాసన సభ్యులు మాట్లడుతూ జిల్లాలో ప్రతి మండలంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబదించిన పురోగతి పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 9398 ఇండ్లు మంజూరు కాగా, 7719 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మార్కౌట్ చేపట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద లబ్దిదారులకు నీడ కల్పించాలనే గొప్ప ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే విధంగా లబ్దిదారులును ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. ఇప్పటి వరకు మంజూరు అయిన ఇళ్లన్ని 100 శాతం పనులు ప్రారంభం కావాలని తెలిపారు. చాలా మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులు పూర్తి చేసుకోవడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణపు పనులు బట్టి వారి ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జెడ్పి సీఈవో శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయసింగ్, ఏఈ శ్రీరాములు, ఎంపీడీవోలు, కమిషనర్లు పాల్గొన్నారు.

## డిఎస్ రెడ్డికి ఘన నివాళి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి దండా సత్యనారాయణ రెడ్డి (డిఎస్ రెడ్డి) మరణం కార్మిక లోకానికి తీరని లోటని ఏఐటీయూసీ సినియర్ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. డిఎస్‌రెడ్డి పార్థివ దేహం పై ఏఐటీయూసీ జెండా కప్పి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి సంస్థలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఎంప్లాయిస్ యూనియన్‌లో డిపో కార్యదర్శిగా,రీజియన్ కార్యదర్శిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గా కార్మిక వర్గానికి మంచి సేవలు అందించాలని కొనియాడారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ మరణించడం బాధాకరమని ఆయ న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కేస్ రెడ్డి,జంగమ్మ,జాబిర్, ఏడి రెడ్డి, సిహెచ్ గురవయ్య, ఎం నందం, బి వెంకటయ్య,పి వై రెడ్డి ,బి శంకరయ్య ,కే నారాయణ, ఎస్‌వి రెడ్డి,రామిశెట్టి ,ఎంకే రెడ్డి ,బాబు, టిఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పురాతన బంగారు నాణేల విక్రయ కేసు ఛేదన

### నలుగురు నిందితుల అరెస్టు
### రూ.13.25 లక్షల నగదు స్వాధీనం



ప్రజాపక్షం/చివ్వెంల: పురాతన నాణేలు అమ్ముతామని నమ్మబలికి రూ.20 లక్షలు మోసపూరితంగా దోచుకున్న నలుగురు నిందితులను మండల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ.13.25 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నారు. సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తుమ్మల పెన్‌పహడ్ గ్రామానికి చెందిన నిమ్మనగోటు వెంకటేశ్వర్లు అనే వ్యాపారి మండల పరిధిలోని దురాజ్‌పల్లి శివారులో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తన హోటల్ వద్దకు అదే గ్రామానికి చెందిన పశుపుల గణేష్, ఓర్సు చంటి అనే ఇద్దరు నిందితులు తమ వద్ద పాత బంగారు నాణేలుఉన్నాయని, తక్కువ ధరకు అమ్ముతామని నమ్మబలికి రూ.20 లక్షల బేరం కుదుర్చుకున్నారు. ఈనెల 10వ తేదీన బయానరూపంలో రూ.5 లక్షలు ఇవ్వగా, మరుసటి రోజు రూ.15 లక్షలు ఇచ్చారు. ఆ డబ్బులు చెల్లించిన తర్వాత బంగారు నాణేలు ఇవ్వమని అడగ్గా విచిత్రమైన వీడియోలు పంపి గుర్తు తెలియని వ్యక్తులు మా వద్ద డబ్బు దోచుకున్నారని చెప్పారు. మరో పదివేలు ఫోన్ పే చేయాలని భయపెట్టడంతో ఆవి కూడా పంపడం జరిదింది. దీంతో తనకు జరిగిన మోసాన్ని హోటల్ యాజమాని పోలీసులకు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన ఎస్ఐ మహేశ్వర్ డిఎస్‌పి ప్రసన్నకుమార్ అదేశాల మేరకు రూరల్ సిఐ రాజశేఖర్ ల పర్యవేక్షణలో కేసును విచారణ చేపట్టారు. ఇందులో మొత్తం 9 మంది ఉన్నట్లు గుర్తించి దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన పసుపుల గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యం లను అరెస్టు చేశారు. ఈ కేసులో సంబంధం ఉన్న పసుపుల నవీన్, ఓర్సు శ్రీను, ఓర్సు గోపమ్మ, పసుపుల లక్ష్మి, ముద్దంగుల అంజలిలు పరారీలో ఉన్నారు. వీరి నుండి 13.25 లక్షలను స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పురాతన నాణేలు, ఖజాన, త్వరలో డబ్బులు వస్తాయని ఎవరైనా నమ్మ బలికితే మోసపోవద్దని కోరారు. కేసును చేధించిన ఎస్ఐ మహేశ్వర్, అతని సిబ్బందిని అభినందించారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

### బాంబే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు
## సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించేందుకు కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈసిఫార్సు ఆమోదం పొందితే జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి పదవీ విరమణ అనంతరం 2031 అక్టోబర్‌లో జస్టిస్ పంచోలీ భారత ప్రధానన్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, జెకె.మహేశ్వరి, బివి.నాగరత్నలతో కూడిన కొలీజియం సమావేశమై ఈనిర్ణయం తీసుకుంది. ఈనియామకాలతో 34మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టులో ఖాళీలు ఉండవు. 1964 ఏప్రిల్ 13న జన్మించిన జస్టిస్ అరాధే గత ఏడాదివరకు తెలంగాణ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఉండి బాంబే హైకోర్టుకు బదిలీ అ య్యారు. అహ్మదాబాద్‌లో 1968 మే 28న జన్మించిన జస్టిస్ పంచోలీ అక్టోబర్1, 2014న గుజరాత్ హైకోర్టుఅదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. త

# ‘మఖానా’ శ్రమ దోచుకుంటున్న దళారులు

### బహుజన కార్మికులకు న్యాయం చేస్తా
### రాహుల్ ప్రతిజ్ఞ



**కతిహార్:** బీహార్‌లో రాత్రింబగళ్ళు ఎండా వానల్లో కష్టపడి ‘మఖానా’ (ప్రొటీన్ అధికంగా ఉండే పోషకాహార తామర గింజలు) పంట సాగు చేస్తున్న ఉత్పత్తిదారులకు, కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా తాను పోరాటం చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రతిజ్ఞ చేశారు. ‘ఓటు చోరీ’ చేసే ప్రభుత్వం వీరి శ్రమను గౌరవించడంలేదు, వారికి తగిన శ్రమఫలితాన్ని ఇవ్వడంలేదు, వారిక్షేమం పట్టించుకోవడంలేదు, న్యాయం చేయడంలేదని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. ఇటీవల ఉత్తర బీహార్ కతిహార్ జిల్లాలో ‘ఓటర్ అధికార్ యాత్ర’ సందర్భంగా మఖానా పెంపకందార్లతో జరిపిన సమావేశం వీడియోను సోమవారం రాహుల్‌గాంధీ తన యూ ట్యూబ్ ఛానల్‌లో షేర్ చేశారు. ప్రపంచ మఖానా ఉత్పత్తిలో 90 శాతం పంట సాగు బీహార్ రాష్ట్రంలోనే జరుగుతోందని, మఖానాను ఉత్పత్తిలో 99 శాతం మంది బహుజనులే ఉన్నారని, ఈ ఉత్పత్తిదారులు, కార్మికుల కష్టాన్ని ఒకేఒక్కశాతంగా ఉన్న మధ్యదళారులు దోచుకుంటున్నారని, ఈ అన్యాయాన్ని ఎండగడతామని రాహుల్‌గాంధీ ఆ వీడియోలో ఉత్పత్తిదారులకు చెప్పారు. మఖానా లేదా ఫూల్ మఖానా అనేది అత్యధికంగా ప్రొటీన్ లభ్యమయ్యే పోషకాహార విలువలు గల పంటసాగు అనీ, ఇంత ఖరీదైన, విలువైన పంటసాగు ఫలాన్ని దళారులు దోచుకుంటున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. మఖానాను ఆయన సూపర్ ఫుడ్‌గా అభివర్ణిస్తూ, సమాజంలో ఒక వర్గానికి ఇదెంతో గొప్ప ఆహారమని, కానీ ఈ పంట సాగు ఉత్పత్తిదారులకు మాత్రం ఆ ఫలితాలు లభించడంలేదన్నారు. ఉత్పత్తిదారులు, కార్మికులు రాత్రింబవళ్ళు కష్టపడినాగానీ ఈ పంటసాగులో ఒకశాతం లాభం కూడా వారికి రావడంలేదన్నారు. మఖానా సాగు రైతులను ఇటీవల నేను కలిశాను, వారితో మాట్లాడాను, వారి కష్టాలు తెలుసుకుని వారికి భరోసా ఇచ్చాను అని ఎక్స్‌లో రాహుల్‌గాంధీ పోస్టింగ్ పెట్టారు. పెద్దపెద్ద నగరాలలో కిలో తామర గింజలు రూ.1000ల నుండి రూ.2000ల వరకూ అమ్ముడుపోతున్నాయని, కానీ వీటిని పండించే కార్మికులకు ఆ శ్రమ ఫలితం దక్కడంలేదన్నారు. ఈ మొత్తం పరిశ్రమకు పునాదిగా ఉన్న కార్మికులకు నామ మాత్రపు ధర లభిస్తోందన్నారు. ‘‘ఈ రైతులు, కార్మికులు అందరూ ఎవరు? వీరంతా పూర్తిగా వెనుకబడిన తరగతులకు చెందినవారు, దళితులు, బహుజనులు. ఈ పంటసాగులో 99 శాతం కాయకష్టం ఈ బహుజనులదే, కానీ ఈ ఆర్థిక ప్రయోజనాలు మాత్రం ఒక శాతం మధ్యదళారులకే దక్కుతున్నాయి, ఓట్‌చోరీ ప్రభుత్వం వారి శ్రమను గౌరవించడంలేదు’’ అని విమర్శించారు. బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా మఖానా రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యాలు వీడియోలో షేర్ చేశారు. పంటసాగు సమయంలో ఎదురయ్యే సమస్యలను ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు చెప్పే సమస్యలను ఆయన శ్రద్ధగా ఆలకించిన దృశ్యాలను చూపించారు. ఈ సందర్భంగా అనేకమంది నాయకులు కూడా ఆయన వెంట ఉన్నారు. ఇండిపెండెంట్ ఎంపి రాజేశ్ రంజాన్ అలియాస్ పప్పూ యాదవ్ కూడా ఉన్నారు.

### అన్ని పంటలకు ఎంఎస్‌పి డిమాండ్
# దేశ వ్యాప్త రైతులది

### కేవలం హర్యానా, పంజాబ్ రైతులదే కాదు : జగ్జిత్ సింగ్ డల్లేవాల్



**న్యూఢిల్లీ :** అన్ని పంటలకు కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీ దేశవ్యాప్తంగా ఉన్న రైతుల డిమాండ్ అని సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు జగ్జిత్ సింగ్ డల్లేవాల్ అన్నారు. కేవలం హర్యానా, పంజాబ్ రైతులకు మాత్రమే కాదని స్పష్టం చేశారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న ‘కిసాన్ మహాపంచాయత్’లో సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల రైతులు హాజరయ్యారు. అన్ని పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీ, వ్యవసాయం, పాడి, కోళ్ల పరిశ్రమ, మత్స్య రంగాలను అమెరికాతో ప్రతిపాదిత ఒప్పందం నుండి దూరంగా ఉంచడం, 2020–21 ఆందోళన సమయంలో రైతులపై నమోదైన పోలీసు కేసులను ఉపసంహరించుకోవడం వంటి మూడు కీలక అంశాలపై మహాపంచాయత్ దృష్టి సారిస్తోంది. కాగా, నేటి మహాపంచాయత్‌లో దేశవ్యాప్తంగా ఉన్న రైతులు తమ డిమాండ్లను ముందుకు తీసుకురావడానికి ఇక్కడకు వచ్చేలా ప్రయత్నించామని డల్లేవాల్ చెప్పారు. ఎంఎస్‌పి కోసం డిమాండ్ పంజాబ్, హర్యానా రైతులది మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా ఉన్న రైతులది కూడా అని తాము ప్రభుత్వానికి చెప్పాలనుకుంటున్నామన్నారు. మహాపంచాయతీలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రైతులు, మద్దతుదారులను ఎస్‌కెఎం కోరింది. సమావేశం శాంతియుతుంగా జరుగుతుందని వారికి హామీ ఇచ్చింది. ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఉద్యమం జరిగిన దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత ఈ సమావేశం జరిగింది. దీనివల్ల మూడు వ్యవసాయ చట్టాలు రద్దు చేయబడ్డాయి. శాంతిభద్రతలు కాపాడుకునేందుకు దాదాపు 1,200 మంది సిబ్బందిని ఆ ప్రదేశంలో మోహరించినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

### ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను బైటపెట్టాలన్న సిఐసి ఉత్తర్వులను
# త్రోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు




**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన డిగ్రీ వివరాలను బైటపెట్టాలని కేంద్ర సమాచార కమిషన్ (సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్–సిఐసి) ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు సోమవారం త్రోసిపుచ్చింది. దానిని వ్యక్తిగత సమాచారంగా పేర్కొంటూ, అందులో ఎలాంటి ‘అంతర్లీన ప్రజా ప్రయోజనం’ లేదని తీర్పునిచ్చింది. సిఐసి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఢిల్లీ యూనివర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సచిన్ దత్తా ఫిబ్రవరి 27న తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా దానిపై తీర్పును వెలువరించారు. ‘ప్రజలకు ఆసక్తి కలిగించే విషయం’ అనేది ‘ప్రజా ప్రయోజనం’ ఉన్న విషయానికి పూర్తిగా భిన్నమైనదని న్యాయమూర్తి అన్నారు. నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తును మేరకు సిఐసి 2016 డిసెంబర్ 21న 1978లో బిఎ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరి రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించింది. అదే సంవత్సరంలో ప్రధానమంత్రి మోదీ కూడా బిఎలో ఉత్తీర్ణత సాధించారు. అయితే, హైకోర్టు 2017 జనవరి 23 సిఐసి ఉత్తర్వులపై స్టే విధించింది. సోమవారం వెలువడిన తీర్పులో ఆర్‌టిఐ దరఖాస్తులో కోరిన సమాచారంలో ఎలాంటి అంతర్లీన ప్రజా ప్రయోజనం లేదని హైకోర్టు పేర్కొంది. అలాగే, విద్యా అర్హతలు ఏదేని ప్రభుత్వ పదవిని నిర్వహించడానికి లేదా అధికారిక బాధ్యతలు నిర్వర్తించడానికి చట్టబద్ధమైన అవసరం కాదని తీర్పు చెప్పింది.‘కోరిన సమాచారం ప్రజాబాహుళ్యంలో ఉన్న వ్యక్తికి సంబంధించినది కాబట్టి, ప్రభుత్వ విధులకు సంబంధం లేని వ్యక్తిగత సమాచారంపై గోప్యతా హక్కులు రద్దు కావు’ అని ఉత్తర్వులో పేర్కొన్నారు.ఆర్‌టిఐ చట్టం ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను ప్రోత్సహించడానికి రూపొందించబడింది తప్ప ‘సంచలనం కోసం వనరుగా’ ఉపయోగించడానికి కాదని పేర్కొన్నారు. సిఐసి ఉత్తర్వును పక్కన పెట్టాలని,అయినప్పటికీ, విశ్వవిద్యాలయం తమ రికార్డులను కోర్టుకు చూపించడానికి అభ్యంతరం లేదని ఢిల్లీ యూనివర్సిటీ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.ఆర్‌టిఐ దరఖాస్తుదారుల తరపు న్యాయవాదులు బహుళ ప్రజా ప్రయోజనం కోసం ప్రధానమంత్రి విద్యా సమాచారాన్ని వెల్లడించడానికి ఆర్‌టిఐ చట్టం వీలు కల్పిస్తుందని వారు వాదించారు.

### ప్రధాని వివరాలపై రహస్యం ఎందుకు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సిఐసి ఇచ్చిన ఉత్తర్వును ఢిల్లీ హైకోర్టు రద్దు చేయడంతో, అందరి విద్యా వివరాలు బహిరంగంగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి విద్యా వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచడం అర్థం చేసుకోలేని విషయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు.

# మరణశిక్షను సవాలు చేయవచ్చు

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద మరణశిక్షను సవాలు చేయవచ్చునని సుప్రీంకోర్టు పేర్కొంది. మరణశిక్షకు గురైన ఒక నేరస్థుడు దాఖలు చేసిన పిటిషన్‌పై తిరిగి విచారణ చేపట్టేందుకు అంగీకరించిన సందర్భంగా ధర్మాసనం సోమవారం ఈ విషయం చెప్పింది. నాలుగు సంవత్సరాలు వయసుగల ఒక బాలికపై 2008 ఏప్రిల్‌లో అత్యాచారం, హత్యచేసిన కేసులో నాగపూర్‌కు చెందిన వసంత్ సంపత్ దుపారేకు మరణశిక్ష పడింది. ఆ బాలికకు చాక్లెట్లు ఎరవేసి వశపరచుకున్నాడు. ఆమెపై అత్యాచారం చేసి ఆమె ముఖాన్ని గుర్తుతెలియకుండా చేయడంకోసం తలను రాళ్ళకేసికొట్టి చంపాడు.ఈ కేసులో అతడికి మరణశిక్ష పడింది. ఈ కేసును సుప్రీంకోర్టు పునఃవిచారణకు తీసుకుంది.

న్యాయస్థానం విధించిన మరణశిక్ష తీర్పులపై విచారణ తిరిగి ప్రారంభించేందుకు రాజ్యాంగంలో ఉన్న 32వ అధికరణ అధికారాలు ఇస్తుందని, ఐతే కార్యవిధాన అమలు రక్షణ చర్యల ఉల్లంఘన జరిగిందనే ప్రాతిపదికపై మరణశిక్ష తీర్పులపై విచారణ పునఃప్రారంభాన్ని కోరవచ్చునని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో కార్యవిధాన అమలు చర్యల ఉల్లంఘన జరిగిందని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా 2022 నాటి మనోజ్ వెర్సస్ మధ్యప్రదేశ్ న్యాయస్థానం తీర్పును సుప్రీం ధర్మాసనం ప్రస్తావించింది. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆనాడు దిగువ కోర్టులకు అనేక మార్గదర్శకాలు జారీ చేసింది. మరణశిక్ష విధించేముందుగా నేరస్థుడి మానసికస్థితిని, అతడి మనోపరినామక్రమాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ఆ నివేదికల ప్రకారం తర్వాత మరణశిక్ష విధించాలని ఆ మార్గదర్శకాలలో సుప్రీంకోర్టు మూడేళ్ళక్రితం పేర్కొంది. మనోజ్–మధ్యప్రదేశ్ న్యాయస్థానం తీర్పుపై సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోకుండా సరైన ధృవీకరణలు చేసుకోకుండా మరణశిక్ష విధించారంటూ సదరు నేరస్థుడు గనుక తీర్పును ఖండించి, వ్యతిరేకించినట్లయితే విధాన కార్యాచరణ అమలులో ఉల్లంఘనలు జరిగాయనే ప్రాతిపదికపై రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద మరణశిక్ష తీర్పుపై తిరిగి విచారణ ప్రారంభించవచ్చునని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 14, 21వ అధికరణ ప్రకారం దేశంలోని ప్రతి వ్యక్తికీ సమానమైన హక్కులు, అందరినీ సమానంగా చూడాల్సిన హక్కులు ఉన్నాయని, ఈ ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నందువల్ల దీనికి అనుగుణంగా మరణశిక్షకు గురైన నేరస్థుడు లేవనెత్తిన విధానపరమైన కార్యాచరణ లోపాల ఉల్లంఘనలను తిరిగి పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బాలికను హత్యచేసిన కేసులో నాగపూర్‌కు చెందిన వసంత్ సంపత్ దుపారేకు కిందికోర్టు విధించిన మరణశిక్షను 2014లో సుప్రీంకోర్టు సమర్థించి ధృవీకరించింది. మరణశిక్ష తీర్పును పునఃపరిశీలించాలంటూ నేరస్థుడు ఆనాడే మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా 2017 మే 3వ తేదీన సుప్రీకోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత నేరస్థుడు మహారాష్ట్ర గవర్నర్‌కు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. ఆ క్షమాభిక్ష పిటిషన్‌ను కూడా 2022, 2023లలో తిరస్కరణకు గురైంది.

### ప్రజాస్వామ్యం, కుల వ్యవస్థ
# కలిసి ఉండలేవు

### మీరా కుమార్



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యం, కుల వ్యవస్థ కలిసి ఉండలేవని సోమవారం ఢిల్లీ అసెంబ్లీలో జరిగిన అఖిల భారత స్పీకర్ల సమావేశంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అన్నారు. ఈ సదస్సులో రెండవ రోజు ఆమె కీలక ప్రసంగం చేశారు. లోక్‌సభకు తొలి మహిళా స్పీకర్ అయిన కుమార్ మాట్లాడుతూ ‘సమానత్వం, అసమానత కలిసి ఉండలేవు. సమానత్వ ప్రజాస్వామ్య తప్పుడు బాహ్య రూపంతో అసమానత వృద్ధి చెందే అవకాశం ఉంది’ అని ఆమె అన్నారు. ప్రజాస్వామ్యం మరియు కుల వ్యవస్థ కలిసి ఉండలేవని కుమార్ అన్నారు. ‘అమర్‌బెల్’ (పరాన్నజీవి లత) అది పెరిగే చెట్టును ఎండబెట్టి, తద్వారా తనను తాను నిలబెట్టుకున్నట్లే, కుల వ్యవస్థ సమాజానికి అదే చేస్తుందన్నారు. సమానత్వాన్ని స్థాపించడం ప్రజాస్వామ్య ‘ఆత్మ’ అని, అది లేకుంటే చివరికి నిర్జీవంగా మారుతుందని ఆమె నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలనలో కేంద్ర శాసనసభకు ఎన్నికైన తొలి భారతీయురాలు విఠల్‌భాయ్ పటేల్ చేసిన కృషిని కుమార్ గుర్తు చేశారు. లోక్‌సభ సమావేశాలకు అధ్యక్షత వహించినప్పుడు పోరాటాలు, అనుభవం తనకు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ మొదటిసారి నిర్వహించిన ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్, కేంద్ర శాసనసభకు తొలి భారతీయ స్పీకర్‌గా పటేల్ ఎన్నికైన శతాబ్ది ఉత్సవాలను గుర్తుచేసుకుంది. ఆదివారం రెండు రోజుల సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.

### కేరళలో కాంగ్రెస్ నుంచి
# ఎమ్మెల్యే రాహుల్ సస్పెన్షన్



**కన్నూర్ :** కాంగ్రెస్ నాయకుడు, పాలక్కాడ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూటథిల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ తెలిపారు. అయితే మమ్‌కూటథిల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనే రాజకీయ ప్రత్యర్థుల డిమాండ్‌ను జోసెఫ్ తిరస్కరించారు. అధికారిక ఫిర్యాదు లేదా కేసు నమోదు అయ్యే వరకు వేచి ఉండకుండా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా తన పార్టీ పదవిని వదులుకోవడం ద్వారా శాసనసభ్యుడు ఒక ‘నమూనా‘గా నిలిచారని జోసెఫ్ అన్నారు. ఇరిట్టిలోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన జోసెఫ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ మమ్‌కూటథిల్‌ను ఎంత కాలం సస్పెండ్ చేశారనేది స్పష్టంగా చెప్పలేదు. ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా పరిగణించిందని జోసెఫ్ అన్నారు. కేరళలోని కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయంలో ప్రతిపక్ష నాయకుడు వి డి సతీషన్, మాజీ కెపిసిసి చీఫ్‌లు, రాష్ట్రంలోని ఎఐసిసి వర్కింగ్ కమిటీ సభ్యులు సహా వివిధ నాయకులతో వరుస సంప్రదింపులు జరిపి, ఈ విషయంలో ఏకగ్రీవ నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. ఈ విషయంలో పార్టీకి ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, చట్టపరమైన ఫిర్యాదు కూడా రాలేదన్నారు. ఎక్కడా కేసు నమోదు కాలేదని జోసెఫ్ వెల్లడించారు. అయితే రాజకీయ ప్రత్యర్థులు మమ్‌కూటథిల్‌ను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌లో ఎటువంటి సమర్థన లేదా తర్కం లేదని స్పష్టం చేశారు. వారికి అలాంటి డిమాండ్‌ను లేవనెత్తే నైతిక హక్కు లేదని, కేరళ రాజకీయాల్లో అలాంటి ప్రాధాన్యత లేదని కెపిసిసి చీఫ్ చెప్పారు. మలయాళ నటి రిని ఆన్ జార్జ్ ఒక ప్రసిద్ధ రాజకీయ పార్టీకి చెందిన ఒక యువ నాయకుడు అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపణలు చేసిన విదితమే.

# ఎల్‌ఒసి వెంట డ్రోన్ల సంచారం

### భారత్ భద్రతా దళాలు అప్రమత్తం



**న్యూఢిల్లీ :** నియంత్రణ రేఖ వెంట (ఎల్‌ఒసి) పాక్ డ్రోన్లు కలకం సృష్టించాయి. గగనతలంలో పాక్ డ్రోన్లను గుర్తించిన భారత్ భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఆదివారం రాత్రి సరిహద్దు అవతలి నుంచి ఆరు డ్రోన్లు ఎగురుతూ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఐదు నిమిషాల్లో అవి తిరిగి పాక్ భూభాగంలోకి వెళ్లాయన్నారు. నిఘా కోసం దాయాది దేశం వీటిని ప్రయోగించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. డ్రోన్లు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడిచి ఉంటాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. డ్రోన్ల కదలికను గుర్తించిన అన్ని ప్రాంతాల్లో సోమవారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు పలు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడుస్తుండడం పెద్ద సమస్యగా మారిందని అధికారులు పేర్కొన్నారు. పహల్గామ్‌దాడి అనంతరం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులు చొరబడకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ చేసే డ్రోన్ దాడులను తిప్పికొట్టేందుకు పటిష్ఠమైన చర్యల్లో భాగంగా బిఎస్‌ఎఫ్ అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేశారు. సరిహద్దు వెంబడి నిఘా ఉంచడంతో పాటు, శత్రు సేనల కదలికల్ని గమనించడం, దాడుల్లో పాల్గొనడం వంటి కార్యకలాపాల్లో వీటిని వినియోగించనున్నారు.

# కామెడీ పేరుతో ఎగతాళి చేస్తారా?

### మీ షోలోనే వారికి క్షమాపణలు
### చెప్పాలి : సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ :** దివ్యాంగులు, అరుదైన జన్యువ్యాధులతో బాధపడుతున్నవారిని ఎగతాళి చేస్తూ స్టాండప్ కామెడీ చేస్తున్న ఐదుగురు సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్లు క్షమాపణ చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. స్టాండప్ కామెడీ పేరుతో దివ్యాంగులను లక్ష్యంగా చేసుకోవడం తగదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సమయ్ రైనా సహా ఐదుగురు కమెడియన్లు తమ పాడ్‌కాస్ట్ లేదా కామెడీ షోలో క్షమాపణ చెప్పాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. సమయ్ రైనా, విపున్ గోయల్ తదితర కమెడియన్లు దివ్యాంగుల మనసు బాధించేలా జోకులు వేశారని ఎస్‌ఎంఎ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఇండియాస్ గాట్ లాటెంట్ షోలో యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్లతో పాటు ఈ పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రైనా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌ను సుప్రీం తప్పుబట్టింది. రైనా తనను తాను అమాయకుడిగా చిత్రీకరించుకొని తర్వాత క్షమాపణలు చెప్పారని విమర్శించింది. సోనాలి థక్కర్ బేషరతుగా తన షోలో చేసిన క్షమాపణ ఇప్పటికే ప్రసారమైందున ఆమె తప్ప మిగిలిన ఐదుగురు తమ షో లేదా పాడ్‌కాస్ట్‌లో క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ ఒక్క కేసుకే పరిమితం కాకుండా భవిష్యత్తు సవాళ్లను దృష్టిలోఉంచుకొని సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ఎగతాళిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ‘మేం బేషరతుగా క్షమాపణలు చెప్పాం. గత ఆదేశాలకు అనుగుణంగా ప్రతివాదులంతా హాజరయ్యారు’ అని రైనా తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ రోజు దివ్యాంగులు, తర్వాత మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇలా అందరినీ ఎగతాళి చేస్తూ పోతే ఇదంతా ఎక్కడ ఆగుతుందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యవహారశైలిపై జరిమానా విధించే అంశాన్ని తదుపరివిచారణలో పరిశీలిస్తామని తెలిపింది. అలాగే వారి యూట్యూబ్ ఛానళ్లలో కూడా క్షమాపణలు తెలియజేయాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా, ‘ఇండియాస్ గాట్ లాటెంట్’ షోలో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడం వల్ల ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

# ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న ట్రక్కు

### 9 మంది దుర్మరణం,
### మరో 42 మందికి గాయాలు
### యుపి బులంద్‌షహర్ జిల్లాలో ఘటన



**బులంద్‌షహర్ :** ఉత్తరప్రదేశ్‌లో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బులంద్‌షహర్ జిల్లాలో యాత్రికులతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మరణించారు. మరో 42 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మృతులలో ఇద్దరు మైనర్లు కాగా, గాయపడి ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో 12మంది 18ఏళ్లలోపు వారే ఉన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ యాత్రికుల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆర్నియా బైపాస్ సమీపంలోని బులంద్‌షహర్– అలీగఢ్ సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ ప్రమాదం జరిగింది. క్యాంటర్ ట్రక్కు ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుండి ఢీకొట్టడంతో అది బోల్తా పడిందని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (గ్రామీణ) దినేష్ కుమార్ సింగ్ తెలిపారు. ట్రాక్టర్ ట్రాలీలో 61 మంది ప్రయాణిస్తున్నారని, వారు కాస్‌గంజ్ జిల్లాలోని రఫత్‌పూర్ గ్రామం నుండి రాజస్థాన్‌లోని జహర్‌పీర్‌కు తీర్థయాత్ర కోసం వెళ్తున్నట్లు అని ఆయన చెప్పారు. బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించినట్లు పోలీసు అధికారి తెలిపారు. ఘటనాస్థలిలో ఎనిమిది మంది మృతి చెందగా, లేఖ్‌రాజ్ (40) అనే మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. 10మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని వారు తెలిపారు. బాధితులను చికిత్స కోసం బహుళ ఆసుపత్రులకు తరలించారు. 10 మందిని అలీఘర్ మెడికల్ కాలేజీకి, 23 మందిని బులందషహర్ జిల్లా ఆసుపత్రికి, 23 మందిని ఖుర్జాలోని కైలాష్ ఆసుపత్రికి తరలించారు. మృతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపినట్లు పోలీసులు తెలిపారు. మృతులను ట్రాక్టర్ డ్రైవర్ ఇ.యు. బాబు (40), రాంబేటి (65), చాందిని (12), ఘనిరామ్ (40), మోక్షి (40), శివాంష్ (6), యోగేష్ (50) మరియు వినోద్ (45), వీరందరూ కాస్‌గంజ్ జిల్లా నివాసితులు. జిల్లా మేజిస్ట్రేట్ శ్రుతి, ఎస్‌ఎస్‌పి సింగ్, ఇతర సీనియర్ అధికారులతో కలిసి ముసురులోనే ఘటనా స్థలాన్ని సందర్శించి, ఆసుపత్రిలో గాయపడిన వారితో మాట్లాడారు. కాగా, ట్రక్కును స్వాధీనం చేసుకున్నామని, తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

ప్రజాపక్షం
మంగళవారం, 26 ఆగస్టు

# రేవంత్ రెడ్డి ఒయు సందర్శన!

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం దానికదే పెట్టని కోట. రాజకీయ నాయకులకు ప్రవేశ నిషిద్ధ దుర్గం. స్వయం విద్యార్థి నాయకత్వంతో క్యాంపస్ లోపల ఎన్నో ఉద్యమాలు, అలజడులు, నిరాహార దీక్షలు, ఆత్మహనన కృత్యాలు. అనునిత్యం పోలీసులతో ఘర్షణ. పెద్ద ఎత్తున పోలీసు పహారాతో అది అనునిత్యం వార్తల్లో ఉండిన రణక్షేత్రం. ఉద్యమకాలంలోనే కాదు, స్వరాష్ట్రం సాధన, స్వపరిపాలన అనంతరం కూడా టిఆర్ఎస్ పరిపాలన సాగిన దాదాపు పదేళ్లకాలంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు విద్యార్థులు ప్రవేశ ద్వారాలు తెరవలేదు. 2017 జులై 7న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఒయు శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించిన సందర్భంలో ముఖ్యమంత్రి లాంఛనంగా పాల్గొన్నారు గాని స్వాగత ప్రసంగం చేయలేదు. విద్యార్థుల నుంచి తీవ్రమైన వ్యతిరేకతే కారణం. 2018 ప్రారంభంలో ఉత్సవాల ముగింపు – రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహం చూపనందున సాదాసీదాగా జరిగింది. ఆ తర్వాత మరోసారి ప్రయత్నించి విఫలమైనారు. మొత్తంమీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి తొలిసారి కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం తెలంగాణ విద్యా వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించి చరిత్ర సృష్టించారు. రూ.10 కోట్లతో నిర్మించిన అధునాతన డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూంను, దాదాపు రూ.90 కోట్లతో నిర్మించిన కొత్త హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు.

ముఖ్యమంత్రి సందర్శనను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ విద్యార్థి సంఘం తీవ్ర ప్రయత్నం చేయగా, కాంగ్రెస్ విద్యార్థి సంఘం అంతే పట్టుదలతో విజయవంతం చేసేందుకు పోటీ పడింది. శాంతి–భద్రతలకు బాధ్యత వహించే పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. బిఆర్ఎస్ విద్యార్థి నాయకులను ముందుగానే నిర్బంధంలోకి తీసుకొని రేవంత్ రెడ్డి కార్యక్రమం నిరాటంకంగా జరిగేందుకు తోడ్పడింది. తమ ముఖ్యమంత్రి కెసిఆర్ తొమ్మిదేళ్లపాటు ప్రవేశానికి నోచుకోని ఈ ప్రతిష్టాత్మక ప్రదేశంలో తమ ప్రత్యర్థికి సాదర స్వాగతం లభించటం బిఆర్ఎస్‌కు కన్నుకుట్టే వ్యవహారమే. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అక్కసు వెళ్లగక్కారు. 'విద్యార్థులను ముందే అరెస్టు చేశారు. అడుగడుక్కీ పోలీసులను పెట్టారు. ముళ్ల కంచెలు వేశారు. తాళ్లు పట్టుకుని రక్షణ ఇచ్చారు. ఆయన కొత్తగా ఏమి చేయటానికి పోయారు? కెసిఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మించిన భవనాలకు ప్రారంభోత్సవం చేశారు' అంటూ ఇదీ ఒక సందర్శనా అన్నట్లు ఎద్దేవా చేశారు. ఈ ముఖ్యమంత్రి ఏమి చేశారనే దానికన్నా తమ ముఖ్యమంత్రిని విద్యార్థులు ఎందుకు రానివ్వలేదో హరీశ్‌రావు పునరాలోచన చేసుకుంటే మేలు. గత ప్రభుత్వం మంజూరు చేసిన భవనాల నిర్మాణం పూర్తయితే, మళ్లీ ఎప్పుడో ప్రజలు కరుణించి ఆ గత నాయకుణ్ణి మళ్లీ ముఖ్యమంత్రిని చేసేవరకు అవి ప్రారంభోత్సవానికి నోచుకోకూడదా హరీశ్‌రావుగారు. అవి కెసిఆర్ లేక హరీశ్‌రావు సొంత ఆస్తికాదు. ప్రజాధనంతో నిర్మించినవి. ప్రభుత్వం నిరంతరాయ ప్రక్రియ అని తెలియదా? ఉద్యోగాల భర్తీపై అదే అక్కసు! కెసిఆర్ నోటిఫికేషన్‌లు ఇస్తే (ఎనిమిదేళ్లకుపైగా నిద్రపోయి – ఎన్నికల ముందు యివ్వటం వాస్తవం కాదా?) రేవంత్‌రెడ్డి ఆ కాగితాలు పంచిపెట్టారు అంటారు హరీశ్‌రావు. చిత్రంగా లేదూ!

ఉస్మానియా యూనివర్శిటీలో ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీటుగా సమాధానమిచ్చారు. 'నేను మీ వాణ్ణి – మీ మధ్యలో నుంచి వచ్చాను. ఇరవై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. మీరు గెలిపిస్తే ముఖ్యమంత్రి అయ్యాను... విద్యార్థులారా, రాజకీయ నాయకుల చెప్పుడు మాటలు వినకుండా, యూనివర్శిటీలో మీకు ఏమి కావాలో ఆలోచించండి, కాగితం మీద పెట్టండి. డిసెంబర్‌లో నేను మళ్లీ వస్తా. ఒక్క పోలీసు ఉండడు, నేను మీ మధ్యకు నడుచుకుంటూ వస్తా. ఆర్ట్స్ కాలేజి వద్ద మీటింగ్ పెడదాం. మీ సమస్యలు, కావలసిన సౌకర్యాల గూర్చి చర్చించుదాం. సాధ్యమైన వాటిపై అక్కడే జీఒలిస్తా. ఒయు అభివృద్ధికి రు.వెయ్యికోట్లయినా ఖర్చుపెడతాం. విద్యకు నేను అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. నా చిత్తశుద్ధిని నమ్మండి' అన్నారు. 'మా బిఆర్ఎస్ ప్రత్యర్థులు ప్రతిదాన్నీ వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్నారు–వాళ్లను పట్టించుకోవద్దు. అధ్యాపక, విద్యార్థులతో కూడిన సభికులు హర్షధ్వానాలు చేశారు. ఈ మాటలు నెరవేర్చటంపైనే ఒయులో సుహృద్భావం నెలకొనటం ఆధారపడి ఉంటుంది.

# రాజ్యాంగ విలువలకోసం ప్రతిపక్షం పోరాటం

భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ థంకడ్ రాజీనామాతో అనూహ్యంగా ఏర్పడిన ఖాళీ భర్తీ చేయటానికి నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. పాలక ఎన్‌డిఎ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్, ప్రతిపక్ష ఇండియా కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బాలకృష్ణ సుదర్శన్‌రెడ్డి నామినేషన్‌లు దాఖలు చేయటంతో పోటీకి రంగం సిద్ధమైంది. పార్లమెంటు ఉభయ సభల సభ్యులే ఎలక్టోరల్ కాలేజీ గనుక అధికార పార్టీ అభ్యర్థి తప్పక గెలిచే అవకాశాలుండగా ప్రతిపక్షాల పోటీ ఎందుకు అనే ప్రశ్న సహజం. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరుగుతుంది.

ఎన్‌డిఎ అభ్యర్థిని బలపరచాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి ఆ విజ్ఞప్తిని తిరస్కరించి తమ సొంత అభ్యర్థిని నిర్ణయించింది. ఇది లాంఛనప్రాయమైన పోటీ అని వారికి తెలుసు. దేశ రాజ్యాంగ విలువలను కాపాడవలసిన అవసరాన్ని ప్రజల దృష్టికి తేవటానికి ప్రతిపక్ష అభ్యర్థి పోటీ చేస్తున్నారు. ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్ ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తి.

భారత రాజ్యాంగం నిర్దేశించిన సోషలిస్టు, సెక్యులర్, ఫెడరల్, ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా హిందూ రాష్ట్ర (దేశం) స్థాపన ను కోరుకుంటున్న సంస్థ ఆర్ఎస్ఎస్. దాని రాజకీయ అంగం బిజెపి. అందువల్ల ఇండియా కూటమికి పోటీ చేయటం మినహా మార్గం లేదు. అందువల్ల దీన్ని 'భావజాల పోరాటం' అన్నారు. వారి సంయుక్త ప్రకటన ఇలా తెలిపిందిః "శ్రీ సుదర్శన్‌రెడ్డిగారిని తమ ఉమ్మడి అభ్యర్థిగా ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. మన దేశ స్వాతంత్ర్యోద్యమం తీర్చిదిద్దిన విలువలను, మన దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యంలో వేళ్లూనికొని ఉన్న విలువలను ఆయన గాఢంగా ప్రతిబింబిస్తున్నారు. ఈ విలువలన్నీ ఈనాడు దాడికి గురవుతున్నాయి. అందువల్ల ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మా సమష్టి సముదాయం నిర్ణయించింది".

ప్రధానమంత్రి ఆగస్టు 19న ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్‌ను బలపరచాలని విజ్ఞప్తి చేస్తూ ఉప రాష్ట్ర పదవికి ఆయన ఎంతో తగిన వ్యక్తి అన్నారు. ఆయన జీవితం వివాదరహితం, ఎంతో నమ్రతతో మెలిగే వ్యక్తి అన్నారు. వివిధ పార్టీలతో మాట్లాడి తోడ్పాటు సమీకరించే పనిని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు అప్పగించారు. ఆయన సంభాషణలు ఫలితమివ్వలేదు. రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన వ్యక్తి అయినందున డిఎంకె తోడ్పాటు లభిస్తుందని బిజెపి ఆశించింది. రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో మాట్లాడినా సానుకూల స్పందన రాలేదు.

ఎన్‌డిఎ అభ్యర్థికి డిఎంకె తోడ్పాటు రాబట్టేందుకు బిజెపి రాష్ట్ర శాఖ, ఎఐఎడిఎంకె "తమిళ కార్డు' ఉపయోగించినా ఆ ఒత్తిడి పనిచేయలేదు. తమకు "భావజాలం" అన్నిటికన్నా మిన్న అయినందున ఆయన్ను బలపరిచే ఉద్దేశం తమ పార్టీకి లేదని డిఎంకె స్పష్టం చేసింది. "మేము భావజాలానికే ప్రాధాన్యత ఇస్తాం. రాధాకృష్ణన్ తమిళుడన్న కారణాన ఆయన్ను బలపరచలేము. ఆయన భావజాలాలేమిటో చూడాలి కదా!" అన్నారు డిఎంకె అధికార ప్రతినిధి టికెఎస్ ఇళంగోవన్.

ఎన్‌డిఎ కూటమిలోని పార్టీలన్నీ అవే అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక వారి దృష్టిలో మామూలు ఎన్నిక కాదు. ఇదొక 'సైద్ధాంతిక పోరాటం. ప్రతీకప్రాయంగానైనా పోరాడాలి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించటం ద్వారా ఆర్ఎస్ఎస్–బిజెపి హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా రాజ్యాంగ విలువలను అభిలషించే దేశ ప్రజల్లో గొప్ప ఆశను రగిల్చారు. రాజ్యాంగ విలువల కోసం పోరాడుతున్న ఇండియా కూటమి అభ్యర్థి ఓడిపోవచ్చుగాక, కాని ఈ పోటీ దేశమంతటా చెప్పుకోదగ్గ రాజకీయ ప్రభావం కలుగజేస్తుంది.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి, స్థూలంగా తెలుగు ప్రజలకు చెందుతారు. అయితే ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న తెలుగు దేశం పార్టీ రాధాకృష్ణన్‌ను బలపరుస్తోంది. ప్రతిపక్ష వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి కూడా ఆయన్నే బలపరచటంలో ఆయన రాజకీయ అవసరాలేమిటో! కాగా తెలంగాణకు చెందిన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్‌కు కలలో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూతంలా కనిపిస్తున్నందున, ఆయన ఎంపిక చేసిన సుదర్శన్‌రెడ్డికి ఓటు చేయటమెలా అనే సందిగ్ధంలో ఉంది. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నందున, రాష్ట్రానికి 2లక్షల టన్నులు యూరియా ఇచ్చిన లేదా తెచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు చేస్తామంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అర్థరహితమైన ప్రకటన చేశారు. యూరియా ఇవ్వగలిగింది కేంద్ర ప్రభుత్వం కాబట్టి బిజెపి అభ్యర్థికే తమ ఓటు అని సంకేతప్రాయంగా చెప్పినట్లయింది. ఆయన పార్టీ ఓట్లను ఎవరు అడిగారు అని బిజెపి నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. రాజ్యసభలో మిగిలిన ముగ్గురులో ఒకరు అప్పుడే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కలిశారు. బహుశా పార్టీ ఓటింగ్‌కు గైరుహాజరు కావచ్చు. ఏమి జరుగుతుందో చూదాం !

ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగ పదవులకు సైతం తనకు విధేయులనే ఎంపిక చేయటంలో దిట్ట. దేశం చాలాసార్లు చూసింది. భారత ఎన్నికల కమిషనర్‌ల ఎంపిక తాజా ఉదాహరణ. మాజీ ఉపాధ్యక్షుడు జగ్‌దీప్ ధంకర్‌ను అమర్యాదకరంగా సాగనంపారు. అనారోగ్యం కారణంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ధంకర్ ఇప్పుడు ఎక్కడున్నారో కూడా వార్తలు లేవు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ మూలాలున్న రాధాకృష్ణన్ తెరమీదకు తెచ్చారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిబింబించే భావజాల పోరాటం, రానున్నకాలంలో దేశవ్యాప్తంగా జరిగే భావజాల పోరాటానికి ఆరంభ సంకేతం.

### ఎలక్టోరల్ కాలేజి

లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మొత్తం – 782
ఎన్‌డిఎ సభ్యులు – 394
ఇండియా కూటమి సభ్యులు – 323
(ఇంతకాలం ఎన్‌డిఎతో ప్రయాణించిన వైసిపి, బిజెడి తమ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నాయి. తమ ఓటింగ్‌పై ఇంకనూ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది)



ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి చంద్రగిరి పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 అక్టోబర్ 20న తిరుప్పూర్‌లో జన్మించారు. కోయంబత్తూరు చిదంబరం కళాశాలలో బిబిఎ డిగ్రీ పూర్తి చేశారు. తమ 17వ ఏట నుంచే ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పని చేశారు. 1974లో బిజెపి రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైనారు. 1998లో, తిరిగి 1999లో కోయంబత్తూరు నుంచి బిజెపి అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికైనారు. ఆ తదుపరి 2004, 2014, 2019 ఎన్నికల్లో ఓటమిపాలైనారు. 2004–07 మధ్య బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు.

పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 93 రోజులపాటు 19వేల కిలోమీటర్లు రథ యాత్ర నిర్వహించారు. 2016–2020 మధ్య కేంద్ర కాయిర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా నామినేట్ అయినారు. 2022–23 మధ్య ఝార్ఖండ్ గవర్నర్‌గా, 2024 జులై 27 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తూ తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. రాధాకృష్ణన్ క్రీడాకారుడు, సౌమ్యుడుగా పేరుంది.



జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఇండియా కూటమి బలపరుస్తున్న అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్నారు. ఆయన 1946 జులై 8న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా (తెలంగాణ) ఆకుల మైలారంలో వ్యవసాయదారు కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేసిన ఆయన 1971 లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బాచ్‌లర్ ఆఫ్ లా డిగ్రీ పొందారు. అదే సంవత్సరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో నమోదైనారు. 1988–90 మధ్య హైకోర్టులో గవర్నర్ ప్లీడర్‌గా పనిచేశారు. 1990లో కేంద్ర ప్రభుత్వానికి అడిషనల్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పర్మినెంట్ జడ్జీగా నియామకం పొందారు. 2005లో గువాహతీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు.

2007 జనవరి 12న సుప్రీంకోర్టు జడ్జీగా నియమితులై 2011 జులై 8న రిటైర్ అయినారు. అంతకుముందు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ రెడ్డి 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమించబడ్డారు. అయితే వ్యక్తిగత కారణాలతో సెప్టెంబర్‌లోనే రాజీనామా చేశారు.

# చిన్నారులపై సోషల్ మీడియా విధ్వంసాన్ని ఆపేదెలా?

నేటి ఆధునికయుగంలో సామాజిక మాధ్యమాలు, ఒటిటి వెబ్ సిరీస్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇవీ పిల్లల మనస్తత్వంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హింసాత్మక ఘటనలకు దారి తీస్తున్నాయి. ఇటీవల కూకట్‌పల్లిలో జరిగిన బాలిక హత్యకేసులో మైనర్ బాలుడు క్రైమ్ వెబ్ సిరీస్ తో ప్రేరణ పొందినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేయడం ఆన్‌లైన్ వేదికలలో తెలుసుకొన్నాడు. చోరీని బాలిక చూడడంతో ఆమెను కిరాతకంగా చంపాడు. బెంగళూరులో ఓ బాలుడు (14) వెబ్ సిరీస్ చూసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరీస్‌లోని ఓ క్యారెక్టర్ బొమ్మను కూడా తన గదిలో గీశాడు. కొందరు యువకులు ఒక బైక్‌పై ఎనిమిది మంది ఎక్కి నడపడం వంటి సాహసాలకు ఒడిగడుతున్నారు. పిల్లల్లో ఇలాంటి విపరీత ప్రవర్తనకు స్మార్ట్ ఫోన్ వినియోగం, ఓటిటి వెబ్ సిరీస్‌లు ప్రధాన కారణమని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. చిన్నారులు ఎదుగుతున్న దశలో సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసవడం వలన వారిలో విపరీత ప్రవర్తన, దూకుడు స్వభావం పెచ్చురిల్లుతుంది. పగ, శత్రుత్వం, దాడుల కు పుసిగొలుపుతున్నాయి. తద్వారా నేరాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ఇవి శాంతిభద్రత సమస్యలుగా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాలు తరచూ వీక్షించడం వలన పిల్లల్లో ఓపిక, సహనం, ఆలోచన శక్తి నశిస్తుంది. విద్య విషయాలలో వెనకబడుతున్నారు. విలువలు పతనమవుతున్నాయి. పిల్లలు పెద్దలపట్ల గౌరవం, మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు.

ప్రస్తుతం వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికలు సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధిత విషయాల తెలుసుకోవడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో అణచివేతకు గురైన వర్గాల గొంతును వినిపిస్తున్నాయి. సామాజిక చైతన్యానికి ఊపిరిలూదుతున్నాయి. వీటిద్వారానే కొన్నిసార్లు ప్రభు త్వం, అధికారుల స్పందన కూడా ఉంటుంది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన ఈ ఆన్లైన్ వేదికలు ఇప్పుడు పిల్లల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆటపాటలతో సాగే బాల్యం మొబైల్ స్క్రీన్ లో ఇరుక్కుపోయింది. వీటినుంచి పిల్లల్ని కట్టడి చేయడం తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. సామాజిక మాధ్యమాలను నియంత్రించకపోతే భవిష్యత్తు భావి, పౌర సమాజం అంధకారమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు దేశాలు సామాజిక మాధ్యమాల నుంచి పిల్లలను దూరంగా చేయాలని ఆలోచిస్తున్నాయి. తల్లిదండ్రుల కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు. గత ఏడాది ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించడంపై నిషేధం విధించింది. ఇప్పుడు ఫ్రాన్స్ కూడా అదే బాటలో నడిచే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్ పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి దాడి ఘటన తర్వాత 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా ను నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని ఫ్రాన్స్ ప్రధాని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇయు నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని లేదా తామే అమలు చేస్తామన్న ప్రకటించాడు. ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా ఫ్రాన్స్ నిలిచే అవకాశం ఉంది. చిన్నారులు, యువతపై సామాజిక మాధ్యమాల దుష్ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఫ్రాన్స్ ప్రభుత్వం నిర్ణయంపై చర్చ జరుగుతుంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సామాజిక మాధ్యమాల నియంత్రణపై ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా బాల జనాభా గల భారతదేశంలో బాలల్ని సామాజిక మాధ్యమాల వ్యసనం నుంచి దూరం చేయాలి. ప్రభుత్వపరంగా చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలి. 2023లో కర్ణాట క హైకోర్టు పాఠశాల పిల్లలు సామాజిక మాధ్యమాలకు అధికంగా వ్యసనం కావడం పట్ల ఆందోళనల వ్యక్తం చేసింది. ఈ మేరకు కోర్టు వీటిని వినియోగించడానికి 21 సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంలో కొన్ని షరతులను విధించింది. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఆన్లైన్ డేటాను నిర్వహించడానికి కంపెనీలు తల్లిదండ్రు ల సమ్మతి తీసుకోవాలని చెప్పింది. బాలల లక్ష్యంగా ఉండే ప్రకటనలపై పరిమితులు విధించింది. పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను డిజిటల్ పరికరాలకు దూరం చేయడం ముఖ్యమైన అంశం. అప్పుడప్పుడు విద్యా అవసరాలకు వినియోగిస్తున్నప్పు డు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. వారిలో విపరీత పోకడలను సరిదిద్దాలి. ఇంట్లో కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి ఫోన్ హాలిడే పెట్టుకోవాలి. ఇటీవల ఛత్తీస్‌గఢ్ లోని రాజ్నంద్ గావ్ జిల్లా గహీరాబేడీ గ్రామ పంచాయతీలో పిల్లలు ఫోన్ గేములు ఆడితే తల్లిదండ్రులకు రూ.3,000 జరిమానా విధిస్తామని ఆంక్షలు పెట్టారు. దీంతో ఆ గ్రామంలో చాలావరకు మార్పు కనిపించింది. ఇలాంటి కట్టడి ప్రతి గ్రామంలో రావాలి. ఆన్లైన్ మనీ గేమ్ తో యువత ఆర్థికంగా నష్టపోతుంది. ఈ క్రమంలో ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన ఆన్లైన్ గేమ్ నియంత్రణ బిల్లు2025 ను ఆమోదించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు కుటుంబ బంధుత్వాలు, విలువల గురించి బోధించాలి. పిల్లలతో కలిసి ఆడుకోనివ్వాలి. భారత్‌లో సామాజిక మాధ్యమాలు బావ ప్రకటన స్వేచ్ఛలో భాగం. కానీ స్వేచ్ఛ పేరుతో మీతీమీరడం తగదు. కావున పిల్లలు, యువత బాధ్యతయుత వినియోగమే పరిష్కారం.

సంపతి రమేష్ మహారాజ్

# అపర కుబేరుల ప్రపంచంలో ఆకలికేకలు

మొత్తం ప్రపంచ సంపద 471 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నదని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. ఇందులో సుమారు 16 ట్రిలియన్ డాలర్ల సంపద సుమారు మూడువేల మంది కుబేరుల మధ్య కేంద్రీకృతం కావడం ఆలోచించదగ్గ విషయం.

కుబేరుల సంఖ్య పెరుగుతున్నా, ప్రపంచంలో పేదరికం మాత్రం పోవడం లేదు. ఈనాటికీ ప్రపంచంలో అత్యధిక శాతం మంది అత్యల్ప ఆదాయంతో జీవిస్తూ, జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేక చెట్ల క్రింద, ఫుట్ పాత్ ల మీద, మురికి వాడల్లోను అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారు. కొన్ని దేశాల ప్రజలు తినడానికి తిండిలేక, త్రాగడానికి పరిశుభ్రమైన నీరు లేక అలమటిస్తున్నారు. ఎందుకింత ఆర్థిక అంతరాలు? దీనికి పరిష్కార మేమిటి? ప్రపంచంలో పేదరికంలో ప్రజలు మగ్గి పోవడానికి అవినీతి జాఢ్యమే చాలావరకు కారణమని చెప్పక తప్పదు. అక్రమార్జనతో ధనికులుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతున్నదని అనేక గణాంకాలు సూచిస్తున్నాయి.



ఆర్థిక ఎదుగుదల అంటే అక్రమ సంపాదన కాదు. ప్రభుత్వ చట్టాలకు లోబడి,పన్నులు ఎగవేయకుండా తమ కష్టార్జితంతో, ప్రతిభతో ఆర్థికంగా ఎదగడంలో ఎలాంటి తప్పు లేదు. తెలివి తేటలు కూడా ఆర్థిక ఎదుగుదలకు ఒక ఉన్నతమైన మార్గం. అవినీతిని ప్రతిభగా వర్ణించడం హాస్యాస్పదం. రాత్రికి రాత్రే కుబేరులుగా మారిపోవడం, వివిధ మార్గాల ద్వారా, పైరవీల ద్వారా ధనవంతులు కావడం ముమ్మాటికీ అవినీతే. శ్రమకు తగిన ప్రతిఫలం అన్ని వర్గాల ప్రజలకు లభించాలి. అవినీతిని అరికడితే ఆర్థిక అసమానతలు అంతరిస్తాయి. అన్ని వర్గాల ప్రజలకు అందరితో పాటు సమాన అవకాశాలు లభించాలి. ఇతరుల ప్రతిభను అణచివేయడం, అవినీతి సంపాదనతో కోట్లకు పడగలెత్తడం అందరి కష్టం సంపదగా మారి కొందరి జేబుల్లోకి పోవడం దుర్మార్గం. ఎక్కడైతే విలువలు నశించి,స్వార్థం జడలు విప్పి నర్తిస్తుందో, ఎక్కడైతే మానవత్వ ఛాయలు మటుమాయమై, ఆర్థిక దోపిడీ జరుగుతుందో, ఎక్కడైతే ఆయాచితంగా వచ్చే సంపదకోసం అర్రులు చాస్తారో, ఎక్కడైతే శ్రమకు విలువ నశించి, ఆర్థికంగా ఎదగడానికి మార్గం సులభతరమౌతుందో, ఎక్కడైతే ఇతరులను దోచుకుని ఎదగాలనే ఆలోచన వికృత రూపం ధరించి వికటాట్ట హాసం చేస్తుందో, అక్కడ అవినీతి విశృంఖల విహారం చేస్తుంది. వందమంది సొమ్మును ఒక్కరే గుటకాయ స్వాహా చేసి, ఆకాశహర్మ్యాలనంటే భవంతుల్లో రాజభోగాలను అనుభవించాలనే దురాలోచన వలన పలురకాల అరాచకాలు జరుగుతున్నాయి. అక్రమ ధనార్జనకోసం సాగే అవినీతి క్రీడలో జరిగే మహాపరాధాలకు ఎంతో మంది బతుకు చిత్రాలు తారుమారై పోతున్నాయి.

ఎన్నో జీవితాలు ఆర్థిక లేమితో చితికి పోయి, అల్లాడి పోతున్నాయి. అవినీతిలేని చోటంటూ ఎక్కడా లేదు. నీతికి గుక్కెడు గంజి దొరకదు. గజం జాగా కరువు. అవినీతికి ఆద్యంతాలు కనిపెట్టడం కష్టతరం. పేద, ధనిక, వర్ధమాన దేశాలన్నింటిలో అన్ని ంగాల్లో అవినీతి తాండవిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అవినీతిని నిర్మూలించడానికి, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను వక్రమార్గాలతో కొల్లగొట్టకుండా పారదర్శకత, జవాబుదారీతనంతో పరిరక్షించడానికి అంతర్జాతీయ సహకారం, సాంకేతిక సహాయం కోసం ప్రయత్నించి,అభివృద్ధి దిశగా ప్రపంచాన్ని నడపాలని ఐక్యరాజ్యసమితి చాలాకాలంగా కృషి చేస్తున్నది. అవినీతి అరికట్టడంలో ప్రభుత్వాల, పౌరసమాజం పాత్ర ఎంతైనా ఉంది. విద్యావంతులు, న్యాయవాదులు, పాత్రికేయులు సమష్టి బాధ్యత వహించి అవినీతి నిర్మూలనకు పాటు పడాలని అంతర్జాతీయ సమాజం ఆకాంక్షిస్తున్నది. ప్రపంచ సంపద కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం ప్రపంచ ప్రగతికి సూచిక కాదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ప్రపంచ సంపద పెరుగుతున్నది. పెరిగిన సంపద కొద్దిమంది భోషాణాల్లో మూలుగుతుండడం పెరుగుతున్న ఆర్థిక అంతరాలకు ప్రత్యక్ష నిదర్శనం. బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నది. అదే సందర్భంలో జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేక కోట్లాది మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గి పోతున్నారు. ఆర్థిక ఎదుగుదల మంచిదే. కాని అందని ద్రాక్షపండులా, ఎవరికీ ఉపకరించక, విదేశీ బ్యాంకుల్లో మూలిగే ట్రిలియన్ల సంపద వలన ఒరిగే ప్రయోజనం శూన్యం.

# వీధుల నిండా కుక్కలు, కోతుల గుంపులే!

కుక్క అంటేనే విశ్వాసానికి పర్యాయపదం. కుక్కలు అపూర్వ ప్రేమ ను కుమ్మరిస్తాయి. యజమానితో స్నేహం చేస్తాయి. అపరిచిత వ్యక్తుల రాకను సూచిస్తాయి, హెచ్చరిస్తాయి, అనుమానితున్ని కరిచే ప్రయత్నం కూడా చేస్తాయి. సాధు జంతువుగా కుటుంబ సభ్యుని వలె ప్రవర్తిస్తాయి. యజమాని బాధను కూడా అర్థం చేసుకుంటాయి. ఇంట్లో కుక్క ఉంటే ఆ ఇల్లు సందడిగా ఉంటుంది. అయితే కుక్కలతో సమస్యలు లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా కోట్ల కొద్ది కుక్కలు ఉన్నా యి. 2019 వివరాల ప్రకారం భారత్‌లో దాదాపు 1.5 కోట్ల వీధి కుక్క లు ఉన్నట్లు గుర్తించారు. ఒక ఢిల్లీ ప్రాంతంలోనే జనవరి జూన్ 2025 మధ్య 35,198 మంది వీధి కుక్కల కాటుకు బలికావడం కలవరానికి గురి చేస్తున్నది. ఈ గణాంకాలు దేశవ్యాప్తంగా వీధి కుక్కల బెడదను వర్ణిస్తున్నాయి. పల్లె నుంచి పట్నం వరకు ఊరు, వాడా, నగర వీధుల్లో వీధి కుక్కల స్వైరవిహారాలు చూస్తున్నాం, భయపడుతూ తప్పించుకొని తిరుగుతున్నాం. ప్రతి కుక్కకాటు వల్ల సగటున రూ.5,128/– వైద్య ఖర్చులకు వినియోగించడం జరుగుతోంది. 2004 నుంచి ప్రతి ఏట 26 ఆగస్టున విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ కుక్కల దినం (ఇంటర్నేషనల్ డాగ్ డే) పాటించటం ఆనవాయితీ. వివిధ రకాల కుక్కలను సాదుకోవడం, ఆప్యాయంగా చూడడం, వాటిప్రేమను రుచి చూడడం, వీధి కుక్కలను మచ్చిక చేసుకోవడం, షెల్టర్‌లో ఉన్న శునకాలను సాదుకోవడం, కుక్కలకు వైద్య సేవలు అందించడం, మానసిక ప్రశాంతతను పొందడం లాంటి విషయాల్లో అవగాహన కల్పించడం లాంటివి చేపట్టడం జరుగుతున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఏ జంతువును కూడా చట్టవిరుద్ధంగా నిర్బంధించడం లేదా చంపివేయడం నిషేధం అని తెలుసు కోవాలి. కుక్కల బెడదను తట్టుకోవడానికి వాటికి ర్యాబిస్ టీకాలు ఇప్పించడం, సంతానం కలుగకుండా స్టెరిలైజ్ చేయడం జరగాలి. భారతంలో వీధివీధినా వీధి కుక్కల బెడద భయపెడుతున్నది. వీధి కుక్కలతో మానవాళికి ఒక ప్రమాదం ఉన్నది. భారతీయ రోడ్ల వెంట తిరుగుతున్న 10 మిలియన్ల కుక్కలతో పిల్లల నుంచి పెద్దలకు ఇబ్బందులు, కాటు చేయడం జరుగుతున్నాయి. కుక్క కాటు సమస్యకు పరిష్కారంగా వీధి కుక్కలకు టీకాలు వేయించడం, కుక్కలను స్టెరిలైజ్ చేసి సంతానోత్పత్తిని తగ్గించడం లాంటి చర్యలు తీసుకోవాలి. దీనికి ప్రభుత్వ చొరవ అత్యవసరంగా ఉంటుంది. వివిధ సంస్థల సమన్వయం, వెటర్నరీ సిబ్బంది అంకితభావం, పౌర సమాజ చొరవ, స్వచ్ఛంద సంస్థల సహకారం, సంబంధిత విభాగాల సహాయంతో కుక్కల బెడదకు చెక్ పెట్టవచ్చు.

(26 ఆగస్టు అంతర్జాతీయ కుక్కల దినం సందర్భంగా)

# ఇ వేస్ట్ – లిథియం బ్యాటరీలు పర్యావరణానికి ప్రమాదం

ఆధునిక సమాజంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు అనివార్యమైనవి. ఇవి మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, వాటి వ్యర్థాలు ముఖ్యంగా ఈవేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు), లిథియం బ్యాటరీలు పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. లిథియం బ్యాటరీలు, ఇవి స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ కార్లలో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. వాటి ఉత్పత్తి, ఉపయోగం, నిర్వహణ పర్యావరణానికి హానికరమైనవి. ఈ వేస్ట్ అంటే పాత ఎలక్ట్రానిక్ పరికరాలు, వాటి భాగాలు, ఇందులో లిథియం, అయాన్ బ్యాటరీలు ముఖ్యమైనవి. ప్రపంచవ్యాప్తంగా, ఈ వేస్ట్ పరిమాణం వేగంగా పెరుగుతోంది. ఉదాహరణకు, 2019లో 53.6 మిలియన్ టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. ఇది 2030 నాటికి 74 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. లిథియం బ్యాటరీలు ఇందులో సుమారు 5–10 శాతం ఉంటాయి. ఈ బ్యాటరీలు లీథియం, కోబాల్ట్, నికెల్, కాపర్ వంటి భారీ లోహాలను కలిగి ఉంటాయి. ఇవి లీచింగ్ ప్రక్రియ ద్వారా మట్టి మరియు నీటిలో కలుస్తాయి. ఆస్ట్రేలియాలో, లిథియం బ్యాటరీలు 98.3 శాతం ల్యాండ్ ఫిల్లింగ్‌లకు వెళ్తాయి. ఇది అగ్ని ప్రమాదాలను పెంచుతుంది. విషపూరిత వాయువులను విడుదల చేస్తుంది. విశ్లేషణాత్మకంగా చూస్తే, లిథియం బ్యాటరీల పర్యావరణ ప్రభావం మూడు దశలలో విస్తరిస్తుంది: మైనింగ్, మాన్యుఫాక్చరింగ్ మరియు డిస్పోజల్. మైనిం గ్ దశలో, లీథియం సాల్ట్ బ్రైన్‌ల నుండి డ్రిల్లింగ్ ద్వారా సేకరించబడుతుంది, ఇది భారీ నీటి వినియోగాన్ని కలిగిస్తుంది. ఒక టన్ లిథియం కోసం 2 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉంటుంది. ఇది చిలీ అలాగే అర్జెంటీనా వంటి ప్రాంతాలలో నీటి కొరతను పెంచుతుంది.కోబాల్ట్ మైనింగ్, ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో, బాల కార్మికులను ఉపయోగించడం, మట్టి కాలుష్యాన్ని కలిగిస్తుంది. మాన్యుఫాక్చరింగ్ దశలో, బ్యాటరీల ఉత్పత్తి ఇంధనఇంటెన్సివ్, ఇది గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎమిషన్లను పెంచుతుంది. చైనాలో, బ్యాటరీల ఉత్పత్తి 60 శాతం కోల్ ఆధారిత విద్యుత్‌పై ఆధారపడుతుంది, ఇది ఫాసిల్ ఫ్యూల్ బ్యాటరీల కంటే మూడు రెట్లు ఎక్కువ ఎనర్జీని డిమాండ చేస్తుంది. డిస్పోజల్ దశలో, ల్యాండ్‌ఫిల్లులలో బ్యాటరీలు కుళ్ళిపోయి, విషపూరిత పదార్థాలు (కోబాల్ట్, నికెల్, లెడ్ లీక్ అవుతాయి, నీటిని, మట్టిని కలుషితం చేస్తాయి. అమెరికాలో, లిథియం బ్యాటరీలు హజార్డస్ వేస్ట్‌గా వర్గీకరించబడ్డాయి. ఎందుకంటే అవి లెడ్ కోబాల్ట్, కాపర్ వంటి లోహాలను విడుదల చేస్తాయి కనుక. ఇవి రెగ్యులేటరీ లిమిట్లను మించిపోతాయి. విమర్శనాత్మకంగా చూస్తే, ప్రస్తుత వ్యవస్థలు అసమర్థమైనవి, అసమానమైనవి. రీసైక్లింగ్ రేటు తక్కువ. ప్రపంచవ్యాప్తంగా లిథియం బ్యాటరీలు కేవలం 5 శాతం మాత్రమే రీసైకిల్ అవుతాయి, మిగిలినవి ల్యాండ్‌ఫిల్లింగ్‌లకు వెళ్తాయి. పైరోమెటలర్జికల్, హైడ్రోమెటలర్జికల్ ప్రాసెస్‌లు ఉపయోగించబడుతున్నప్పటికీ, అవి ఎనర్జీఇంటెన్సివ్, సెకండరీ వేస్ట్ ఉత్పత్తి చేస్తాయి. ఈవేస్ట్, లిథియం బ్యాటరీలు పర్యావరణానికి తీవ్రమైన హాని కలిగిస్తాయి. ఇది పర్యావరణానికి హెచ్చరిక. మైనింగ్ నుండి డిస్పోజల్ వరకు ప్రభావాలు స్పష్టం. త్వరగా ఈ సమస్యలను పరిష్కరించకపోతే, సస్టైనబుల్ ఎనర్జీ టార్గెట్లు విఫలమవుతాయి.

దండెబోయిన అశోక్ యాదవ్,
9440521990.

## ఎయిడ్స్ అవగాహనపై 5 కిలోమీటర్ల రన్ పోటీలు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఎయిడ్స్ అవగాహనలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖాధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు 5 కిలోమీటర్ల రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, అడిషనల్ డీయంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, డాక్టర్ అవంతి మెడికల్ ఆఫీసర్ జెండా ఊపి రన్ ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, స్వామి, బాలమణి, రవి గౌడ్, వెంకటేష్, సుధాకర్, నవీన్, మోహిన్, రామకృష్ణ, వినయ్, నరేష్, వెంకటమరణ, రామస్వామి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 102 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 102 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, హౌసింగ్ పిడి పవన్‌కుమార్,ఎసిపి రాజావెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ప రిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## యూరియా కొరతపై రైతులతో కలిసి రాస్తారోకో చేసిన ఎమ్మెల్యే

### అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలోని యూరియా కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సోమవారం సిర్పూర్ ఎంఎల్‌ఎ పాల్వాయి హరీష్‌బాబు మార్కెట్ కమిటీ ఎదురుగా భట్‌పల్లి చౌరస్తాలో రైతులతో కలిసి బహిరంగంగా రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందజేసిన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా పంపిణీ చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అధికారులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రైతులకు రూ.266కే రావాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్‌లో రూ.600లకు ఎలా దొరుకుతుందని పేర్కొన్నారు. కేంద్రం యూరియా ఇచ్చినా రాష్ట్రం సక్రమంగా వినియోగించడం లేదన్నారు. పట్టణంలో ధర్నా చేపట్టడంతో ఇరువైపులా భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ధర్నా విరమించాలని ఎమ్మెల్యేను కోరినప్పటికీ ఆయన వినకపోవడంతో అరెస్టు చేసి బలవంతంగా వాహనంలో పోలీసులు అక్కడి నుండి తీసుకొనివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండలానికి చెందిన వివిధ గ్రామాల మహిళా రైతులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

# వనమహోత్సవం వంద శాతం పూర్తిచేయాలి

### ఎకో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాలకు ప్రోత్సాహం

### స్వచ్ఛంద సంస్థల సహకారంతో పర్యావరణ పరిరక్షణ




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాలను వంద శాతం పూర్తిచేయాలని ,కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాంక్ ఏర్పాటు చేసి ఆన్లైన్ లో నమోదు తప్పనిసరి చేయాలని సూచించారు. ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం (హోమ్ షెడ్స్)ను కూడా సమగ్రంగా పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్ష సమావేశములో మాట్లాడుతూ జిల్లాలో నాటిన ప్రతి మొక్క వృథా కాకూడదని ప్రతి మొక్కను సంరక్షించడానికి బాధ్యత వహించాలని వనమహోత్సవ కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం (హోమ్ షెడ్స్)ను కూడా సమగ్రంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గణేష్ నవరాత్రి వేడుకలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా అధికారులు స్వచ్ఛంద సంస్థలు కలిసి ఎకో ఫ్రెండ్లీ మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపు నిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆద్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణి నిర్వహించారు. మట్టి విగ్రహాలు సహజంగా కరిగి పోయి నీరు. నేల స్వచ్ఛతను కాపాడుతాయని, అందువలన ప్రతి కుటుంబం ఎకో ఫ్రెండ్లీ గణపతిని ప్రతిష్టించి పర్యావరణ, పరిరక్షణలో బాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాదురి, డిఆర్ఓ పద్మజ రాణి, జడ్పీ సిఇఒ జానకిరెడ్డి, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నేటి 'ప్రజావాణి'కి 35 ఫిర్యాదులు

**సంగారెడ్డి :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాని కార్యక్రమానికి 35 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి నారాయణఖేడ్ కలెక్టర్ ఉమా హారతి, డిఆర్ఒ పద్మజ రాణిలకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు.

కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థుల హాజరు శత శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శత శాతం ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లాలోని రెబ్బెన మండలం నేర్పల్లి గ్రామపంచాయతీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యవసర సరుకులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలకు గైర్హాజరు అయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సదుపాయాలను కల్పించడంతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన తాగు నీటిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి నిర్మాణం త్వరగా పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల విద్యాధికారి వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు పాల్గొన్నారు.



## బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

### బిఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ తప్పకుండా అమలు చేయాలని బిఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సోమవారం నిర్వహించిన బిసిలకు 42శాతం అమలు సాధన కోసం సత్యగ్రహ దీక్ష చేపట్టిన బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, మాజీ శాసనమండలి చైర్మన్ మధుసుదనచారిని మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్‌తో మర్యాదపూర్వకంగా కలసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం తీవ్రంగా వ్యతిరేస్తున్నామని హెచ్చరించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ రాజ్యాంగ బద్దంగా జీవో జారీ చేసి పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న జరగనున్న ప్రభుత్వ కేబినేట్ మీటింగ్‌లో బిసి రిజర్వేషన్‌పై చట్టబద్ధత చేయకుండా స్థానిక ఎన్నికలకు వెళ్తే తప్పకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు అండర్ పాస్‌లు,ఫ్లైఓవర్లు నిర్మించాలి

### రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** రోడ్డు ప్రమాదాల నివారణకు అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్ నాందేడ్ నేషనల్ హైవేపై అండర్‌పాస్‌ల ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం నేషనల్ హైవే ఆథారిటీ అధికారులతో కలసి సోమవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ స్థల పరిశీలన చేశారు. నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అవసరమైన చోట అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించాలని పలుమార్లు నేషనల్ హైవే ఆథారిటీకి మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో అండర్‌పాసుల ఫ్లైఓవర్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎన్‌హెచ్ ఎఐ, అండర్ పాసులు,ఫ్లైఓవర్లు ఎక్కడెక్కడ నిర్మించాలో నిర్ణయించడానికి పరిశీలన కోసం వచ్చిన ఎన్‌హెచ్‌ఎఐ ఉన్నతాధికారులు యాక్సిడెంట్లు జరుగుతున్న ప్రాంతాలను స్వయంగా చూపించి ఆయా ప్రాంతాల్లో అండర్‌పాసులు,ఫ్లైఓవర్ల నిర్మాణ ఆవశ్యకతను అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ వివరించారు. ముస్లాపూర్, బోడ్మట్‌పల్లి చౌరస్తా వద్ద యాక్సిడెంట్ స్పాట్లను అధికారులకు మంత్రి చూపించారు. ఎన్‌హెచ్ అధికారులను కూర్చొబెట్టుకుని తానే స్వయంగా కారు నడుపుతూ అదికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనలు చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బ్రెయిన్ చోరీ


### రాహుల్‌గాంధీ ఓటు చోరీ కొత్త డ్రామా

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బ్రెయిన్ చోరీ అయిందని, అందుకే ఆయన ఓటు చోరీ కొత్త డ్రామా ఆడుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం జిల్లాలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం శ్రీరామగార్డెన్‌లో నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్‌ను దేశంలోని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, యావత్ ప్రజానీకం మోదీ వెంటే ఉన్నారన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లోనే కాదు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు.

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించటం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ మతపరమైన రిజర్వేషన్లకు దూరంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అనేక పథకాల్లో కేంద్ర వాటా ఉందని, ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు కృషి యాలన్నారు. పార్టీకి కార్యకర్తలే ముఖ్యమని, సంపద అని, యువత, మహిళలు పెద్ద ఎత్తున చేరాలన్నారు. జిల్లా పార్లమెంట్ అంటేనే బిజెపికి తిరుగులేని అడ్డా అన్నారు. అరవింద్ మాట్లాడుతూ పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర, జిల్లా స్థాయిలో పదవులు కట్టబెట్టాలన్నారు. సంస్థల ఎన్నికల్లో బిజెపి మొట్టమొదటి జెడ్‌పి చైర్మన్, కార్పొరేషన్ మేయర్ నిజామాబాద్ నుంచే గెలిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, 30 శాతం మహిళలకు రిజర్వేషన్ చేసింది మన ప్రధాని మోదీనే అని గుర్తుచేశారు. అనంతరం ఎంపి ధర్మపురి తన పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలకు, నూతన గృహ ప్రవేశాలు చేసిన వారికి, అనారోగ్యం పాలైన వారికి చెక్కులను ఉంచారు. అలాగే జర్నలిస్టులకు బీమా కల్పించారు. కార్యక్రమంలో ఎంపి ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రాజకీయాలకు అతీతంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ప్రజాపక్షం/భైంసా :** రాజకీయాలకతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. సోమవారం భైంసాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 103 మంది లబ్ధిదారులకు 23 లక్షల 63 వేల రూపాయలు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం బారినపడితే ప్రభుత్వం తరుపున సహాయం అందించడమే ముఖ్యమంత్రి సహాయనిధి ధ్యేయమన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని, ప్రజలు నేరుగా వచ్చి తమ కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వేలాది చెక్కులను 20నెలల కాలంలో అందించడం జరిగిందన్నారు. సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. పేద ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని విద్య, వైద్యం, సాగునీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. ఎన్నికల అప్పుడే రాజకీయాలని సంక్షేమ ఫలాలు అర్హులైన పేదవారికి అందించడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బిజెపి మండలాల అధ్యక్షుడు రావుల రాము, సిరం సుష్మారెడ్డి, లక్ష్మారెడ్డి, పోతన్న, మాజీ సర్పంచ్ సచిన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కొరతపై బిఆర్‌ఎస్ నిరసన

**ప్రజాపక్షం/కెరమెరి :** రైతన్నలకు యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని నిరసిస్తూ సోమవారం కెరమెరి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు రైతుల పక్షాన బిఆర్‌ఎస్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డికి కండ్లకు కనపడటం లేదని, చెవులకు వినపడడం లేదని ధ్వజమెత్తారు. గత కేసిఆర్ ప్రభుత్వం రైతులకు కోతలు లేకుండా 24 గంటల కరెంటు ఇచ్చారని, సకాలంలో రైతు బంధు ఇచ్చి రుణమాఫీ చేశారని తెలిపారు. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని కరెంటు కోతలు పెడుతుందని, రైతు భరోసా సకాలంలో ఇవ్వకుండా రెండు దఫాలుగా ఎగొట్టారని దుయ్యపడ్డారు. 2లక్షల రైతు ఋణమాఫీ ఇంకా సంగం మందికి కాలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను పీడిస్తూ గద్దెనెక్కి కూర్చున్న సీఎం రేవంత్, మత్రులు దీనికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత

### కలెక్టర్ వినయ్‌కృష్ణారెడి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అనునిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుధ్య కార్మికుల భద్రతా, సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే కమిటీ సమావేశం జరగగా పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ఆయా శాఖల ద్వారా పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న పథకాలు, ప్రయోజనాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, 1993 నిషేధ చట్టం పకడ్బంధీగా అమలవుతోందని జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి రజిత కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకోవటం జరుగుతుందన్నారు. జిల్లాలోని నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు, 545 గ్రామపంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్మికులు ఇంటింటి చెత్తను సేకరించి వాహనాల ద్వారా డంప్ యార్డులకు తరలిస్తున్నారన్నారు. మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టంపై ప్రజలో అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కృషి చేయాలన్నారు.

సపాయి కర్మచారిలందరూ ఆన్‌లైన్ ఫోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రవిబాబు, సిపిఒ రతన్, వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.




# బిసి రిజర్వేషన్ల సాధనకు రిలే నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/జన్నారం :** బిసి జాతీయ సంఘం అధ్యక్షులు రాజ్యసభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు సోమవారం రోజున జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిసి కన్వీనర్ కడార్ల నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని విద్య ఉద్యోగాలలో ప్రమోషన్లలో చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలని రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే ప్రతిఘటిస్తామని ప్రజలు కూడా రిజర్వేషన్లు ఏర్పడకపోతే ఎన్నికల్లో పాల్గొనబోరని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో తప్పనిసరిగా రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బిసి కేయూపిఎస్ కన్వీనర్ ఆడెపు లక్ష్మి నారాయణ, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్ గౌడ్, జన్నారం మండల బిసి సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు

### జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారి సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహించాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోడ్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల్లో పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. శోభాయాత్ర సమయాల్లో డీజేలు పెట్టడం నిషేధమని, లక్కీ డ్రా, లాటరీల నిర్వహణ రాష్ట్రంలో అనుమతి లేదని నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సూచించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ ఐపిఎస్, కాగజ్‌నగర్ డిఎస్‌పి రామానుజ, డిసిఆర్‌బి డిఎస్పి విష్ణు మూర్తి, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# మా సమస్యలు పరిష్కరించండి

### రేగోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

**ప్రజాపక్షం/రేగోడ్ :** మెదక్ జిల్లా రేగోడ్ విద్యుత్ సమస్య పై రైతులు ఆందోళన చేశారు పంట పొలాలు ఎండిపోతున్నాయ అంటూ సబ్‌స్టేషన్ ముట్టడించారు వివరాల్లోకి పోతే రేగోడ్ మండలంలోని చౌదర్పల్లి కొత్వన్ పల్లి గ్రామాలో రైతులు సోమవారం రేగోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించారు వద్ద బైఠాయించారు ప్రభుత్వం వ్యవసాయానికి 18 గంటల కరెంటు ఇస్తున్నామని చెప్తున్నప్పటికి విద్యుత్ అధికారులు 8 గంటల కూడా సరిగా కరెంటు ఇవ్వడం లేదని ఆందోళన చేశారు రేగోడ్ పక్కనే సంగారెడ్డి జిల్లాలో 18 గంటలు ఇస్తున్నారని రైతులు అన్నారు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే రేగోడ్ సబ్‌స్టేషన్ కింద కరెంట్ సరఫరా సరిగా చేయడంలేదని రోజుకు 15సార్లు ట్రిప్ అవుతుందని అన్నారు దీంతో మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రేగోడ్ ఎస్సై పోచయ్య రేగోడ్ రేగోడ్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు పై అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించకపోతే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు చెప్పారు.



## గణేష్ మండప నిర్వాహకులు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** గణేష్‌మండప నిర్వాహకులు పోర్టల్ లో నమోదు చేసుకోవాలని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్,ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు.సోమవారం గణేష్‌మండపాల నిర్వాహకులకు పిలిచి సమావేశం నిర్వహించారు.అన్లైన్‌లో పూర్తి వివరాలు ఉంటాయని వాటికి సంబంధించిన ఆధారాలు తెలియపరచాలని కోరారు.ముందస్తు సమాచారం ఏదైన ఉంటే స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.మొబైల్‌లో కాని లాప్‌టాప్‌లో వెబ్‌సైట్ ఉంటుందన్నారు.అందుకోసం www.policeportaltspolice



gov.in/index.htmలో పొందుపరచాలన్నారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

### పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** ప్రజల నుంచి డయల్ 100 ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. సోమవారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్స్ వారి పరిధిలోని పాయింట్ బుక్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, సంఘ విద్రోహ వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, వారి సమాచారాన్ని నమోదు చేసుకోవాలని తెలిపారు. రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాల సంధర్భంగా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపి సిసిఆర్‌బి శ్రీనివాస్ జి, ఇన్స్‌పెక్టర్లు సరిలాల్, వెంకటేష్‌లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో వంద శాతం హాజరు ఉండాలి

### విద్యార్థులకు కలెక్టర్ పమేలా సత్పతి సూచన





**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్ లోని జడ్పీ గర్ల్స్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకదేతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలు తయారు చేసిన మట్టి వినాయకులను పరిశీలించి అభినందించారు. అనంతరం 8 వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి హాజరు పెంచాలన్నారు.

**భవిత కేంద్రం సందర్శన...**

మానకొండూర్ లోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజి వాకడే సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. పలువురు విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెలలో బోధిస్తున్న అంశాలు సిలబస్ గురించి ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఫిజియోథెరపిస్టు, స్పీచ్‌థెరపీ సేవలను క్రమం తప్పకుండాఅందించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్, ఎంఈవో మధుసూదనా చారి, ఎంపీడీవో వరలక్ష్మి, భవిత సెంటర్ ఇచార్జీ జ్యోతి, కార్యదర్శి రేవంత్ ఉన్నారు.

**ప్రజావాణికి 328 దరఖాస్తులు**

కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 328 మంది అర్జీదారులు ధరఖాస్తులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన ధరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేస్తూ ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఆన్‌లైన్ లోని పెండింగ్ ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు.

**జిల్లా అధికారులతో సమావేశం**

ప్రజావాణి అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేయని లబ్దిదారుల స్థానంలో అర్హులైన ధరఖాస్తుదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని సూచించారు. ఎంపిడివోలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దశలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. 15 సంవత్సరాలు నిండిన బాలికలు, 50 సంవత్సరాలు పైబడిన మహిళలు, దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని డిఆర్‌డివో, మెప్మా పిడిలను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో చదివే బాలికలను ఈ సంఘాల్లో చేర్పించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు రానున్న వారం రోజుల్లో అన్ని ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి నివేదిక సమర్పించలని ఆదేశించారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లిని పరామర్శించిన సిపిఐ నేతలు చాడ, పంజాల



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే సత్యనారాయణ రెండో సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం కరీంనగర్‌లోని వాల్మీకినగర్‌లో గల కవ్వంపల్లి సత్యనారాయణ నివాసానికి వెళ్లి రాజేశం చిత్రపటానికి సిపిఐ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజేశం మృతికి గల కారణాలను వెంకటరెడ్డి ఎమ్మెల్యే కవ్వంపల్లిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతున్నట్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు సమ్మయ్య, బోయిని తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు, బూడిద సదాశివ ఉన్నారు.

## కమ్యూనిస్టు దిగ్గజమా నీకు లాల్ సలాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజా పక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్గొండా మాజీ పార్లమెంట్ సభ్యులు మరణించడం పార్టీ దేశానికే తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సోమవారం రోజు న జిల్లా పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్ రెడ్డి కి దివాళి అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం లో వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని, వామపక్ష పార్టీ లను ఒక తాటిపై తెచ్చిన గొప్ప నాయకులు తాను ప్రజలకు ఎన్నో పోరాటల ద్వారా వారి హక్కులకై పోరాడిన ఉద్యమ నేత అని అన్నారు. రానున్న రోజుల్లో సురవరం సుధాకర్ రెడ్డి ఆలోచన విధానాన్ని కొనసాగిస్తూ ప్రజా పోరాటాలు చేస్తామని తాండ్ర సదానందం అన్నారు.ఈ కార్యక్రమం లో ఆరెపల్లి మానస్ కుమార్, చంద్రగిరి ఉదయ్ ,బండారి, కల్లేపల్లి నవీన్, కల్లేపల్లి రవి,బండారి సదానందం ,మాచర్ల అంజి. ఆరెపల్లి మనీష్,తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు పరిశ్రమల స్థాపన ముఖ్యం: కలెక్టర్



**ప్రజాపక్షం/సిద్దిపేట:** జిల్లాలో యువత, ఉద్యోగ ఉపాధి అందించటం కోసం పరిశ్రమల స్థాపన ముఖ్యమైందని..టిజీ ఐపాస్‌లో వివిధ పరిశ్రమలలు నెలకొల్పటానికి ధరఖాస్తు పెట్టుకున్న అన్ని అయా డిపార్టుమెంట్ వారిగా వెరిఫై చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు దరఖాస్తు చేసుకున్న అన్ని డిపార్టుమెంట్ వారిగా వెరిఫై చేయాలని, ఒక వేళ యూనిట్ నెలకొల్పేందుకు సుముఖంగా లేనియెడల డిలిట్ చేయాలని సూచించారు. సోమవారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్ డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ హైమావతి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పరిశ్రమల్లో కార్మికులకు ఇన్స్‌రెన్స్ చేయించాలని అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేశ్‌రామ్, ఎల్డిఎం హరిబాబు పాల్గొన్నారు.

**30లోగా వనమహోత్సవంలో మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలి**

ఈనెల 30లోగా వివిధ శాఖలకు ఇచ్చిన లక్ష్యం మేరకు వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమానికి సంబధిత శాఖలతో సమన్వయం చేసుకొని త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఆటవి శాఖ అధికారిని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో పాల్గొని పల్లెలకు పారిశుధ్య కార్యక్రమాలకు పక్కగా నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటలకే క్షేత్ర స్థాయిలో ఉండాలన్నారు. పంచాయతి సిబ్బందితో పాటు గ్రామీణాభివృద్ధి ,వైద్య ఆరోగ్య, అంగన్‌వాడి తదితర అన్ని శాఖల సిబ్బంది తప్పకుండ డ్రైడే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్,డిఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి: ఎసిపి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపారు.యాంటీ డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా సిద్దిపేట సీపీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ బి.సౌజన్య ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ హాజరై పాల్గొన్నారు.ముందుగ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను యువకులతో చేయించారు.అనంతరం ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుడదని అన్నారు.మండలంలోని వివిధ గ్రామాల్లోని యువత పెడదారిన పడకుండా డ్రగ్స్‌కు దూరంగా ఉండే విధంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోలీస్ శాఖ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు.అలాగే ఎవరైనా డ్రగ్స్ భారిన పడిన భాధితులకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు.ఎక్కడైనా డ్రగ్స్ తీసుకున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా టోల్ ఫ్రీ నెం.1908కు లేదా సంబంధిత సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెం.8712671111 ద్వారా తెలాయజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ కానిస్టేబుల్ శ్రీనివాస్,సిబ్బంది సుధాకర్,కనుకయ్య,శ్రీనివాస్,ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు



**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాకలో యూరియా కోసం రైతులు బారులు తీరారు.కొండపాక పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా సరఫరా చేయడం కోసం లారీ యూరియా వచ్చిందని తెలియడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు కొండపాకకు చేరుకున్నారు.గత వారం పది రోజుల నుంచి యూరియా దొరకకపోవడంతో ఎదురు చూసిన రైతులు యూరియా కోసం బారులు తీరారు.500 బస్తాల యూరియా అందుబాటులో ఉంటే వెయ్యి మందికి పైగా రైతులు చేరుకున్నారు.రైతులంతా బారులు తీరి యూరియా కోసం నిల్చున్నారు.వ్యవసాయ శాఖ అధికారులు టోకెన్లు తయారు చేసి రైతులకు అందించారు.యూరియా అందరికి అందకపోవడంతో పలువురు రైతులు ఆగ్రహానికి గురయ్యారు.అధికారులను నిలదీశారు.అక్కడే ఉన్న వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ మరో నలుగురు వ్యవసాయ విస్తరణ అధికారులను కార్యాలయంలో కొద్దిసేపు నిర్భంధించారు. తమకు సరిపడా యూరియా అందిస్తేనే బయటకు పంపిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులతో మాట్లాడి త్వరలోనే యూరియా అందిస్తామని చెప్పడంతో వారిని వదిలేశారు. యూరియా అందివ్వడంతో విఫలమయ్యారని మండిపడ్డారు.ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న తమకు యూరియా వచ్చిందని ఆశతో వస్తే ఒక బస్తా కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజావాణి ఆర్జీలకు సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ ఆర్డీవోలతో కలిసిన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలపరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతా లనుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలు ఓర్చి వస్తారని, అధికారులు ఫెండింగ్‌లో ఉంచకుండా ఎప్పకప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, ఆర్డీవోలు మధుసూధన్, శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, వివిధ జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పర్యావరణ పరిరక్షణ కోసం మనమంతా మట్టి గణపతులను పూజించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజలను కోరారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మట్టి వినాయక విగ్రహా పోస్టర్ ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆవిష్కరించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరి పై ఉందని, మట్టి వినాయకులను పూజించాలని చేసే అవగాహన కార్యక్రమంలో భాగంగా బస్ స్టాప్, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో వాల్ పోస్టర్లను ప్రదర్శన చేయాలని అన్నారు.కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తూ పర్యావరణం పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగులు ఉపయోగించి తయారు చేసిన గణపతి విగ్రహాల వలన పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, ఎక్కువ కాలం కరగకుండా నీటిలో ఉండడం వలన నీటిలో ఉన్న స్వచ్ఛత పోతుందని, నీటిలో జీవించే ప్రాణులకు హాని కలుగుతుందని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని, మట్టి గణపతిని పూజించాలని ఆయన సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడవచ్చునని ఆయన వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రజలకు వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రంగా రెడ్డి, ఈఈ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు బిక్షపతి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ బండి ప్రకాష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 20 సంవత్సరాలుగా ఆశ వర్కర్లను అనేక పథకాలలో భాగస్వాములను చేసి పారితోషికాలు సమయానికి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. తక్షణమే ఆశ వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో సెప్టెంబర్ 1న రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్ జిల్లాలో ఆరోగ్య మహిళా, శుక్రవారం సభలు నిర్వహించి ఆశ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. మంగళవారం ఆశ వర్కర్లు పొద్దున్నే డ్రై డే నిర్వహించాలని, ఏఎన్‌సి, పిఎంసి ఫాలోఆప్ చేసి ఆరోగ్య మహిళా, శుక్రవారం సభలు నిర్వహించాలని కలెక్టర్ కార్యాలయం నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలు అన్ని డిపార్ట్‌మెంట్ కలిసి చేయాలని, కేవలం ఆశా వర్కర్ల మీద నెట్టడం సరికాదని కలెక్టర్‌కు విన్నవించారు. డిఎంహెచ్‌వోను పిలిచి ఈ అంశాలపై సమీక్షించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ పాలసీ అమలు చేస్తామని హామీనిచ్చి ఓట్లు దండుకుందని, గద్దెనెక్కిన తర్వాత ప్రతినెల ఇచ్చే పారితోషికాలు ఒకటవ తేదీన ఇవ్వడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యం, జిల్లా నాయకులు ఇ.తిరుమలయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు పద్మ, సుజాత, లావణ్య, సారిక,సుమలత, లక్ష్మి , శంకరమ్మ, సుజాత, రేణుక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## ఖని ప్రభుత్వాసుపత్రిలో అక్రమ కట్టడాన్ని తొలగించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల మూడు గుంటల నర్సరీ స్థలంలో అక్రమంగా జరుగుతున్న భవన నిర్మాణ పనులను అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య, జిల్లా కోశాధికారి తాళ్లపల్లి సురేందర్, నగర కార్యదర్శి ఆసాల నవీన్లు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో గల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సరీ స్థలమైన మూడు గుంటల స్థలాన్ని రామగుండం కార్పొరేషన్ మాజీ ప్రజా ప్రతినిధి అక్రమంగా ఆక్రమించి భవనాన్ని మూడు రోజులుగా నిర్మాణం చేస్తున్నప్పటికీ ఇటు టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ అటు ఆసుపత్రి సూపరిండెంట్ మరియు అధికారులు కానీ స్పందించకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈరోజు ఒక ప్రధాన పత్రికలో ఈ వార్త వచ్చే వరకు దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. రామగుండం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా అవినీతిమయంగా మారిందని ఉన్నవారికి ఒక చట్టం లేని వారికి ఇంకొక చట్టం అనే పద్ధతిలో అధికారులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని దుయ్యబట్టారు.ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ వాల్ను కుల గోట్టి అక్రమంగా నిర్మించిన భవనాన్ని జిల్లా కలెక్టర్ గారు కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్ గారు సందర్శించి సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణాన్ని డిస్మాటిల్ చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి కాంపౌండ్ వాళ్లను కూలదోచిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూర్య డిమాండ్ చేశారు. మీ అక్రమ భవనంపై చర్యలు తీసుకోకపోతే ఏఐవైఎఫ్ గా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు.

## మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మేనల్లుడు మణివర్మ చిన్నకోడూరు మండల కేంద్రంలో సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా మాజీ మంత్రి హరీష్‌రావు పార్థివదేహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. మణివర్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ మణివర్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎదిగే వయస్సులో కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులను, శోక సంద్రంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చారు. ఆదైర్యపడవద్దని మనోధైర్యాన్ని ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎంపిపి మాణిక్యరెడ్డి, రాధకిషన్‌శర్మ, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సుభాష్ నగర్ ఏఐటియుసి కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మ్యారేజ్ లు, డెలివరీలు, ఆన్లైన్ కావడం లేవని ఆన్లైన్ విధానం రద్దు చేసి, ఆఫ్లైన్లో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలనీ, జిల్లాలో ఏసిఎల్, డిసిఎల్ లను నియమించాలన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షలు, సహజ మరణానికి ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పెళ్లిళ్లు చేస్తే లక్ష రూపాయలు, డెలివరీ ఖర్చులు 50వేలు ఇవ్వాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వ అధీనంలో వున్న లేబర్ కార్డు వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, ప్రయివేట్ పరం చేయొద్దన్నారు, ఇంటి నిర్మాణం పై వసూలు చేసే సెస్ డబ్బులు కార్మికులకు మాత్రమే ఉపయోగపడాలన్నారు. సంక్షేమ బోర్డులో వున్న డబ్బులు కార్మికులకు మాత్రమే ఖర్చు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పండుగ పోచమల్లు, ఆకుల ఆంజనేయులు, మారోజి మారుతి, దయ్యల అంజయ్య, పండుగ చంద్రయ్య, లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

### మానేరు తీరంలో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే పలు శాఖల అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు. వినాయక మంటపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు చేయించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డి.ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, నీటి పారుదల శాఖ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## దులీప్ ట్రోఫీ షెడ్యూలు విడుదల



దులీప్ ట్రోఫీ 2025 ఆగస్టు 28 నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. తొలి మ్యాచ్‌లో నార్త్ జోన్, ఈస్ట్ జోన్ తలపడనున్నాయి. ఈ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌తో ప్రారంభమవుతుంది. నార్త్ జోన్ వర్సెస్ ఈస్ట్ జోన్; సెంట్రల్ జోన్ నార్త్‌ఈస్ట్ జోన్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనున్నాయి. సౌత్ జోన్, వెస్ట్ జోన్ వంటి జట్లు ఇప్పటికే ఈ టోర్నమెంట్ సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఫైనల్ మ్యాచ్ బెంగళూరు వేదికగా సెప్టెంబర్ 11 నుంచి 15 వరకు జరగనుంది.

### క్వార్టర్ ఫైనల్స్

ఆగస్టు 28–31: నార్త్ జోన్ vs ఈస్ట్ జోన్
ఆగస్టు 28–31: సెంట్రల్ జోన్ vs నార్త్ ఈస్ట్ జోన్

### సెమీ ఫైనల్స్

సెప్టెంబర్ 4–7: సౌత్ జోన్ vs క్వార్టర్ ఫైనల్ 1 విజేత
సెప్టెంబర్ 4–7: వెస్ట్ జోన్ vs క్వార్టర్ ఫైనల్ 2 విజేత

### ఫైనల్ మ్యాచ్

సెప్టెంబర్ 1115: సెమీఫైనల్ 1 విజేత vs సెమీ ఫైనల్స్ 2 విజేత

టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్.. దులీప్ ట్రోఫీకి దూరమైనట్లు తెలుస్తోంది. అతడు వైరల్ ఫీవర్ బారిన పడినట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే రక్త నమూనాలను బ్లడ్ టెస్టుకు పంపినట్లు సమాచారం. ఆ రిపోర్ట్ బీసీసీఐ వద్దకు చేరిందని.. దీంతో దులీప్ ట్రోఫీ నుంచి అతడికి మినహాయింపు దక్కిందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. నార్త్ జోన్ జట్టు సారథిగా తొలుత గిల్‌ను ఎంపిక చేశారు. అయితే ప్రస్తుతం అతడికి బదులు వైస్ కెప్టెన్‌గా ఉన్న అంకిత్ కుమార్ జట్టును నడిపించే అవకాశాలు ఉన్నాయి. దులీప్ ట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌కు ఈస్ట్‌జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్, పేసర్ ఆకాశ్ దీప్ దూరమయ్యారు. గాయాల నుంచి వీళ్లిద్దరూ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండట్లేదు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే క్వార్టర్స్‌లో నార్త్‌జోన్‌తో ఈస్ట్‌జోన్ తలపడనుంది. ఇంగ్లాండ్ పర్యటనలో వెన్ను నొప్పితో ఇబ్బంది పడిన ఆకాశ్.. వైద్యుల సలహా మేరకు దులీప్ ట్రోఫీ క్వార్టర్స్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఈ మేరకు అతడు జోనల్ సెలెక్షన్ కమిటీకి తెలియజేశాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)లో అతడు కోలుకుంటున్నాడు. బైక్ మీద నుంచి పడిపోయిన ఇషాన్ చేతికి వైద్యులు కుట్లు వేశారు. అతను కూడా సీఓఈలోనే ఉన్నాడు. ఆకాశ్ స్థానంలో ముఖ్తార్ హుస్సేన్ (బీహార్), ఇషాన్‌కు బదులుగా ఆశీర్వాద్ స్వైన్ (ఒడిశా)ను ఈస్ట్‌జోన్ ఎంపిక చేశారు. ఇషాన్ గైర్హాజరీలో అభిమన్యు ఈశ్వరన్ సారథ్యం వహించనున్నాడు. రియాన్ పరాగ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

## డ్రీమ్ 11తో కటీఫ్

### అధికారికంగా ప్రకటించిన బిసిసిఐ

టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్11 తప్పుకుంది. బిసిసిఐతో జరిగిన రూ.358కోట్ల ఒప్పందం నుంచి గడువుకు ముందు అర్ధాంతరంగా డ్రీమ్11 రద్దు చేసుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఒప్పందం నుంచి వైదొలగాలని ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ నిర్ణయించుకుంది. బిసిసిఐతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న విషయాన్ని బిసిసిఐ ధ్రువీకరించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ 2025 ఆమోదం నేపథ్యంలో ఒప్పందం ముగిసిందన్నారు. భవిష్యత్‌లో ఆ సంస్థతో బిసిసిఐకి ఒప్పందం ఉండదన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల డ్రీమ్ 11 ప్రతినిధులు బిసిసిఐ కార్యాలయానికి చేరుకొని టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా ఇకపై కొనసాగలేమని సీఈవో హేమంగ్ అమీన్ అధికారికంగా బిసిసిఐకి వెల్లడించారు. ఒప్పందం రద్దయిన నేపథ్యంలో రాబోయే ఆసియా కప్‌లో భారత జట్టు డ్రీమ్ 11 లోగో లేకుండానే మైదానంలోకి దిగబోతున్నది. బిసిసిఐ త్వరలోనే కొత్త స్పాన్సర్ కోసం టెండర్ జారీ చేసే అవకాశం ఉంది. బైజు స్థానంలో 2023లో బిసిసిఐ స్పాన్సర్ హక్కులను డ్రీమ్ 11 సొంతం చేసుకుంది. ఈ స్పాన్సర్ ఒప్పందం విలువను రూ..358 కోట్లుగా నిర్ణయించారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ నిర్ణయం భారతదేశంలో క్రికెట్ నియంత్రణ మండలిపై మాత్రమే కాకుండా క్రీడా ప్రపంచంపై ప్రభావం కనిపించనున్నది. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు స్పాన్సర్‌గా ఉంది. డ్రీమ్ 11కు పలువురు క్రికెటర్లు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారు. ఇందులో మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా వంటి అగ్ర క్రికెటర్లు ఈ జాబితాలో ఉన్నారు. 2020లో భారత్‌చైనా మధ్య ఉద్రిక్తతల సమయంలో వీవో ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను వదులుకున్న సమయంలో డ్రీమ్11 కొంతకాలం టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. తాజాగా డ్రీమ్11 అకస్మాత్తుగా స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకోవడం బిసిసిఐకి ఇబ్బందికరంగా మారింది. కొత్త స్పాన్సర్‌ను వెతికిపట్టుకోవడం సవాల్‌గా మారింది. అయితే, దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లు, ఆటగాళ్లపై కనిపించనున్నది.

ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్ రెండోవారం చివరలో మొదలుకానున్నది. దాంతో బిసిసిఐకి స్పాన్సర్స్‌ను తక్కువ సమయంలో వెతకాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆటగాళ్ల జెర్సీలపై లోగో కనిపించదు. ఇది బ్రాండ్ విలువ, ఆదాయం రెండింటిని ప్రభావితం చేయనున్నది. 2020లో వివో వైదొలిగిన తర్వాత డ్రీమ్11 ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌గా వ్యవహరించిన సమయంలో ఇదే పరిస్థితి నెలకొంది. డ్రీమ్ 11 ఈ కంపెనీ అనేక ఐపీఎల్ ఫ్రాంచైజీలకు, అనేక మంది స్టార్ ఆటగాళ్లకు స్పాన్సర్‌గా ఉంది. కరేబియన్ ప్రీమియర్ లీగ్ భాగస్వామి. అదే సమయంలో న్యూజిలాండ్ దేశీయ లీగ్ 'సూపర్ స్మాష్' టైటిల్ స్పాన్సర్ కూడా. ఈ చిన్న టోర్నమెంట్‌లకు ఐపీఎల్ తరహాలో బలమైన ఆర్థిక మద్దతు లేదు. ఈ క్రమంలో డ్రీమ్11 ఒప్పందాలను రద్దు చేసుకున్న నేపథ్యంలో ఆయా జట్లు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకునే అవకాశాలున్నాయి.

# ఫోకస్ యువతరంగం

## ఎఐతో ఉద్యోగాలకు ఎసరు ?



కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ ఎఐ)తో ఉద్యోగాలకు ఎసరు వస్తోంది. దేశంలో 2030 నాటికి 1.80 కోట్ల ఉద్యోగాలు గల్లంతవుతాయని 'సర్వీస్ నౌ' తాజా నివేదిక అంచనా వేసింది. తయారీ, రిటైల్, విద్య రంగాల్లో భారీ మార్పులు రాబోతున్నాయని, ఏకంగా కోట్ల ఉద్యోగాలు గల్లంతవుతాయని పేర్కొంది. నివేదికను అనుసరించి, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి యుగంలో, భారత దేశంలోని ఉద్యోగ రంగాలను ఎఐ గణనీయంగా మార్చనుంది. ఎఐ ప్రధానంగా తయారీ రంగంపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ రంగంలో సుమారుగా 80 లక్షల మంది ఉద్యోగులు అనేక ఒడిదుడుకులకు లోనవుతారు. అలాగే రిటైల్ రంగంలో 76 లక్షల ఉద్యోగాలు డేంజర్ జోన్‌లో ఉంటాయి. ఇక విద్యా రంగంలో 25 లక్షల ఉద్యోగాలు ఎఐ వలన ప్రమాదం అంచులోకి చేరుతాయి. ఎఐ వృద్ధి అమిత వేగంగా పయనిస్తుండటంతో, అన్ని రంగాల్లోనూ సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అత్యధిక ఆటోమేషన్‌కు లోనయ్యే ఉద్యోగాలైన నిర్వాహకులు, పేరోల్ క్లర్క్స్ తదితరాలు ప్రమాదంలో పడనున్నాయి. అదే సమయంలో కన్సల్టెంట్లు, సిస్టమ్ అడ్మిన్‌లు వంటి హైగ్రోత్ ఉద్యోగాలు ఎఐతో కలిసి పనిచేసే కొత్త విధానాలకు రూపకల్పన జరిగే అవకాశం ఉంది. తాజాగా చూసుకున్నట్లయితే దేశంలో టాప్ ఐటి దిగ్గజం టిసిఎస్ 12 వేల ఉద్యోగాలను ఎఐ రాకతో తీసేస్తున్నట్లు ప్రకటించింది. ఇది మొత్తం శ్రామికశక్తిలో సుమారు 2 శాతానికి సమానం. ఈ నేపథ్యంలో, కృత్రిమ మేధ భవిష్యత్తులో మరెన్ని ఉద్యోగాలను ప్రభావితం చేస్తుందనే ఆందోళనలు పెరిగిపోతున్నాయి. అయితే, భారత్‌కు ఇప్పట్లో ఎఐ వల్ల ముంచుకొచ్చే భారీ ప్రమాదం ఏమీ ఉండదన్న వాదన కూడా వినిపిస్తుంది. ఎఐ రాకవల్ల ఉద్యోగులు చేసే పని లేదా సంస్థలో వారి పాత్రలు మారిపోతాయే తప్ప, పూర్తిగా నిరుద్యోగులుగా మారే అవకాశం లేదని వారి అభిప్రాయం. సంక్షోభంలో కూడా కొత్త అవకాశాలు తలుపుతడతాయని ఆశావహులు అంటున్నారు. మరో నాలుగేళ్లలో 1.35 కోట్ల మంది ఉద్యోగుల పనితీరు మారుతుందని, అదే సమయంలో 30 లక్షల కొత్త టెక్ ఉద్యోగాలు పుట్టుకొస్తాయని అంచనా వేస్తున్నారు. ఇలావుంటే, టెక్ కంపెనీలు బడ్జెట్‌లో 13.5 శాతం మొత్తాన్ని ఎఐ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నది. ఈ రంగంలోని నాలుగో వంతు సంస్థలు ఇప్పటికే డిజిటల్ మార్పు దశలో ఉన్నాయి. 41.67 శాతం ఈ మార్పులకు డేటా భద్రత ఒక్కటే ప్రధాన అడ్డంకిగాఉన్నట్లు సర్వేలో వెల్లడయింది. ఇక డేటా సెక్యూరిటీ విషయంలో 30 శాతం సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. 26 శాతం సంస్థలు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలపై స్పష్టత లేదన్నాయి. ఈ సర్వే దేశానికి వ్యూహాత్మక దూరదృష్టితో కూడిన స్కిల్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవసరం ఉందని చెబుతోంది. మొత్తానికి ఎఐ ఓవైపు ఉద్యోగాలకు ఎసరు పెడుతూ మరోవైపు కొత్త ఉద్యోగాలకు తలుపులు తెరుస్తోంది.

### గణాంకాల్లో నిరుద్యోగం

భారతదేశ యువ నిరుద్యోగ రేటు గత దశాబ్దంలో గణనీయంగా మార్పులు చూపింది. మిగిలిన దేశాల్లా, భారతదేశం కూడా యువతలో నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోంది,

ప్రస్తుత నిరుద్యోగ శ్రేణులు యువ నిరుద్యోగ రేటు (వయస్సు 15–29): 2023–24లో సుమారు 10.2 శాతంగా ఉంది, ఇది ప్రపంచ సగటు 13.3 శాతం కంటే తక్కువ.

15–24 ఏళ్ల యువతలో నిరుద్యోగ రేటు 2024లో 16.03 శాతం గా నమోదైంది, ఇది 2023లో 15.7 శాతం.

మొత్తం నిరుద్యోగ రేటు 2025 మధ్య కాలంలో 5.1 శాతం–5.6 శాతం మధ్యలో ఉంది, కానీ యువద లో ఇది ఎక్కువగా ఉంది.

గత దశాబ్దపు ధోరణులు యావత్తుకు యువ నిరుద్యోగ రేటు గత 10 సంవత్సరాలలో సగటున 22 శాతం వద్ద ఉంది.

కొవిడ్19 సమయంలో అత్యధికంగా 20 శాతం దాకా చేరింది.

ఆర్థిక వ్యవస్థ తిరిగి తెరుచుకున్న తరువాత నిరుద్యోగ రేటు కొంత తగ్గింది, కానీ నగరాల్లో మాత్రం అత్యధికంగా ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో (8.5 శాతం) నిరుద్యోగం తక్కువగా ఉంది; నగరాల్లో (14.7 శాతం) అధికంగా ఉంది.

మహిళల్లో నిరుద్యోగం మరింత ఎక్కువగా ఉంటుంది.

కేరళ, లక్షద్వీప్ వంటి ప్రదేశాల్లో 30 శాతం కి పైగా నిరుద్యోగ రేటు ఉంది, ముఖ్యంగా మహిళల్లో నిరుద్యోగ రేటు ఎక్కువ.

మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎంతో తక్కువగా (3.2 శాతం) ఉంది.

పట్టభద్రుల నిరుద్యోగం అత్యధికంగా ఉంది; 20–24 ఏళ్లలో సగం మంది ఉపాధి లేకుండా ఉన్నారు.

### వీడియో గేమ్ డెవలపర్ సిమర్



కెనడాలోని అంటారియోలో నివసిస్తున్న సిమర్ ఖురానా వీడియో గేమ్ డెవలపర్. ఆమె కేవలం 6 ఏళ్లు 335 రోజుల వయసులోదె తన మొదటి వీడియో గేమ్ 'హెల్తీ ఫుడ్ చాలెంజ్' అనే గేమ్‌ను తయారుచేసి, 'ప్రపంచంలోనే అత్యంత చిన్న వయస్కుడైన వీడియో గేమ్ డెవలపర్'గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ఆ గేమ్ పిల్లలకు ఆరోగ్యకరమైన, అనారోగ్యకరమైన ఆహారాల మధ్య తేడా తెలపడానికి, ఆరోగ్యకరమైన ఆహారం ఎందుకు ముఖ్యమైందో వివరించడానికి ఉపయోగపడుతుంది. సిమర్ ఒకసారి అనారోగ్యానికి గురైనప్పుడు, జంక్ ఫుడ్ తినకూడదని డాక్టర్ చెప్పిన తర్వాత ఆమెకు ఈ గేమ్ ఐడియా వచ్చింది. తన తండ్రి పరాస్ ఖురానా నుంచి కోడింగ్‌పై మూడు సార్లు తరగతులు తీసుకొని, అతి చిన్న వయసులోనే కోడింగ్ నేర్చుకుంది. ఆమెకు గణితంలోనూ మంచి పట్టు ఉంది. స్వయంగా యూట్యూబ్ ట్రైల్స్ ద్వారా గణితం నేర్చుకొని, అందులో ప్రావీణ్యతను సంతపాదించింది. ప్రస్తుతం ఆమె తన వీడియో గేమ్ అభివృద్ధిని మరింత అభివృద్ధి పరచాలన్న పట్టుదలతో వివిధ రకాల ప్రయోగాలు చేస్తున్నది. ఆరోగ్యకరమైన ఆహారం వంటి అంశాలను తన వీడియో గేమ్స్‌లో చేర్చాలని అనుకుంటున్నది. ఫిట్నెస్‌పైన కూడా ఆమె దృష్టి పెడుతున్నది. ప్రజలకు, ప్రత్యేకించి పిల్లలకు అత్యవసరమైన వివిధ అంశాలతో కూడిన వీడియో గేమ్స్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నది.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశావర్కర్లను గుర్తించాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పేందర్ మాట్లాడుతూ ఆశావర్కర్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ బడుగు బలహీనవర్గాలకు ముఖ్యంగా గర్భిణీలకు వైద్యం అందించి ప్రాణాలను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా ఆశాల సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండు సంవత్సరాలు గడిచినా వాగ్దానాలు నెరవేరలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, హెల్త్ కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్, ఎఐటిc/సి జిల్లా ఉపాధ్యాక్షుడు, ఆత్మకూరి చిరంజీవి, బోయిరే ప్రకాష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి

### సింగరేణి కార్మిక సంఘం (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

### సింగరేణి ఏరియా హాస్పిటల్ సిబ్బంది ఎఐటియుసిలో చేరిక



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో అన్నిరంగాల కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని సింగరేణి కార్మిక సంఘం(ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న పలువురు సిబ్బంది ఎఐటియుసిలో చేరారు. గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి ఏరియా హాస్పిటల్ లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసికెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సింగరేణి హాస్పిటల్‌లో పని చేస్తున్న కార్మికులు, పారా మెడికల్ సిబ్బందికి పదోన్నతులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై గుర్తింపు సంఘం ఎఐటియుసి యాజమాన్యంతో ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో హాస్పిటల్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. యాజమాన్యం వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సింగరేణి హాస్పిటల్‌లో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది ఐక్యంగా ఉంటే ఏ సమస్య అయిన పరిష్కారంలో ఏఐటియుసి ముందుండి పోరాడుతుందని ఆయన అన్నారు. ఎఐటియుసిలో చేరిన మెడికల్ సిబ్బంది సీనియర్ స్టాఫ్ నర్స్ విజయలక్ష్మి, శ్రీకాంత్, గోపి క్రిష్ణ, రమేశ్, శశికాంత్, కిరణ్, సరిత, స్వరూప రాణిలకు వాసిరెడ్డి సీతారామయ్య కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఏరియా హాస్పిటల్ ఎఐటియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, నాయకులు దాసరి అనిల్, భాస్కర్, సత్యనారాయణ , విద్యాసాగర్, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, ఉప్పులేటి తిరుపతి, ఎవిఎస్. ప్రకాశ్, కె.జగదీశ్, చెప్యాల మహేందర్ రావు, ఎర్రగొల్ల చేరాలు, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి నలినిరెడ్డి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** పెండింగ్‌లో ఉన్న రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నలిని రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నలినిరెడ్డి మాట్లాడుతూ రిమ్స్ కాంట్రాక్టర్లు మారినా కార్మికుల సమస్యలు తీరడంలేదని ఆరోపించారు. 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, దాయ కార్మికుల వేతనాలు పెంచి, ఐఎస్ఐ కార్డులు అందజేయాలని, వయస్సు పైబడిన కార్మికులకు రిటైర్మెంట్ బినిఫిట్ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిలా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్, రిమ్స్ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎ.అనసూయ కార్యదర్శి షాహిన, రిమ్స్ కార్మికులు ఉమా, రాధ, పోసాని, కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని కళాశాల ఎదుట సోమవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలోనే ఉస్మానియా యూనివర్సిటీని తలపించే విధంగా డిగ్రీ కళాశాల ఉందని, అలాంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంను మెడికల్ కళాశాలకు కేటాయించి, డిగ్రీ కళాశాలకు మైదానం లేకుండా గత ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంతోమంది విద్యార్థులు పోలీస్, ఆర్మీ ఉద్యోగాలకు సాధించారని, గ్రౌండ్ లేకపోవడం వల్ల ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంటనే ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్‌కు పెట్టింది పేరన్నారు. రామగుండం ఎమ్మెల్యే ప్రభుత్వ డిగ్రీ కళాశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత విద్యాధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను చదును చేసి విద్యార్థులకు వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు గోడిసెల ప్రణీత్, జస్వంత్ ,అభిషేక్, సజన్, సాయి చరణ్, రేహాన్, రామ్ చరణ్, రతిక్ ,భరత్, ఆర్య, అజయ్, అవినాష్, నిరీక్షిత, చైత్ర, సింధుజ, వైశాలి, చైతన్య, సిరివెన్నెల, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రం నుంచి పల్లెలకు రవాణా సౌకర్యం కల్పించాలి



### సిపిఐ ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి సాయికుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రం నుండి పల్లెలకు రోడ్ కనెక్టివిటీ పెంచి రవాణా సౌకర్యం కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. రోడ్ కనెక్టివిటీ పెంచి రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి భద్రి సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లు, భవనాలకు సంబంధించిన శాఖల అధికారుల నిర్లక్ష్యంతో జిల్లా కేంద్రం నుండి పల్లెటూరుకు రోడ్ కనెక్టివిటి ఏర్పాటు చేయడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం రవాణా సౌకర్యం లేకపోవడంతో వాంకిడి మండలానికి చెందిన ఒక మహిళను సకాలంలో ఆసుపత్రికి తరలించలేక పరిస్థితుల్లో ఒక పాపకు జన్మనిచ్చి తల్లి మృతిచెందడం జరిగిందని ఆరోపించారు. ఈ సంఘటనతో జిల్లాలోని ఎన్‌హెచ్‌ఎ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, ఐటిడిఎ ఇంజనీర్ల ఉన్నాధికారుల యొక్క నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు, వంతెన నిర్మాణ పనులను త్వరగా చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరె ప్రకాష్, సిపిఐ మండల కార్యదర్శి నాయికిని వెంకటేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అజయ్, రాజేష్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేనెంబర్ 1041లో వ్యవసాయ భూములు సాగు చేస్తున్న రైతులను ఆదుకోండి

### జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మల్లీశ్వరి

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సూర్యానారాయణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సర్వే నెంబర్ 1041లో భూములు కోల్పోతున్న రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొప్పోజు సూర్యానారాయణ, మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి మాట్లాడుతూ హుజూర్‌నగర్ మద్దుంనగర్ ఎర్రగట్టు గ్రామాల మధ్య ఉన్న 1041 సర్వే నెంబర్‌లో 300 మంది రైతులు సాగు చేస్తూ జీవిస్తున్నారని, వారందరు చిన్న, సన్నకారు రైతులు అర ఎకరం, ఎకరం, రెండు ఎకరాలు తాతల, తండ్రుల కాలం నుంచి నేటి వరకు ఆ భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈభూములను గతంలో ఇందిరగాంధీ హయాంలో ఈ రైతులకు పట్టాలు ఇచ్చారన్నారు. సాగర్ ఆయకట్టు టెయిలెండ్ భూములైనందున బావులు, బోర్లు కరెంట్ మోటార్లు పెట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. తాత ద్వారా తండ్రికి, తండ్రి ద్వారా కొడుకుకి ఈ విధంగా జీవిస్తున్నారన్నారు. ఇప్పుడు నెత్తిమీద పిడుగు పడినట్లు ప్రభుత్వం అగ్రికల్చర్ కళాశాల కట్టడానికి వ్యవసాయ అధికారులు ఈ భూములను చూసి వెళ్లారని, వారం రోజులకు సర్వే కూడా మొదలు పెట్టారన్నారు. ప్రభుత్వం స్పందించి సర్వేను నిలిపివేసి సర్వే నెంబర్ 1041లో భూములను భూములు కోల్పోతున్న రైతులు సాగు యోగ్యం అయ్యే విధంగా చూడాలని వారు కోరారు. ఈ భూములను కోల్పోతే ఆ రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఆడపిల్లలను వదిలేసే పరిస్థితి దాపురించవచ్చని, భూములకు రైతుబంధు, రైతు బీమా వస్తనే ఉన్నాయని, ఈ భూములకు బ్యాంకులలో క్రాప్‌లోన్స్ తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల భూములను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చనగాని సైదులు, ఇందిరాల నారాయణ, కటారి లింగయ్య, ఎర్ర వెంకటరెడ్డి, కంచర్ల అరవిందరెడ్డి, కృష్ణమూర్తి, పశలక్ష్మి, రామనర్సమ్మ, గోసుల నర్సింహరావు, పుల్లెందుల ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియాను అందించండి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** వ్యవసాయ పంటల సాగు సమయంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అవసరమైన యూరియా, ఎరువులను అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు సోమవారం కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం కొణిజర్ల మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ రమేష్, తోటపల్లి సీతారాములు, దేరంగుల లక్ష్మయ్య, సోమయ్య, పెద్దమళ్ల రత్తయ్య, చింతల ఆదినారాయణ, భూక్యా సూర్యం, వెంకయ్య, అడపా బాబు, పుట్టా సత్యనారాయణ, చింతల ఆది రెడ్డి, కొమ్మినేని నర్సింహారావు, సూరంపల్లి రమేష్, ఎర్రా శ్రీను, తుప్పతి రామారావు, తమ్మిశెట్టి ఉపేందర్, చల్లా గోపాలకృష్ణ, రవి పాల్గొన్నారు.

## కల్లూరులో సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని హీరో షోరూం ముందు సోమవారం మధ్యాహ్నం సమయంలో సినీ పక్కిలో సెల్‌ఫోన్ కు గురైంది. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హీరో షోరూం వద్ద గుర్తు తెలియని వాహనంపై ఇద్దరు వ్యక్తులు వచ్చి బండి కింద పడుతున్నట్లు యాక్షన్ చేయగానే వెనుక నుంచి సహాయం చేద్దాం అనే ఉద్దేశం మీద వెంటనే బిఆర్ఎస్ నాయకులు కొరకప్పు ప్రసాద్ సహాయం చేయబోయే లోపు పైజేబులో ఉన్న విలువైన సెల్‌ఫోన్ దొంగిలించుకొని వెంటనే పరారయ్యారు. వెంటనే సంబంధిత బాధితులు షోరూంలో సీసీ కెమెరాలో పరిశీలించగా దానిలో గుర్తుపట్టని విధంగా ఉందని బాధితులు తెలిపారు. ఈ విషయమై కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు కావాల్సి ఉంది. ఈ విషయమై ఈ విధంగా జరిగే వాటిపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రజలకు తెలిపారు. పట్టపగలు ప్రజల మధ్య పక్కా ప్రణాళికతో ఈ విధంగా చేయడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు.

## రైతులకు సరిపడా యూరియా




సిపిఐ తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/వైరా:** పలు పంటలకు సాగు ముమ్మరంగా కొనసాగుతున్న సమయంలో యూరియా కొరత వలన రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. యూరియా కోసం ఆందోళనకు దిగుతున్నారు. తెల్లవారుజాము నుండి రోజంతా క్యూలో నిలబడిన యూరియా ఒక బస్తా కూడా దొరకని పరిస్థితి నేటి పరిపాలనలో చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన కోటాలో సరియైన సరుకు తగినంత ఇవ్వకుండా రాష్ట్రాన్ని అనేక ఇబ్బందులు పెడుతుందని, ప్రభుత్వ అధికారులు యూరియా ఎంత కావాలో ముందుగానే గ్రహించి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం ద్వారా విన్నవించినా కాని సరిపడినంత యూరియా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని, సోమవారం సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో వైరా తహశీల్దార్ ఆఫీస్ తహశీల్దార్‌కి, అగ్రికల్చర్ ఏవోకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సకాలంలో పంటలకు అవసరమయ్యే యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం పట్ల రైతాంగం తీవ్ర ఆగ్రహంతో ఉంది. యూరియా కొరతను యుద్ధప్రాతిపదికన తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వైరా మండల సమితి అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు కొండా రామకృష్ణ, డేవిడ్‌రాజ్, గారపాటి అశోక్, షేక్ యాకూబ్ అలి, ఓర్సు నర్సింహారావు, రేమల్లి నారాయణ, మూట కొండ, రాంబాబు, మిట్టపల్లి రాఘవరావు, సిహెచ్.గోపాలరావు, మోరు శ్రీనివాసరావు, రాయి రవి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి దరఖాస్తూ పరిశీలించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యయ ప్రయాలకు ఓర్చి జిల్లా నలు మూలల నుండి ప్రజలు తన విన్నపాలు చేసుకునేందుకు తరలివచ్చారని, వారు అధికారులపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ముచేయరాదన్నారు. ఆయాశాఖల అధికారులు వారి పరిధిలోనికి వచ్చే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సవివరంగా నివేదికలు సమర్పించాలన్నారు. అందిన ప్రతీ దరఖాస్తులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

**గిరిజన దర్బార్‌లో :** ఐటిడిఏలో గిరిజన దర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఓ రాహుల్ పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన గిరినుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించి ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించాలని, అమాయకులైన ఆదివాసీలకు తగు న్యాయం చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఆయాయూనిట్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లా నీరు కలుషితం

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్రంలోని ఒకటో వార్డులో పది రోజుల నుంచి కలుషిత నీరు రావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం అని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇదే విధంగా కొనసాగితే దమ్మపేట మండల కేంద్రంలోని ఒకటో వార్డులోని ప్రజలు కుళాయి నుండి నీటిని తీసుకొచ్చి ప్రజా ప్రతినిధులు ఎదురుగా ఆందోళనకి దిగుతామని, అప్పుడైనా తమ బాధలు అధికారులకు తెలుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. గత 15 రోజులుగా తాగునీటి ట్యాంక్ నుంచి మంచినీరు సరఫరా అయ్యే ప్రధాన పైప్‌కి సుమారు ఒక రోడ్‌లోనే నాలుగు నుంచి ఐదు చోట్ల లీకేజీ ఏర్పడటంతో ఈ సమస్య తలెత్తుతుంది అని ఎన్నో రోజులుగా సంబంధిత అధికారులకు తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని దీనివలన వచ్చే కుళాయి నీటిలో పక్షుల ఈకలు, పురుగులు, నాచు, మట్టి నీరు, మానవ విసర్జిత అవశేషాలు సరఫరా అవుతున్నాయని, ఈ నీరు త్రాగడం వలన అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోవడంలేదని దీనిపై తక్షణం ఉన్నత అధికారులు స్పందించి లీకేజీ అరికట్టి కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు... కొండపల్లి చంటి (స్థానికుడు)**
ఎన్నిసార్లు అధికారులకి చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పైగా పంచాయతీలో నిధులు లేవని అంటున్నారని, మా వీధిలో ఉండేవారు అంతా కూడా వృద్ధులు పైగా కొంతమంది వికలాంగులు కూడా ఉన్నారని వారి పరిస్థితి మరి దీనంగా ఉంది అని, తక్షణం సంబంధిత అధికారులు పంచాయతీ కుళాయిలో సరఫరా అయ్యే త్రాగునీరు స్వచ్ఛంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# చెరువు చెరకు విముక్తి

ప్రజాపక్షం కథనాలతో సర్వే... హద్దులు, బఫర్‌జోన్ గుర్తింపు..

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం ఈదుల చెరువు చెర వీడబోతోంది. మట్టిదందా సాక్షిగా కబ్జాకు గురైన చెరువుపై అక్షరపోరాటం చేసిన ప్రజాపక్షం కథనాలు అక్షరసత్యాలయ్యాయి. మరోపక్క సిపిఐ సైతం ఊరు చెరువును కాపాడటంలో చేసిన కృషి ఫలించింది. అలాగే జిల్లా కలెక్టర్‌గా భాధ్యతల స్వీకరించిన అనుదీప్ దురిశెట్టి తొలి పర్యటనలోనే ఏదులాపురంలో భూభారతి కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా చెరువుపై ఆయన ప్రత్యేక దృష్టిని కనబరచి, నిశితంగా పరిశీలించారు. ఆక్రమణలు, హద్దులు, బఫర్‌జోన్ గుర్తింపుపై ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

**కమిషనర్ చొరవతో..**
ఏదులాపురంమున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి చొరవతో చెరువు చెర విముక్తి దక్కడంలో కీలక పాత్ర పోషించారు. కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆదేశాల ప్రకారం.. ప్రత్యేక దృష్టి పెట్టారు. అందు కనుగణంగానే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను సమన్వయం చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు సోమవారం సర్వే చేపించారు. సర్వేయర్ సతీష్‌రెడ్డి, ఏఈ మందీప్ నేతృత్వంలో 20 మంది ట్రైనీ సర్వేయర్లు చెరువు చుట్టూ జల్లెడ పట్టారు. బురదలో సైతం తిరుగుకుంటూ అత్యధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ గ్లోబల్ పోజిషింగ్ సిస్టం (డీజీపీఎస్) ద్వారా హద్దులను గుర్తించి మార్కింగ్ చేశారు. సుమారు 30 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు అంచనా వేశారు.



**ప్రజాపక్షం వరుస కథనాలు..**
చెరువు కబ్జాపై ప్రజాపక్షం వరుస కథనాలు ప్రచురించింది. 22 జూన్ 2024న చెలరేగిన మట్టి మాఫియా కథనంతో వెలుగులోకి తీసుకువచ్చింది. అటు తర్వాత మట్టి మాటున ఏదులాపుం చెరువు కబ్జా, సర్వేతో నిగ్గుతేలనున్న ఏదులాపురం చెరువు, అధికారుల సాక్షిగా ఏదులాపురం చెరువును చెరబట్టారు. అక్షరమే ఆయుధంగా, అధికారుల దాగుడుమూతలకు కళ్లెం వంటి వరుస కథనాలతో అధికారులలో చలనం తీసుకువచ్చింది. స్పందించిన అధికారులు సర్వే చేసి ఆక్రమణలు తొలిగించేందుకు పూనుకున్నారు. కానీ వర్షాలు రావడంతో సర్వేకి ఆటంకం కలగడంతో నిలుపుదల చేశారు.

## కౌజు పిట్టల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కౌజు పిట్టల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరి నగర్ గ్రామ పంచాయితీలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన దుర్గాంభిక గ్రామ సంఘంలోని అరుణోదయ గ్రామ సమాఖ్యలోని ప్రణజ కౌజుపిట్టల పెంపకం యూనిట్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా కౌజు పిట్టల పెంపకం ప్రారంభించినందుకు మహిళా సంఘాలను అభినందించారు. ప్రతీ మండలంలోని మహిళా సంఘాలు కౌజుపిట్టల పెంపకం చేపట్టాలని, తద్వార ఆదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రతీ 40రోజులకు ఒకసారి వీటిని అమ్ముకోవచ్చని, మార్కెట్‌లో మంచి ధర పలుకుతుందని చెప్పారు. అనంతరం చేపల పెంపకం యూనిట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. సుజాతనగర్ మండలంలోని రవి హైబ్రీడ్ సీడ్స్ క్షేత్రాన్ని సందర్శించి వారు పండిస్తున్న అన్ని రకాల కూరగాయల తోటలను పరిశీలించారు. జిల్లాలోని కనీసం 10 గుంటల స్థలం కలిగిన ప్రతీ మహిళా రైతు కూరగాయల సాగు ప్రారంభించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం అవసరమైన మౌళిక వసతులు, తదితరాల రిపోర్టును రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టు ఆధారంగా జిల్లాలో 1000 మంది మహిళా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సుజాతనగర్ మండలంలోని నాయకులగూడెంలో గల కొర్రమీనల చేపల యూనిట్‌ను పరిశీలించారు. నిర్వాహకురాలు మండే స్రవంతిని అభినందించారు. కూరగాయలు, కౌజు పిట్టల పెంపకం చేపడితే అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, సుజాతనగర్ ఎంపిడిఓ, ఎంఆర్ఓ, లక్ష్మీదేవిపల్లి ఎంపిడిఓ, ఎంపిఓ ఫాం, రెండు మండలాల ఎపిఎంలు, సిసిలు పాల్గొన్నారు.

## చెరువులో తామర పువ్వుల కోసం వెళ్ళి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం మందలపల్లిలో పువ్వుల కోసం చెరువులో దిగి వ్యక్తి మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. ఏపీలోని టి.నర్సాపురం మండలం మధ్యాహ్నపువారి గూడెం గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల ప్రవీణ్ (30) భార్య, ముగ్గురు పిల్లలతో హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మరో రెండు రోజుల్లో వినాయక చవితి ఉండటంతో గణేష్ నవరాత్రులకు తామర పువ్వులు, పత్రి, మామిడి ఆకులు గ్రామాల నుంచి సేకరించి హైదరాబాదులో విక్రయించి నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చని, పిల్లలకు కావలసిన బట్టలు, వస్తువులు కొనుక్కోవచ్చని మిత్రులు చెప్పడంతో హైదరాబాద్ నుంచి అమ్మమ్మ ఇంటికి వచ్చిన ప్రవీణ్ తామర పువ్వులను సేకరించడనికి మరో ఇద్దరితో కలిసి మందలపల్లి చింతల చెరువులో దిగారు. చెరువులో లోతు ఎక్కువగా ఉందని స్థానికులు వారించినప్పటికీ పువ్వుల సేకరణ కోసం చెరువు మధ్యలోకి వెళ్లిన ముగ్గురిలో ఇద్దరు ఒడ్డుకు చేరుకోగా ప్రవీణ్ చెరువు లోతును అంచనా వేయలేకపోవడంతో నీటిలో మునిగిపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి ప్రవీణ్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సూరమేని అకాల మరణం సిపిఐకి తీరని లోటు

నివాళులర్పించిన సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సూరమేని జనార్ధన్ అకాల మరణం సిపిఐకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాష అన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 19వ డివిజన్‌లో ఉన్నం దాష్‌గడ్డ శాఖ 1 కార్యదర్శి జనార్ధ్ బ్రెయిన్ డెడ్‌తో ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ మృతి చెందారని చెప్పారు. సిపిఐకి, ఆయన కుటుంబానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ఆకర్షిత రాజకీయాలాకు తావివ్వకుండా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని, ఎన్ని ఒడిదుడుకులు విచ్చనా ఈ ప్రాంత సిపిఐ నిర్మాణం కోసం తుదిశ్వాస వరకు పనిచేశారన్నారు. అనంతరం 30 ఆటోలతో ర్యాలీగా వెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మరి గోపి, తుముల శ్రీనివాస్, మండల రాజు, గుత్తుల శ్రీనివాస్, కమల్, గంటాడు కోటేశ్వరరావు, బయన్న ఈశ్వరయ్య, అజ్మిత్ పాషా, ఎస్కే జలీల్, తోగరు నరేంద్ర, బానోత్ చందర్, గగులోతు శంకర్, ఖయ్యూం, బానోత్ శ్రీనివాస్, దాట్ల శ్రావణ్, మునిగడప పద్మ, కరిష్మా, రత్నకుమారి, మహబూబి, షాహిన్, విజయలక్ష్మి, భాగ్య, మార్తమ్మ, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# 13 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని మండలానికి చెందిన 13మంది సైబర్ నేరగాళ్లను అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు వలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వారిని పట్టుకున్నారు. ఈ మేరకు వారిని సోమవారం ఎస్పి మీడియా ముందు ప్రవేశపెట్టిన అనంతరం రిమాండ్ నిమిత్తం ఇల్లెందు కోర్టుకు తరలించారు. వివరాల ప్రకారం టేపకారం మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్న బోడా శ్రీధర్‌కు టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్ల ఇతరులకు నగదు బదిలీ చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో ఇతనితో పాటు మండలానికి చెందిన మరో 12 మంది చదువుకున్న యువకులు నకిలీ పత్రాలతో 60బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఈ ఖాతా నెంబర్లతో ఇతరుల బ్యాంకు ఖాతాల్లోకి నగదును పంపిస్తూ కమీషన్లు పొందుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. గత ఆరు నెలలుగా మొత్తం రూ.8.5 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ సైబర్ నేరగాళ్ల నుండి 12 సెల్ ఫోన్లు, బ్యాంకు పాస్ బుక్‌ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దేశవ్యాప్తంగా వీరి బ్యాంకు ఖాతాలపై 108 ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు టేరకు సిఐ సత్యనారాయణ, ఎస్ఐ రాజేందర్, సైబర్ క్రైం సిఐ జితేందర్ సిబ్బందిని ఎస్‌పి రోహిత్ రాజ్ అభినందించారు. సైబర్ నేరగాళ్ల రకరకాలుగా అమాయకులను మోసం చేస్తూ వారి ఖాతాల్లో నుండి డబ్బులను కాజేయాలని ప్రయత్నిస్తున్నారని, నేరాల బారిన పడకుండా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇలాంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే చట్టరిత్యా చర్యలుంటాయని, నగదు కోల్పోయిన వారు 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కోల్పోయిన నగదును తిరిగి పొందేందుకు వీలుంటుందని పోలీస్ అధికారులు తెలిపారు. పట్టుబడిన సైబర్ నేరగాళ్లలో బోగా శ్రీధర్, బోడా రాజేష్, బోడా రాజన్న, బానోత్ జగదీష్, తేజావత్ నరేష్, పోలెపొంగు ప్రవీణ్ కుమార్, భూక్యా వీరన్న, జటోత్ నరేష్, బోడా జంపన్న, బోడా రాజారామ్, భూక్యా ప్రవీణ్, మాలోత్ ప్రవీణ్, ఉరిమళ్ల భరత్‌కృష్ణ ఉన్నారు.

## సిపిఐ సీనియర్ కార్యకర్త పద్మ మృతి

పార్టీ నాయకులు సంతాపం



**ప్రజాపక్షం/మణుగూరు:** మండలం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త దామళ్ళ పద్మ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. దామల్ల పద్మకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్ లు ఎర్ర జెండా కప్పి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వీరి వెంట మహిళా సమైక్య మండల కార్యదర్శి దుబ్బాక నిర్మల, సీనియర్ నాయకులు జగ్గన్న, దుబ్బాక ప్రమీల, మండల కార్యవర్గ సభ్యులు నోముల రవి, ఎలుక రాఘవులు, ఏర్పుల వీరయ్య, శ్రీరాములు తదితరులు నివాళులర్పించారు.

# మీరే చంపేశారంటూ బంధువుల రాస్తారోకో

పోలీస్ స్టేషన్ ముందు ధర్నా... భర్తతోపాటు బంధువులపై దాడి చేసిన మృతురాలి బంధువులు

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** పట్టణంలోని వివాదాస్పదంగా మారిన పూల లక్ష్మీ ప్రసన్న రాజమండ్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనకు భర్త, ఆడబిడ్డ, భర్త ఈమె మృతికి కారణమంటూ బంధువులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం రాజమండ్రి నుంచి తీసుకువస్తుండగా శ్రీ లక్ష్మీ తులసీ ఆగ్రో పేపర్‌బోర్డు సమీపంలో బంధువులు అడ్డగించి భర్తను కొట్టారు. ఇంట్లో ఉన్న ఆమె అక్కపై కూడా దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి ఎంత సర్దిచెప్పినా మృతురాలి బంధువుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో పోలీసులే నిందితులను కాపాడుతున్నారని కల్లూరు నుంచి వచ్చిన మృతురాలి బంధువులు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగా రాస్తారోకోతో ఆందోళన చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపు భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. సిఐ దమ్మపేట, అశ్వారావుపేట ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఎంత చెప్పినా వినకపోవడంతో ఆ పరిస్థితుల్లో లాఠీచార్జి వరకు వెళ్లింది. మృతురాలు భర్త బావను కావాలనే పోలీసులు కాపాడుతున్నారన్నారు. అనుమానాస్పద కేసు నమోదు చేయటమేమిటని, భర్త, అక్క, బావలు ఆమెను రెండేళ్ల పాటు చిత్రహింసలు పెట్టి గృహ నిర్బంధం చేసి మృతికి కారణమయ్యారని ఆరోపించారు. అంతలో అటువైపు నుంచి వస్తున్న మృతురాలి భర్త, బావను చూసి బంధువులు ఒక్కసారి వారిపై దాడి చేసే ప్రయత్నంలో పక్కనే పోలీస్ వాహనం ఎక్కి దాక్కున్నారు. దీంతో బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురై పోలీస్ వాహనంలో కావాలని నిందితున్ని దాచిపెట్టారని ఆగ్రహించారు. అనంతరం పోలీసుల సహాయంతో మృతదేహానికి స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు కుమార్తెతో తలకొరివి పెట్టించారు. ఈ విషయంపై సిఐను వివరణ కోరగా కేసు నమోదు చేయటం జరిగిందని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించినట్టుగా మేము ఎవరినీ దాచలేదని, దాడి చేయబోతే పోలీస్ వాహనంలో ఎక్కి దాక్కున్నారని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

## 7న హైదరాబాద్‌లో కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర సదస్సు

ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య

**ప్రజాపక్షం/ఇల్లందు:** కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబరు 7న హైదరాబాద్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి జె.సీతారామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లందు ఐఎఫ్టియు కార్యాలయంలో జరిగిన ఐఎఫ్టియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఐఎఫ్టియు జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, బి.ప్రదీప్, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, జాతీయ నాయకులు కర్ణాటక న్యాయవాది బాలన్ ముఖ్య వక్తలుగా హాజరై ప్రసంగిస్తారని అన్నారు. అన్ని రంగాల కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎండి. రాసుద్దీన్, డి.ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, రావూరి ఉపేందర్ రావు, పందిర్లపల్లి వీరన్న, ఆదెర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలన్నారు. మన పరిధిలో చేయగలిగిన పనిని వెంటనే పూర్తి చేయాలని చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనలను వివరిస్తూ సమాధానం ఇవ్వాలని సూచించారు. ఖమ్మం నగరానికి చెందిన యనమందల కృష్ణబాబు తన కుమారుడు తెలంగాణ సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్నాడని తన కొడలికి అమర వీరుల కుటుంబానికి అందించే ప్రభుత్వ ఉద్యోగం అందించాలని దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌పై కలెక్టర్ సమావేశం**
రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కొరకు ఆసక్తి గల ఉద్యోగులు ఆగస్టు 30లోపు రెండు లక్షల రూపాయలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, రాజీవ్ స్వగృహ సిఈ భాస్కర్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌పై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్ ప్రాజెక్టు 9.22 ఎకరాల్లో నిర్మించిన ఎనిమిది టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ప్లాట్లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం నిర్వహించామని గజం భూమి రూ.1150 ధర నిర్ణయించామన్నారు. ఉద్యోగులకు లాటరీ పద్దతిన ప్లాట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. సొంత ఇల్లు కావాలన్న ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొని తమ కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూతో టవర్స్ బాగున్నాయన్నారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి వల్ల రోడ్డు కనెక్టివిటి పెరుగుతుందని, మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపు కూడా ఉండదని తెలిపారు. టౌన్‌షిప్ వద్ద 60 అడుగుల రోడ్డు, అన్ని రకాల అనుమతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ.పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, టిజివో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, టిఎన్‌జివో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం

**ప్రజాపక్షం/ జనగామ :**ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా అదనపు కలెక్టర్లు బెన్షాలోమ్, పింకేషన్‌కుమార్‌లతో కలిసి ప్రజల వద్ద నుండి ధరఖాస్తులను స్వీకరించారు. స్టేషన్‌ఘనపూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన పులి వనమ్మ తన భర్త యాకయ్య చనిపోయినందున వితంతు పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జనగామ మున్సిపల్ పరిధిలోని బీరప్ప గడ్డ 23వ వార్డుకు చెందిన మెరుగు స్రవంతి తనకు ఇంటి స్థలం ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. గ్రీవెన్స్‌కు వచ్చే దరఖాస్తుదారుల సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డిఓలు గోపిరాం, డిఎస్ వెంకన్న, డిప్యూటి కలెక్టర్ కొమురయ్య, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్త



**ప్రజాపక్షం/ఖానాపూర్:**విద్యుత్ ప్రమాదాల పట్ల విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆధునీకరణ పనులను ఆయన సందర్శించారు. అదేవిధంగా వినియోగదారులకు బిగిస్తున్న అటోమెటిక్ ఇన్స్టలేషన్‌ను పర్యవేక్షించారు. దాని వలన కలిగే ఉపయోగాలను వినియోగదారులకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట డిఇ తిరుపతి, ఎడిఇ రాజేష్ రెడ్డి, ఎఇ లు మంగమ్మ, ప్రభాకర్, సబ్ ఇంజనీర్ వెంకటేష్, ఒఅండ్ ఎం సభ్యులు ఉన్నారు.

## బోర్డు పెట్టడం కాదు రోడ్డు సరి చేయండి

### సిపిఐ గూడూరు మండల కన్వీనర్ మాలోత్ రవీందర్



**ప్రజాపక్షం/గూడూరు;**ప్రమాదాలు జరిగినప్పుడల్లా అక్కడ నెమ్మదిగా వెళ్ళండి అని బోర్డులు పెట్టడం కాదు కానీ ఆరోడ్డును బాగు చేస్తే ప్రమాదాలు తుగ్గతాయని సిపిఐమండల కన్వీనర్ రవీందర్ అన్నారు.సోమవారం మ హ బూబాబాద్ జిల్లా గూ దూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గూడూరు మండల బొద్దుగోండ గ్రామ సమీపంలో 365 నేషనల్ హైవే రోడ్డు అసంపూర్తి కారణంగా తీవ్రంగా దెబ్బతిని గుంతలు ఏర్పాడ్డాయి. గూడూరు నుండి బోద్దుగోండ వరకు రోడ్డు చాలా బాగున్నా ఆ గ్రామ సమీపంలోని రాగానే రోడ్డు అంత గుంతల మయంగా ఉండడంతో తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రమాదం జరిగినప్పుడల్లా హెచ్చరిక బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు.వెంటనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డును సరిచేయాలని లేకపోతే సిపిఐఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళ న చేపడుతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## కవిత నాయకత్వంలో జాగృతి బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ జాగృతి సంస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఆల్వల జితేందర్, రవి రాథోడ్ మహబుబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మహబూబాబాద్‌జిల్లా జాగృతి యువజన అధ్యక్షుడు గందసిరి వేణు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ప్రజల తరుపున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమాలు ప్రజల పక్షాన నిరంతరం పోరాటం ఉంటుందని తెలిపారు .ఈ కార్యక్రమంగిరగని శ్యామ్, సత్యనారాయణ, హర్షిత్ ,తదితరులు పాల్గొన్నారు

## వరి ధాన్యానికి బోనస్ చెల్లించండి

### బిజెపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలి



**ప్రజాపోం/గూడూరు;**రైతులు పండించిన వరి ధాన్యానికి 500 రూపాయాలు బోనస్ చెల్లిస్తానని ప్రభుత్వం హామి ఇచ్చి ఇప్పటివరకు చెల్లించడం లేదని గూడూరు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మహబూఐబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు గురించి వివరిస్తూ మండల కేంద్రంలో ర్యాలి నిర్వహించారు. అనంతరం గూడూరు మండల తహసీల్దార్ కు మెమొరాడం ఇవ్వడం జరింగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనాతా పార్టీ ప్రజల పక్షాన పోరాడే పార్టీ అని టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ప్రజలను దోచుకున్నారే తప్ప ఏరోజు వారికి మేలు చేయతేదని అన్నారు.గూడూరు మండలంలో స్థానిక సమస్యలపై పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. జిల్లా మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, సీనియర్ నాయకులు రామ సహా యం కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జ్ వర్ధన్నపేటలో చేపట్టిన జనహిత పాదయాత్రకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వస్తున్న సందర్భంగా కాకిరాల హరిప్రసాద్, కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగం, రైతు సమస్యలు, విద్యార్థుల కష్టాలు, ప్రజలపై పడుతున్న భారం వంటి అనేక అంశాలను మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రజల ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.మండల నాయకులు అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, సోమారం మాజీ సర్పంచ్ తమ్మడపల్లి సంపత్, మండలంలోని వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకలకు పటిష్ట చర్యలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**ప్రజాపక్షం/భూపాలపల్లి :**వినాయక చవితి వేడుకల సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠాపన నుండి నవరాత్రుల నిమజ్జనాల వరకు ఎటువంటి అంతరాయం కలగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విగ్రహాలు ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలపై ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, వైద్య, దేవాదాయ, అగ్నిమాపక, విద్యుత్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి పండుగ వేడుకలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండపాలకు విద్యుత్తు సరఫరాకు, మైకు ఏర్పాట్లుకు తప్పనిసరి అనుమతి తీసుకోవాలని సూచించారు. లూజు విద్యుత్తు వైర్లు వాడరాదని, ఎంసిబి వేయాలని, వేలాడే విద్యుత్తు తీగల నుండి వైర్లు ఏర్పాటు ద్వారా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. మండపాల వద్ద వ్యర్థాలు వేసేందుకు అనువుగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్తు తీగల క్రింద విగ్రహాలు ఏర్పాటు వల్ల విద్యుత్తు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. శాంతియుత వాతావరణంలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు, నిమజ్జన ఉత్సవాలు జరగాలని అన్నారు. నిమజ్జన రోజున అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు మహాదేవపూర్, జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబా ఉండాలని తెలిపారు. అత్యవసర సేవలకు అంబులెన్స్ సేవలు వినియోగించడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా కాళేశ్వరం వద్ద విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. అన్ని మండలాలలో నిమజ్జనానికి నీటి వనరులను గుర్తించాలని, నిమజ్జనం చేయడానికి అనుమతి ఉన్న ప్రదేశంలో నిమజ్జనం చేయాలని తెలిపారు. మండపాల ఏర్పాటును పోలీస్ రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్తు, క్రేన్లు, మంచినీరు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వేడుకల నిర్వహణ సజావుగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ శ్రీలత, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఆర్డిఓ రవి,అన్నిశాఖల అధికారులు పాల్గొన్నా రు.

**మట్టి గణపతులను పూజించాలి**

మట్టి గణప తులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మట్టి గణపతులను, మట్టి పతులు పూజించాలన్న వాల్ పోస్టర్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వలన జల కాలుష్యం ఏర్పడి జీవవైవిధ్యానికి నష్టం కలుగుతుందని సూచించారు. ఈ సందర్భంలో ప్రజలందరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగకు 4 వేల మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సి ంగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఎఇ సుభాష్ నాయక్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి

### మైలారం గుట్టలో 187 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం మైలారం గ్రామ శివారులోని గుట్టల్లో 187 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రియల్ హబ్ లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ఔత్సాహిక పెట్టుబడిదారులు ముందుకురావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. సోమవారం రెవె న్యూ, ఇండస్ట్రీయల్, పోలీస్ ఇతర శాఖల అధికారులతో కలిసి మైలారం గుట్టపై జరుగుతున్న ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జీఎస్సార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, మైలారం రెవెన్యూ శివారులోని 204/1 ,205/1 సర్వే నెంబర్ లలో మొత్తం 187 ఎకరాలు భూమి ఉందన్నారు. ప్రభుత్వ భూమి దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ కార్యాల యాలకు, విద్యా సంస్థలకు స్థలం కేటాయించామన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రులు, ఎంపీల సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాంతాన్ని టూరిజం, ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చి దిద్దుతున్నామన్నారు. ఇండస్ట్రీస్ పార్క్ కొరకు 60 ఎకరాల్లో 197 ఫ్లాట్లు కేటాంచడం జరిగిందన్నారు. స్క్వేర్ ఫీట్ రూ.1600 లకు టెండర్ కూడా త్వరలోనే ఓపెన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారవేత్తలు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ కు 40 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయంకు 10 ఎకరాలు, సైనిక్ స్కూల్ కు 20 ఎకరాలు, అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ కు 15 ఎకరాలు కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటికే రోడ్డు పనులకు రూ.4 కోట్లు ఖర్చు చేశారని మరో రూ.15 కోట్ల నిధులు సమకూర్చుతున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు, కార్యకర్తలు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రజాపాలనతోనే గ్రామాల అభివృద్ధి

### మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనతోనే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగ ంగా రఘునాథపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని గబ్బెట, కంచనపల్లి, ఎల్లారెడ్డిగూడెం, కుర్చపల్లి గ్రామాలలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ గ్రామాలలోసిసిరోడ్లు, అంతర్గత బీటీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని మండలానికి రూ.4కోట్ల నిధులు మంజూరి చేసి శంఖుస్థాపనలు చేసినట్లు ఆయన తెలిపారు.ఇప్పటికే స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దీంతో రానున్న రోజులలో నియోజకవర్గ రూపురేకలు మారనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్‌డిఒగోపిరాం, డిఆర్‌డిఓ పిడి వసంత, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ శ్రీదేవి, తహసీల్దార్ ఫణికిషోర్, ఎంపిడిఓ శ్రీనివాసులు, మాజీ జెడ్‌పిటిసిలు అజయ్, జగదీష్ చందర్‌రెడ్డి, నాయకులు ,ఖిలాషాపురం మాజీ సర్పంచ్ శ్రీధర్, మాజీ ఎంపిటిసి కృష్ణ, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/ములుగు:**గణేష్ నవరాత్రి ఉత్సవాల వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యుత్, మున్సిపల్, పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో ములుగు జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారంలోని ముళ్ళకట్ల , రామన్నగూడెం, మంగపేట మండలాల్లో లో లెవెల్‌లో ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్‌లో విద్యుత్ తీగలో విషయంలో ఆ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వేడుకల కోసం లైటింగ్, శానిటేష్, బ్లీచింగ్ వంటి పనులను మున్సిపల్, పంచాయతీశాఖ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్యాధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో షిఫ్ట్‌ల వారీగా ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. లైఫ్ జాకెట్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్, ఇరిగేషన్, అగ్నిమాపక, వైద్యశాఖ తదితర శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. చెరువుల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున క్రేన్ల సంఖ్యను పెంచి ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యారోగ్య శాఖచే ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేయలన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునేలా ఏర్పాట్లను చేసుకోవాలని, పండగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని అధికారులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు. ఈ సందర్భంగా ఎస్పి శబరీష్ మాట్లాడుతూ ఈసారి గణేష్ విగ్రహాల ఏర్పాటు నిర్వహకులు పోలీస్ వెబ్‌సైట్‌లో గణేష్ మండపం పూర్తి వివరాలు నమోదు చేయాలని, తద్వారా వారికి తగిన సేవలు అందుతాయని తెలిపారు. నిమజ్జన ప్రాంతాలైన చెరువుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. వాతావరణం కలుషితం కాకుండా ఉండేందుకు మట్టి వినాయకులు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలని, డిజె సౌండ్ సిస్టం అనుమతించకూడదని, మండళ్లు ఏర్పాటు చేసిన చోట్ల, సౌండ్ సిస్టం, నిమజ్జన సమయంలో భక్తి భావనతో కూడిన పాటలను మాత్రమే వేసే విధంగా చూడాలని కోరారు. గత ఉత్సవాలు అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్‌వారితో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, ఆర్‌డిఓ వెంకటేష్, డిఎస్పి రవీందర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



**ప్రజాపక్షం / నల్లబెల్లి:**రైతులను అదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని యూరియా కోసం రోడ్డెక్కల్సిన పరిస్థితి ఏర్పడిందని వరంగల్ జిల్లా నల్లబెల్లి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు . సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేస్తు రోడ్డుపై ధర్నా ,రాస్తారోకో చేశారు . ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు . వర్షకాలం ప్రారంభమై పంటలు వేసిన రైతులకు యూరియా సరైన సమయంలో దొరక పోవడంతో అనేక అవస్థలు పడుతున్నారన్నారు . రైతులకు యూరియా అందించని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గద్దె దిగి పోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్ మాట్లాడుతూ స్థానిక నర్సంపేట ఎమ్మెల్యే ఏనాడు రైతు సమస్య పట్టించుకోవడం లేదని అధికారులతో సమీక్షలు జరిపిన పాపాన పోలేదని గుర్తు చేశారు . మండల అధికారులు వచ్చే వరకు రాస్తారోకో విరమించేది లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనడంతో వెంటనే స్థానిక తహసీల్దార్ ఎం.కృష్ణ ,వ్యవసాయాధికారి బన్న రజిత వచ్చి యూరియా మండలానికి అధికంగానే వచ్చిందని ఇంక మండలానికి సరిపడే యూరియా వస్తుందని రైతులు ఆధైర్యపడవద్దని చెప్పారు .ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు .

## సాంకేతిక సమస్యలతో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇబ్బందులు

### హౌసింగ్ పిడి కార్యాలయంలో బైఠాయించి ఆందోళన



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**సాంకేతిక కారణా ల సమస్య ఒకవైపు, ఇంకా ఇల్లు కట్టనందున రద్దు చేస్తున్నట్లు గ్రామపంచాయతీ నోటీసులు మ రోవైపు ఇల్లు కూల్చి పందిరి వేసిన చందంగా ఇందిరమ్మ ఇండ్ల పరిస్థితి ఉందిని సిపిఐ మున్సిప ల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. మ హబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి పీడీ కార్యాలయంలో బయటాయించి నిరసన ఆందోళన చేశా రు. మాట్లాడుతూ మహబూబాద్ జిల్లాలో అనేకమంది ఇందిరమ్మ లబ్ధిదారులు సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దే వుడు వరమిచ్చినా పూజారి అడ్డుపడ్డ చిన్నంగా ఇందిరమ్మ ఇంట్లో సమస్య ఉందన్నారు మహబూబాద్ పట్టణంలోని 22వ వార్డు మరియు బ య్యారం మండలం కోయగూడెం పెనుగొండ వి విధ గ్రామాలలో సాంకేతిక కారణాలతో ఇల్లు పీకి పందిరి వేసిన చందంగా లబ్ధిదారుల కష్టాలు అనే కం అన్నారు అధికారులు వారే ముగ్గు పోయమని వెంటనే నిర్మించాలని ఒక వైపు చెపుతూ మరోవైపు తమ పేర్లు తప్పు పడ్డాయని సాంకేతిక కారణాలతో వారికి నోటీసులు ఇస్తూ ఇబ్బందులు పెడు తూ గత మూడు నెలలుగా ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. మహబూబాద్ పట్టణంలో అనేక సమస్యలతో లబ్ధిదారులు ఇబ్బందు లు పడుతున్నారని మరియు బయ్యారం మ ండలం కోయగూడెం గ్రామపంచాయతీలో 20 మంది లబ్ధిదారులకు వచ్చినా కూడా ఇంతవరకు ఒక్కరికి కూడా నిధులు మంజూరు కాలేదని వారికి సాంకేతిక సమస్య ఉన్నదని చెబుతూ వస్తున్నారన్నారు. ఇప్పటికైనా వీరి సమస్యలు పరిష్కరించి వారికి ఇందిరమ్మ ఇల్లు సకాలంలో మం జూరి అయ్యే విధంగా చూడాలని లేకపోతే ఆందోళన నిర్వహిస్తామని బి అజయ్ సారథి రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా పిడి కార్యాలయంలో బైఠాయించి చుట్టుముట్టి నిరసన ఆందోళన చేశా రు.కార్యక్రమంలో పెరుగు కుమార్ చింతకుంట్ల వెంకన్న బాధితులు , తదితరులు పాల్గొన్నారు .

## ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కారం



### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/ వరంగల్:** ప్రజా వాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమర్పించిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి 151 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 58, జి డబ్ల్యూ ఎంసీ 30, గృహ నిర్మాణ శాఖ 12, సహకార శాఖ 7, పౌర సరఫరాల శాఖ 5, ఇతర శాఖలకు సంబంధించిన 39 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవీయ కోణంలో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి , జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఏఓ అనురాధ, డిబిసిడిఓ పుష్పలత, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## మిత్ర మండలి పోస్టర్ విడుదల

బలగం ఫేం ప్రియదర్శి హీరోగా వైరా ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్న మిత్ర మండలి సినిమా నుంచి పోస్టర్ విడుదల చేశారు. హీరో ప్రియదర్శి బర్త్ డే సందర్భంగా ఈ సినిమా నుంచి ప్రియదర్శి పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సినిమా టీం అందరూ హీరోకు విషెష్ చెప్తూ ఈ పోస్టర్ రూపొందించారు. సప్తస్వర మీడియా, ఫిలిం వర్క్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విష్ణు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాటలను ఆదిత్య మ్యూజిక్ విడుదల చేయనుంది. బన్ని వాసు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన వినోదాత్మక చిత్రాలకు ఇది పూర్తిగా భిన్నంగా ఉంటుందని బన్ని వాసు తెలిపారు.






## దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్

నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్ హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సితారగా దివ్య ఖోస్లాను పరిచయం చేశారు. బ్యూటీఫుల్ అండ్ క్లాసిక్ గా కనిపించిన దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు.
జీ స్టూడియోస్, ప్రేర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమాను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రేర్ణా అరోరా ప్రొడ్యూస్ చేస్తున్నారు. మ్యూజిక్ జీ మ్యూజిక్ కో. క్రియేటివ్ డైరెక్షన్ దివ్య విజయ్. జీ స్టూడియోస్ స్ట్రాటజిక్ విజనరీ ఉమేష్ కుమార్ బన్సాల్ మద్దతుతో, ప్రొడ్యూసర్స్ శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్ప సింగాల్, కోప్రొడ్యూసర్స్ అక్షయ్ కేజ్రివాల్, కుస్సుం అరోరా ఈ ప్రాజెక్ట్ కు మద్దతు ఇస్తున్నారు. టాయిలెట్: ఎక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మాన్, పరి వంటి హిట్స్ ఇచ్చిన ప్రేర్ణా అరోరా మళ్లీ సినిమాను రూపొందిస్తున్నారు.

## కానిస్టేబుల్ కనకం సక్సెస్ మీట్

'ఈటీవీ విన్'లో విడుదలైన కానిస్టేబుల్ కనకం, ఆల్ ఇండియా ర్యాంకర్స్, అనగనగా చిత్రాలు అద్భుతమైన విజయంతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్నాయి. ప్రతి చిత్రం రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టాప్ ట్రెండింగ్‌లో స్ట్రీమ్ అవుతున్నాయి. ఈ సందర్భంగా హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సక్సెస్ మీట్‌లో హీరోయిన్ వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ..కానిస్టేబుల్ కనకంతో ఈటీవీ విన్ లో భాగం కావడం ఆనందంగా వుంది.
ఒక ట్రూ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ తీశారు. సురేష్ బొబ్బిలి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. డైరెక్టర్ ప్రశాంత్ గారికి థాంక్ యూ. సిరిస్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. పార్ట్ 2 కూడా రాబోతుంది అని అన్నారు.



## ఫ్యామిలీతో కలిసి చూసే సినిమా

### డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి



హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నాకు ఫ్యామిలీ కథలు ఇష్టం. కలిసుందాం రా నా ఫేవరెట్ సినిమా. అలాంటి ఒక క్యూట్ ఫ్యామిలీ స్టోరీ చేయాలని ఉండేది. రోహిత్‌తో నాకు ఎనిమిదేళ్ల జర్నీ వుంది. నా ఫస్ట్ సినిమాని క్యూట్ ఫ్యామిలీ లవ్ స్టోరీగా చేద్దాం అనుకున్నాను. అప్పుడు ఈ ఆలోచన వచ్చింది. రోహిత్ కి చెప్పాను. కథ రాసి పంపించాను. ఆయన చదివి ఇంప్రెస్ అయ్యారు. అలా ప్రాజెక్టు మొదలైంది. 30 దాటాక పెళ్లి కాకపోవడమే పెద్ద పంచాయతీ అనుకుంటే, ప్రత్యేకమైన క్వాలిటీలు వెతుక్కోనే పర్సన్ ఉంటే ఎలా ఉంటుంది, వాళ్ళ ఇంట్లో పరిస్థితి ఎలా ఉంటుందనేదనే ఆలోచన నుంచి వచ్చింది.
పవన్ సాధినేని దగ్గర ఒక వెబ్ సిరీస్ చేశాను. సాగర్ కే చంద్ర, పల్నాటి సూర్య ప్రతాప్ దగ్గర రైటింగ్ లో చేశాను. వీర భోగ వసంత రాయులు సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్ గాపని చేశాను. అలాగే నేల టికెట్ సినిమాకి అప్రెంటిస్‌గా చేశాను.
రామాయణంలో హనుమంతుడు సీతమ్మ వారి దగ్గరికి వెళ్లి రాముల వారిచ్చిన ఉంగరాన్ని చూపించే ఘట్టం సుందరకాండ. అదొక సెలబ్రేషన్. అయితే సెలబ్రేషన్ కి ముందు ఎన్నో సవాళ్లు వున్నాయి. హనుమంతులవారు ఎన్నో ఎఫర్ట్స్ పెట్టారు. అలా మా హీరో కూడా ఒక విషయాన్ని ఎచీవ్ చేయాలనుకుంటారు. దానికి ఆయన పెట్టే ఎఫెర్ట్స్ ఎమిటనేది కథ. అలా సుందరకాండ అనే టైటిల్ పెట్టడం జరిగింది. ఇది పాజిటివ్ టైటిల్. రామాయణం నాకు చాలా ఇష్టం. ఆ టైటిల్ కూడా అలా కలిసి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. రెండు డిఫరెంట్ ఏజ్ గ్రూపున్న లవ్ స్టోరీ ఇది. రోహిత్ కంటే ఏజ్‌గా కనిపించాలి అదే సమయంలో బ్యూటిఫుల్‌గా ఉండాలి. అలాంటి అమ్మాయి కోసం వెతుకుతున్నప్పుడు శ్రీదేవి విజయ్ కుమార్ ను అనుకున్నాను. శ్రీదేవి రోహిత్ కు తెలుసు. అయితే ఆమెని ఈ క్యారెక్టర్ లో ఒప్పించే బాధ్యత మాత్రం రోహిత్ నా మీద పెట్టారు. నేను వెళ్లి కథ చెప్పాను. కథ నచ్చి వెంటనే ఓకే చేశారు. ఈ సినిమా కోసం ఆవిడ చాలా ఎఫర్ట్ పెట్టారు. స్కూల్ అమ్మాయిగా కనిపించడానికి డైట్ కూడా చేశారు. నాకు కామెడీ చాలా ఇష్టం. అయితే రాయడం అంత ఈజీ కాదు. వీటన్నిటికంటే కామెడీ చేసే నటులు దొరకడం ఇంకా కష్టం. లక్కీగా మాకు చాలా అద్భుతమైన నటులు దొరికారు.

## 'మదరాసి' ట్రైలర్ రిలీజ్

అమరన్ బ్లాక్ బస్టర్ విజయం తర్వాత శివకార్తికేయన్ హై యాక్షన్ ఎంటర్టైనర్ 'మదరాసి'తో రాబోతున్నారు. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శ్రీ లక్ష్మి మూవీస్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక వెంచర్ ఇప్పటికే టైటిల్ టీజర్ రెండు చార్ట్‌బస్టర్ సింగిల్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నీలాగే ఇతరులను ప్రేమించు. అందరూ నీ కుటుంబమే అనుకో. అదే అన్ని రిలీజియన్స్ అందరూ దేవుళ్ళు చెప్పేది' అనే హీరోయిన్ డైలాగ్ తో ట్రైలర్ ప్రారంభమౌతుంది. అక్కడి నుంచి కథ వేగంగా మలుపు తిరుగుతుంది. సిటీ వైపు ఆరు ట్రక్కుల్లో అక్రమంగా తయారు చేసిన గన్స్ బయలుదేరుతాయి. వీటిని అడ్డుకోవడానికి పోలీసులు రంగంలో దిగుతారు. అన్నింటికీ సెంట్రల్ పాయింట్‌గా వుండే శివకార్తికేయన్ పాత్ర అరుదైన మానసిక స్థితి కలిగిన వ్యక్తిగా పరిచయం కావడం, తన స్థితి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయడం క్యూరియాసిటీని మరింత పెంచుతుంది. తన గర్ల్‌ఫ్రెండ్‌ని రక్షించడానికి జీవితాన్నే మార్చేసే నిర్ణయం తీసుకుంటాడు.



## నెట్ ఫ్లిక్స్‌లో కింగ్ డమ్

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ దర్శకత్వంలో వచ్చిన కింగ్ డమ్ సినిమా ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. అన్నదమ్ముల కథకు మాఫియా ఇతివృత్తం జోడించి తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పుడు ఈనెల 27 నుంచి నెట్ ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళంలో కింగ్ డమ్ పేరుతో, సామ్రాజ్య పేరుతో హిందిలో ప్రసారం అవుతోంది. థియేటర్స్‌లో రిలీజ్ అయి సక్సెస్ ఫుల్ రన్ అయిన ఈ సినిమా ఓటిటి ప్లాట్ ఫామ్‌లో హిట్ అవుతుందని దర్శకుడు గౌతమ్ చెప్పారు.



## కట్టలన్ షూటింగ్ షురూ

క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మాస్ యాక్షన్ థ్రిల్లర్ మార్కో పాన్ ఇండియా హిట్ అయ్యింది. ఇప్పుడు అదే బ్యానర్‌పై ప్రొడ్యూసర్ షరీఫ్ మహమ్మద్ మరో భారీ ప్రాజెక్ట్ కట్టలన్ ను లాంచ్ చేశారు. మలయాళం, తెలుగు భాషల్లో పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ మూవీ పూజా కార్యక్రమం కొచ్చిలో జరిగింది. బాహుబలిలో కనిపించి ఫేమస్ అయిన చిరక్కల్ కలీదాసన్ ఏనుగు పూజా కార్యక్రమంలో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లగ్జరీ కార్లు, బైక్‌లు కూడా ఈవెంట్‌ను మరింత స్పెషల్ చేశాయి. సినిమాలోని కథలైన్‌ను దృష్టిలో పెట్టుకుని పూజా ప్రెజెంటేషన్ కూడా డిజైన్ చేశారు. ఈవెంట్‌లో యాంటోని వర్గీస్, కబీర్ దూహన్ సింగ్, రాజిషా విజయన్, హనన్ షా, జగదీష్, సిద్దిక్, పార్త్ తివారీ లాంటి స్టార్‌లు హాజరయ్యారు.



## గర్వపడుతున్నా

### సక్సెస్ మీట్‌లో అనుపమ పరమేశ్వరన్



అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్ చేసిన సినిమా 'పరదా'. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్ మీట్ సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ తెలుగు సినిమాలో పరదా ఒక డేరింగ్ స్టెప్. ఇలాంటి కథని బిలీవ్ చేసి ప్రొడ్యూస్ చేసిన మా నిర్మాత విజయ్‌కి ముందుగా ధన్యవాదాలు. ఇలాంటి సినిమాని చేసినందుకు గర్వపడుతున్నాను. పరదా నా కెరీర్‌లో మోస్ట్ ఫేవరెట్ ఫిలిం అని అన్నారు. డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఇందులో కొన్ని తప్పులు గురించి కూడా రాశారు. వాటిని కూడా నేను యాక్సెప్ట్ చేస్తున్నాను. అయితే ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. సినిమా చూసిన వాళ్ళు చాలా మంది అప్రిషియేట్ చేశారు.

# వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు

**ఓటు చోరీతో 8 మంది బిజెపి ఎంపిలు గెలిచారు**
**రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదు**
**బిఆర్ఎస్ ఖేల్ ఖతం**
**వర్ధన్నపేట జనహిత పాదయాత్రలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**

**ప్రజాపక్షం/వర్ధన్నపేట/వరంగల్ :** బిజెపి నేతలు ఎంపీలుగా గెలవడానికి, ప్రధాని మోదీ మూడవసారి అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లు( ఓట్ చోరీ)కారణమని, మోసం చేసి కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. వరంగల్ ఖిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని, వర్ధన్నపేట సాక్షిగా చెబుతున్నా రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని, 100 సీట్లతో మరోసారి అధికారంలోకి వస్తామని ప్రకటించారు. ఆ తరువాత విజయోత్సవ సభ వర్ధన్నపేటలో నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం చేపట్టిన జనహిత పాదయాత్రకు అడుగడుగునా కాంగ్రెస్ శ్రేణులు, నాయకుల, కార్యకర్తల ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, బి.మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొని శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. పాదయాత్రలో వారు కార్యకర్తలను పలకరిస్తూ, అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద మార్కెట్ యార్డ్ నుండి వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్లో కార్నర్ మీటింగ్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రసంగిస్తూ తెలంగాణలో 8 మంది బిజెపి ఎంపిల గెలుపుపై అనుమానం ఉందని, ఓట్ల చోరీ గురించి మాట్లాడితే బిజెపి ఎంపిలు భుజాలు తడుముకుంటున్నారని అన్నారు. ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతమని విమర్శించారు. బిసిల మీద అక్కసు ఎందుకని కిషన్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల గురించి మాట్లాడటానికి బిజెపి బిసి నేతలు భయపడుతున్నారని అన్నారు. బిసిలుగా చెప్పుకోడానికి హక్కు ఎక్కడిది అని బిజెపికి చెందిన బిసి ఎంపిలను నిలదీశారు. సిఎం రేవంత్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షులుగా ఉన్నపుడు పాదయాత్రలో భాగంగా నాటి వర్ధన్నపేట ఎమ్మెల్యేను ఓడగొడతమని చెప్పి మరీ ఓడించామని గుర్తు చేశారు. మేధావి అనుకునే ఎర్రబెల్లి దయాకర్ ను ఆయన కంటే వయసులో చిన్న అయిన యశస్వినీ రెడ్డి ఓడించారని అన్నారు. పదేళ్లు కెసిఆర్ మోసం చేశాడు కాబట్టే ఫాం హౌస్‌కి పరిమితమయ్యారని, దోచుకున్న సొమ్మును కాపాడుకోవడానికి కోర్టును ఆశ్రయించారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్ఎస్ ఉండబోదన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఉందా అని అనుమానం వస్తోందని, చెల్లి పంచాయతీ తీర్చలేని కెటిఆర్ ప్రజలను ఏం ఉద్ధరిస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్ ఎస్ ఖేల్ ఖతమవుతుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్రలో వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డి రామచంద్రనాయక్, యశస్విని రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే మురళి నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ పాల్గొన్నారు. కాగా ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో సోమవారం జరుగుతున్న రెండో విడత జనహిత పాదయాత్రలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ కొండ మురళీధర్ రావు పాల్గొన్నారు.



## పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### రైల్వే జనరల్ మేనేజర్‌కు ఎంపి చామల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవను సోమవారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల్ కిరణ్ కుమార్ రెడ్డి కలిసారు. ఘట్‌కేసర్ నుండి యాదాద్రి భువనగిరి వరకు ఎంఎంటిఎస్ రైలు భూ సేకరణ కోసం యాదాద్రి కలెక్టర్, మేడ్చల్ కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. భువనగిరి నుండి యాదాద్రి(రాయిగిరీ) పనులు మొదలయ్యాయి, వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికీ వచ్చే భక్తులకు అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయన్నారు. రామన్నపేటలో ఫలక్‌నుమా, శబరి, నారాయణాద్రి ఎక్స్ప్రెస్‌లో హాల్టింగ్ గురించి కూడా చర్చించారు. దినికి రైల్వే మేనేజర్ సనుకూలంగా స్పందించారు. వీరితోపాటు సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, ఎంఎంటిఎస్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయిప్రసాద్‌లు ఉన్నారు

## సర్కార్‌కు చింతలేదు (మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు పొందడం వరకు పేపర్ లీక్ మాఫియాలకు అప్పగించిందని, బిజెపి –ఆర్ఎస్ఎస్ విద్యా వ్యవస్థను నాశనం చేసిందని దుయ్యబట్టారు. దేశంలోని యువత ఆగ్రహంతో ఉన్నారని, ఈ అన్యాయాన్ని సహించదని ఖర్గే పేర్కొన్నారు. రాంలీలా మైదానంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఎస్ఎస్‌సి అభ్యర్థులు, ఉపాధ్యాయులపై దారుణమైన లాఠీచార్జి సిగ్గుచేటు మాత్రమే కాదు, పిరికి ప్రభుత్వ లక్షణమని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. యువత తమ హక్కులు, ఉపాధి, న్యాయం మాత్రమే డిమాండ్ చేశారని, కాయినా వారిపై లాఠీచార్జ్ జారిగిందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వానికి దేశంలోని యువత గురించి లేదా వారి భవిష్యత్తు గురించి ఆందోళన లేదని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల ఓట్లతో కాదు, ఓట్లను దొంగిలించడం ద్వారా అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. 'ముందుగా ఓట్లను దొంగిలిస్తారు. తర్వాత పరీక్షలను దొంగిలిస్తారు. తర్వాత ఉద్యోగాలను దొంగిలిస్తారు. తర్వాత హక్కులను, గొంతును నలిపివేస్తారు! యువత, రైతులు, పేదలు, బహుజనులు, మైనారిటీల ఓట్లు అవసరం లేదు, అందువల్ల డిమాండ్లు ఎప్పటికీ వారి ప్రాధాన్యత కావు అని అన్నారు. ఇప్పుడు భయపడకుండా ధైర్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈ అంశంపై కేంద్రాన్ని విమర్శించారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్‌సి విద్యార్థులపై పోలీసు బలగాలను ఉపయోగించడం 'అమానవీయం, సిగ్గుచేటు' అని ఆమె ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. ప్రతి పరీక్షలో రిగ్గింగ్, ప్రతి రిక్రూట్‌మెంట్‌లో స్కామ్, పేపర్ లీక్‌ల ద్వారా మొత్తం దేశంలోని యువత ఇబ్బంది పడుతున్నారని, బిజెపి పాలనలో నియామక ప్రక్రియ, పరీక్షలలో అవినీతి యువత భవిష్యత్తును నాశనం అవుతోందని అని ప్రియాంక గాంధీ అన్నారు. దాన్ని సరిదిద్దడానికి, యువత మాట వినడానికి బదులుగా, వారిపై లాఠీఛార్జ్ చేయడం దురదృష్టకరమన్నారు. ఢిల్లీ పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, రాంలీలా మైదానంలో దాదాపు 1,500 మంది నిరసనకారులు సమావేశమయ్యారు. 100 మంది అనుమతి సమయం తర్వాత కూడా అక్కడి నుండి బయటకు వెళ్లడానికి నిరాకరించారు. వెళ్లని వారిలో 44 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి లాఠీ ఛార్జ్ జరగలేదని తెలిపారు.

## ఇజ్రాయెల్ సైనిక దళం దాడి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన మరో కాంట్రాక్టు ఫోటో జర్నలిస్టు హాతెమ్ ఖాలిద్ దాడుల్లో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. 33 ఏళ్ళ వయసుగల అసోసియేటెడ్ ప్రెస్ ఫ్రీలాన్సర్, విజువల్ జర్నలిస్టు మరియం దగ్గా, అమెరికా టివి నెట్‌వర్క్ ఎన్‌బిసి విజువల్ జర్నలిస్టు మోయెజ్ అబుతహా, అల్‌జజీరా ఫొటో జర్నలిస్టు మహ్మద్ సలామా అక్కడికక్కడే మరణించారు. మరో జర్నలిస్టు అహ్మద్ అబూ అజీజ్ గాయాలతో చికిత్సపొందుతూ మరణించారు. వీరితో పాటు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా మరణించారు. ఐతే ఈ మరణాలను ఐడిఎఫ్ ఇంత వరకూ ధృవీకరించలేదు.ఈ దాడులను ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆసుపత్రి భవనంపై ఎందుకు దాడి చేసిందనే విషయాన్ని చెప్పలేదు. కానీ దాడిపై ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. సోమవారం తెల్లారుజామున మొదటిసారి నస్సెర్ ఆసుపత్రిపై జరిగిన గగనతల దాడుల్లో ఏడుగురు మరణించారు. దీంతో జర్నలిస్టులు హుటాహుటిన అక్కడికి వెళ్ళారు. ఆ తర్వాత మళ్ళీ రెండోసారి కూడా నస్సెర్ ఆసుపత్రిపై ఐడిఎఫ్ దాడులు చేయడంతో జర్నలిస్టులు సహా 12 మంది మరణించారు. మొదటిసారి దాడులు జరిగిన వెంటనే తమ ఫోటో జర్నలిస్టు నస్సెర్ ఆసుపత్రికి వెళ్ళి లైవ్ వీడియో షూటింగ్ చేస్తుండగా రెండోసారి దాడులు జరిగాయనీ, దీంతో ఈ లైవ్ వీడియో షూటింగ్ అర్ధాంతరంగా మధ్యలోనే ఆగిపోయిందని రాయిటర్స్ తెలియజేసింది.
15 రోజులక్రితం ఆగస్టు పదో తేదీన గాజా సిటీ అల్–షిఫా ఆసుపత్రి సమీపంలో ఆరుగురు జర్నలిస్టులను హత్యచేసింది. ఆనాటి దాడుల్లో నలుగురు జర్నలిస్టులు మరణించారు. ఇలా ఈ ఒక్కనెలలోనే ఎనిమిదిమంది జర్నలిస్టులు ఐడిఎఫ్ దాడుల్లోమరణించినట్లయింది. 2023 అక్టోబరు ఏడో తేదీ నుండి గాజాలో ఐ డి ఎఫ్ కొనసాగిస్తున్న దాడుల్లో సోమవారం నాటికి 689 రోజులుగా మొత్తం 244 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించగా, 22 నెలల యుద్ధంలో 192 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు కమిటీ టూ ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) ప్రకటించింది. ప్రధానంగా అల్ జజీరా న్యూస్ ఛానల్‌కు చెందిన జర్నలిస్టులకు, హమాస్ ఉగ్రవాదులకు సంబంధం ఉందని, హమాస్ ఉగ్రవాదులకు అల్ జజీరా జర్నలిస్టులు ఏజంట్లుగా వ్యవహరిస్తున్నారని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆరోపిస్తూ ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టులను, జర్నలిస్టు కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి హతమారుస్తున్నది. ఇప్పటివరకూ ఆరుగురు అల్‌జజీరా జర్నలిస్టులను గురిచూసి ఐడిఎఫ్ హత్యచేసింది.
రాయిటర్స్ వార్తాసంస్థ, నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఎన్‌బిసి) రెండు అనుసంధానమై ఉమ్మడిగా పనిచేస్తున్నాయి. ఈ ఒప్పందం కింద రాయిటర్స్ వార్తాసంస్థ ఇంటర్నెట్ సహా ఇతర హార్డ్‌వేర్ సదుపాయాలను సమకూరిస్తే, ఎన్‌బిసి సంస్థ డిజిటల్ సేవలను అందిస్తూ మధ్యప్రాచ్యంలో వార్తలను ప్రపంచానికి అందిస్తున్నాయి. దక్షిణ గాజా ఖాన్‌యూనిస్‌లో నజీర్ ఆసుపత్రిపై ఐడిఎఫ్ దాడుల సందర్భంగా తమ ఇద్దరు జర్నలిస్టులు మరణించినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది.

## రిటైర్డ్ జడ్జీల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

లేకపోతే 2020 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమై ఉండేదని ఆయన పేర్కొన్నారు. 'సల్వా జుడుం కేసులో సుప్రీంకోర్టు తీర్పును బహిరంగంగా తప్పుగా అర్థం చేసుకుంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటన దురదృష్టకరం. ఈ తీర్పు ఎక్కడా, స్పష్టంగా లేదా బలవంతంగా దాని పాఠ్యాంశం, నక్సలిజం లేదా దాని భావజాలాన్ని బలపరచడం లేదు' అని 18 మంది మాజీ న్యాయమూర్తులు సంతకం చేసిన ప్రకటన పేర్కొంది. ఈ ప్రకటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు ఎ.కె. పట్నాయక్, అభయ్ ఓకా, గోపాల గౌడ, విక్రమ్‌జిత్ సేన్, కురియన్ జోసెఫ్, మదన్ బి.లోకూర్, జె.చలమేశ్వర్ సంతకం చేశారు. భారత ఉపరాష్ట్రపతి పదవికి ప్రచారం సైద్ధాంతికంగా ఉండవచ్చు, కానీ దానిని నాగరికంగా, గౌరవంగా ఎదుర్కోవాలి, ఒక అభ్యర్థి భావజాలాన్ని విమర్శించడాన్ని మానుకోవాలని రిటైర్డ్ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును ఉన్నత రాజకీయ అధికారి పక్షపాతపూరితంగా తప్పుగా అర్థం చేసుకోవడం సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కుదిపేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భారత ఉపరాష్ట్రపతి పదవి పట్ల గౌరవంతో 'అపకీర్తికి దూరంగా ఉండటం తెలివైన పని అని రిటైర్డ్ న్యాయమూర్తులు అన్నారు. సుప్రీంకోర్టుకు చెందిన ఏడుగురు రిటైర్డ్ న్యాయమూర్తులతో పాటు, ముగ్గురు హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులు గోవింద్ మాథుర్, ఎస్.మురళీధర్, సంజీబ్ బ్యానర్జీ కూడా ఈ ప్రకటనపై సంతకం చేశారు. లేఖపై సంతకం చేసిన ఇతర వ్యక్తులలో హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు అంజనా ప్రకాష్, సి.ప్రవీణ్ కుమార్, ఎ.గోపాల్ రెడ్డి, జి రఘురామ్, కె.కన్నన్, కె.చంద్రు, బి.చంద్రకుమార్, కైలాష్ గంభీర్ ఉన్నారు. ప్రొఫెసర్ మోహన్ గోపాల్, సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కూడా ఈ ప్రకటనపై సంతకం చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'మన దేశానికి ఉన్న గొప్ప దురదృష్టం టూఇన్‌వన్ డబ్ల్యుఎండి – హానికరమైన పరువు నష్టం, దుర్మార్గపు వక్రీకరణ ఆయుధం అని అన్నారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు సహా భారతదేశంలోని అత్యంత ప్రముఖ న్యాయవాదులు 20 మంది జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై అమిత్ చేసిన అబద్ధాలను బయటపెట్టారన్నారు. శుక్రవారం కేరళలో షా మాట్లాడుతూ, 'సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి సహాయం చేసిన వ్యక్తి. ఆయన సల్వా జుడుం తీర్పు ఇచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోతే, 2020 నాటికి నక్సల్ ఉగ్రవాదం అంతమై ఉండేది. సల్వా జుడుం తీర్పు ఇచ్చిన భావజాలంతో ప్రేరణ పొందిన వ్యక్తి ఆయన' అని అన్నారు. శనివారం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, హోంమంత్రితో సమస్యలపై చర్చించడం తనకు ఇష్టం లేదని, ఆ తీర్పు తనది కాదని, సుప్రీంకోర్టు తీర్పు అని నొక్కి చెప్పారు. పూర్తి తీర్పును చదివి ఉంటే షా ఆ వ్యాఖ్యలు చేసి ఉండే వారు కాదని కూడా ఆయన అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com